మరవరాని మన చరిత్ర

రూ॥40/-

పేజీలు:40



నవచేతన పబ్లిషింగ్ హౌస్

గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54

E-mail: navachethanaph@gmail.com

నవచేతన బుక్ హౌస్

బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 08, సంచిక: 24 | శుక్రవారం | 20-12-2024 | కరీంనగర్ | Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



రేవంత్ సారథ్యంలో ఇక 'నవశకం'!

ఉక్రేన్‌పై రోజురోజుకూ పట్టు సాధిస్తున్నాం

లోపలి పేజీల్లో




## ఒఆర్ఆర్ టోల్ టెండర్లపై 'సిట్'

### అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

అవుటర్ రింగ్ రోడ్ టోల్ టెండర్ల అంశంపైన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించారు. శాసనసభలో గురువారం జరిగిన "రాష్ట్ర రుణాల" పైన స్వల్పకాలిక చర్చలో భాగంగా అవుటర్ రింగ్‌రోడ్ అంశం ప్రస్తావనకు రావవడంతో దీనిపైన సిఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ అవుటర్ రింగ్ రోడ్డును ఆయాచితంగా, అప్పనంగా ఎవరికో అప్పగించారని ఆరోపించారు. మంత్రివర్గంలో చర్చించి తరువాయి 2లో

## మాకేం తెలియదు

- కాళేశ్వరం కమిషన్ విచారణకు స్మితా సభర్వాల్, సోమేశ్‌కుమార్ హాజరు
- కమిషన్ ప్రశ్నలకు గుర్తులేదు... అవగాహన లేదన్న స్మిత
- తాను సిఎస్ కాకముందే ప్రాజెక్టు పూర్తయింది : సోమేశ్ కుమార్





ప్రజాపక్షం / హైదరాబాద్

మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజ్‌ల నిర్మాణ అనుమతులకు సంబంధించిన పలు అంశాలు తనకు "తెలియదు... గుర్తు లేదు... అవగాహన లేదు" అని మాజీ సిఎం కెసిఆర్ కార్యాలయంలో మాజీ కార్యదర్శి స్మితా సభర్వాల్ కాళేశ్వరం కమిషన్‌కు చెప్పారు. గత ప్రభుత్వ సిఎంఓ కార్యాలయంలో పదేళ్ల పాటు కార్యదర్శిగా పనిచేస్తూ, ఏడు శాఖలను పర్యవేక్షించినట్లు కమిషన్‌కు ఆమె వివరించారు. సాంకేతిక అంశాల జోలికి వెళ్లలేదని వివిధ శాఖలను సమన్వయం మాత్రం చేశానని ఆమె సమాధానం చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల కుంగుబాటు, అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ గురువారం రెండో రోజు తరువాయి 2లో

## అవి అబద్ధాలు

# తప్పుడు లెక్కలు

### గత ప్రభుత్వ హయాంలో రూ.7లక్షల కోట్ల అప్పులు చేసినా హరీశ్‌కు దాహం తీరలేదు

### అబద్ధాలు చెప్పడం బిజెపికి వెన్నతో పెట్టిన విద్య..

### ఏడాదిలో గత అప్పులు, వడ్డీల రూపంలో రూ. 1,18,364 కోట్లు చెల్లించాం

### శాసనసభలో 'రుణాల' స్వల్పకాలిక చర్చలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరబాద్



అబద్ధాలు చెప్పడం బిఆర్‌ఎస్‌కు వెన్నతో పెట్టిన విద్య అని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో రూ.7,11,911కోట్ల అప్పులు చేసినప్పటికీ ,మరింత అప్పులు చేసేందుకు అనేక అబద్ధాలు, తప్పుడు లెక్కలు చెప్పారని, ఇందుకు గత ప్రభుత్వ బడ్జెట్ పుస్తకాల్లో, కొత్త పదాలను చేర్చారని విమర్శించారు. రూ.7లక్షల కోట్ల అప్పు చేసినా నాటి ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావుకు అప్పుల దాహం తీరలేదని, ఇంకెంత వరకు అప్పులు చేస్తే అప్పుల దాహం తీరుతుందని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది కాలంలో రూ. 1,06,247 కోట్లు అప్పులు చేస్తే, ఇందులో గతంలో చేసిన అప్పులు, అప్పలకు వడ్డీల రూపంలో రూ. 1,18,364 కోట్లు చెల్లించామని, తాము చేసిన అప్పు కంటే కూడా అదనంగా రూ. 12,117 కోట్లు అని భట్టి వివరించారు. పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి, నిరుద్యోగులను గాలికి వదిలేశారన్నారు. శాసనసభలో రుణాలపైన గురువారం జరిగిన స్వల్పకాలిక చర్చలో సభ్యులు ప్రస్తావించిన అంశాలకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కమల్లు సమాధానమిచ్చారు. ప్రభుత్వ బడ్జెట్ లెక్కల ఆధారంగానే ఆర్‌బిఐ నివేదికలో లెక్కలను పొందపరుస్తుందని, తరువాయి 2లో

## ఫార్ములా ఈ-కార్ రేస్ కేస్

# ఎ1 కెటిఆర్



### ఎ2గా ఐఎఎస్ అరవింద్ కుమార్, ఎ3గా హెచ్‌ఎండిఎ అధికారి బిఎల్‌ఎన్ రెడ్డిపై ఎసిబి ఎఫ్ఐఆర్

రెండురోజుల్లో నోటీసులు జారీచేసే అవకాశం

అనుమతులు లేకుండా రూ.55 కోట్లు చెల్లించినట్లు ఆరోపణలు



ప్రజాపక్షం/హైదరాబాద్

ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్‌పై అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) ఎట్టకేలకు గురువారం కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఎ1గా కెటిఆర్, ఎ2గా అప్పటి పురపాలక శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సీనియర్ ఐఎఎస్ అధికారి అరవింద్‌కుమార్, ఎ3గా హెచ్‌ఎండిఎ చీఫ్ ఇంజనీర్ బిఎల్‌ఎన్ రెడ్డిల పేర్లను ఎసిబి చేర్చింది. ఎఫ్ఐఆర్‌లో నిందితులపై 13 (1) ఏ, 13 (2) పీసీ యాక్ట్, 409, 102 బి సెక్షన్ల కింద కేసు బుక్ చేశారు. ఈ మూడు సెక్షన్లు కూడా నాన్ బెయిలబుల్ కేసులే కావడం గమనార్హం. 'ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్' యాక్ట్ కింద ఈ కేసులను ఎసిబి నమోదు చేసింది. త్వరలోనే ఈ కేసు విచారణ నిమిత్తం ఎసిబి అధికారులు ఈ ముగ్గురు నిందితులకు నోటీసులు జారీ చేసే అవకాశముంది. ఫార్ములా ఈ-కార్ రేసు వ్యవహారంలో కెటిఆర్‌పై విచారణ జరిపేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఇటీవలే ప్రభుత్వానికి అనుమతి మంజూరు చేశారు. గవర్నర్ అనుమతితో సర్కారు తదుపరి చర్యలకు ఉపక్రమించింది. సోమవారం కేబినెట్ సమావేశంలో నిర్ణయం మేరకు ఈ-కార్ రేసింగ్‌పై విచారణ చేపట్టాలని ఎసిబికి మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి లేఖ రాశారు. ఇకార్ రేసింగ్‌పై వివాదాస్పదంగా మారిన విదేశీ సంస్థకు నగదు చెల్లింపులపై ప్రధానంగా దర్యాప్తు జరగనుంది. మంత్రివర్గం,హెచ్‌ఎండిఎ, ఆర్థికశాఖ, ఆర్‌బిఐ అనుమతి లేకుండానే రూ.55 కోట్ల చెల్లింపులు జరిగాయి. వీటిలోనూ రూ.46 కోట్ల వరకు డాలర్ల రూపంలో చెల్లించారనేది ప్రధాన అభియోగం. విదేశీ సంస్థకు నగదు చెల్లింపులపై ఎసిబి దర్యాప్తు చేయనుంది. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌పై 2022 అక్టోబరు 25న ఒప్పందం కుదిరింది. ఫార్ములాఇ ఆపరేషన్స్, ఎస్ నెక్స్ట్ జెన్, పురపాలక శాఖలు ఒప్పందం తరువాయి 2లో

### ఈవి హబ్‌గా మార్చాలనే లక్ష్యంతోనే...

**హైదరాబాద్ :** తెలంగాణను ఎలక్ట్రిక్ వాహనాలకు (ఈవి) హబ్‌గా మార్చాలనే లక్ష్యంతోనే హైదరాబాద్‌లో ఫార్ములా ఈ-కార్ రేస్ నిర్వహించామని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ తెలిపారు. ఫార్ములా ఈ-కార్ రేస్ వ్యవహారంలో ఎసిబి తనపై కేసు నమోదు చేసిన నేపథ్యంలో.. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో ఈ-కార్ రేస్ జరపాలని ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. 2001లోనే చంద్రబాబు ఫార్ములా-1 రేస్ పెట్టాలని ప్రయత్నించారు. దురదృష్టవశాత్తూ చంద్రబాబు ప్రయత్నాలు ఫలించలేదు. నాలుగు కోట్ల ప్రజల మధ్య ఈ అంశంపై చర్చ పెట్టాలని శాసనసభ స్పీకర్‌ను కోరా. ఫార్ములా ఈ-కార్ అంశంపై చర్చించే సత్తా ప్రభుత్వానికి లేదు. అక్రమాలు చేశామని ప్రభుత్వం అంటోంది. అక్రమాలు నిరూపించకుండా లీకులిస్తూ ఆరోపణలు చేస్తున్నారు. ఫార్ములా - 1 రేస్ ట్రాక్ కోసం గోపన్‌పల్లిలో భూ సేకరణ జరిగింది. అక్కడ సిఎం రేవంత్ రెడ్డికి కూడా 15 ఎకరాల భూమి తరువాయి 2లో

## నిధుల సాధనకు

# సమష్టి పోరాటం

- కేంద్రం నుంచి రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావలసిన నిధులు రాబట్టాలి
- కాంగ్రెస్, బిఆర్‌ఎస్ సభ్యులకు సిపిఐ శాసనసభాపక్ష నేత సాంబశివరావు సూచన
- లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేస్తే ఎక్కడికి పోయాయో లెక్కలు తీయాలని డిమాండ్
- ఆర్థిక మంత్రి భట్టి, మాజీమంత్రి హరీశ్ చెబుతున్న లెక్కల్లో ఎక్కడో తేడా కనిపిస్తోందని వ్యాఖ్య

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన న్యాయబద్ధమైన నిధులను సాధించే వరకు అందరూ కలిసికట్టుగా పోరాటం చేయాలని సిపిఐ శాసనసభాపక్ష నాయకుడు కూనంనేని సాంబశివ రావు కాంగ్రెస్, బిఆర్‌ఎస్ సభ్యులకు సూచించారు. లక్షల కోట్ల రూపాయల అప్పు చేస్తే, ఆ డబ్బులు ఎక్కడికి పోయాయని, ఎవరి వద్దకు వెళ్లాయని, ఎవరి చేతుల్లోకి , ఎంత పోయిందో లెక్కలు తీయాలని డిమాండ్ చేశారు. 'ధరణి ' సింగరేణి , విద్యుత్ సంస్థలలో జరిగిన కుంభకోణాలను, నల్లడబ్బును కూడా వెలుగులోనికి తీయాలని, దొంగతనంగా రాసుకున్న ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. అవినీతిని అరికట్టి, ప్రభుత్వ ఆధాయాలను పెంచుకోవాలని, తద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. శాసనసభలో గురువారం "రాష్ట్ర రుణా"లపైన జరిగిన స్వల్పకాలిక చర్చలో కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తరువాయి 2లో

## పార్లమెంటు ప్రాంగణంలో

# ఎంపిల జగడం

రాహుల్‌ను అడ్డుకున్న బిజెపి సభ్యులు, ఖర్గేపై దౌర్జన్యం

బిజెపి, కాంగ్రెస్ ఎంపీలకు గాయాలు

పోలీసులకు,సభాపతులకు పరస్పర ఫిర్యాదులు

బిజెపి మహిళా ఎంపి ఫిర్యాదు

ఆరోపణలకు రాహుల్ ఖండన



**న్యూఢిల్లీ :** అంబేద్కర్‌పై రాజ్యసభలో కేంద్రహోంమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలు మరింత దుమారం రేపాయి. ఈ వాగ్వాదం పార్లమెంటు ప్రాంగణంలో గురువారంనాడు అసాధారణ జగడానికి దారితీసింది. ఈ జగడంలో అటు బిజెపి, ఇటు కాంగ్రెస్‌పార్టీకి చెందిన ఎంపీలు గాయపడ్డారు. బిజెపి ఎంపీలు ముకేశ్ రాజ్‌పుత్, ప్రతాప్‌చంద్ర సారంగిలకు గాయాలు తగిలాయి. వారిని ఆర్‌ఎంఎల్ ఆసుపత్రిలో చేర్చారు. ఈ ఘటనలపై ఎన్‌డిఎ కూటమి పార్టీలు, కాంగ్రెస్‌పార్టీకి చెందిన ఎంపీలు పరస్పరం పోలీసు ఫిర్యాదులు చేసుకున్నారు. రాజ్యసభ,లోక్‌సభాపతులకు కూడా అధికార,ప్రతిపక్ష ఎంపీలు ఫిర్యాదులు చేశారు. రాజ్యసభలో ప్రతిపక్షనాయకుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీపట్ల బిజెపి నాయకులు అనుచితంగా ప్రవర్తించారు. ఖర్గేపై దౌర్జన్యం చేశారని కాంగ్రెస్ ఎంపీల ప్రతినిధిబృందం తరువాయి 12లో

### అమిత్ షాపై ఖర్గే హక్కుల ఉల్లంఘన నోటీసు

అంబేద్కర్‌ను అవమానిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే గురువారంనాడు రాజ్యసభకు హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌కు సమర్పించిన నోటీసులో, రాజ్యాంగరూపశిల్పి అంబేద్కర్‌ను అమిత్ షా అవమానించారని తద్వారా రాజ్యసభలో హక్కుల ఉల్లంఘనకు పాల్పడి, సభ నిబంధనలను ఉల్లంఘించారని ఫిర్యాదు చేశారు. "అమిత్‌షా హక్కుల ఉల్లంఘనను ప్రశ్నిస్తూ నోటీసు ఇస్తున్నాను, రాజ్యసభావ్యవహారాలలో ప్రవర్తనను తరువాయి 12లో



మార్చి 21 నుంచి

## టెన్త్ పరీక్షలు

**హైదరాబాద్ :** రాష్ట్రంలో పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది మార్చి 21 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ఎస్ఎస్‌సి బోర్డు షెడ్యూల్ విడుదల చేసింది. ఫరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనున్నాయి. ఇక ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పరీక్షలను ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నారు. మార్చి 21న ఫస్ట్ లాంగ్వేజ్, 22న సెకండ్ లాంగ్వేజ్, 24న ఇంగ్లీష్ , 26న గణితం, 28న ఫిజిక్స్, 29న బయాలజీ, ఏప్రిల్ 2న సోషల్ స్టడీస్ పరీక్షలు జరగనున్నాయి. ఏప్రిల్ 3న ఒకేషనల్ కోర్సు పేపర్-1 భాషా పరీక్ష, 4న ఒకేషనల్ కోర్సు పేపర్-2 భాషా పరీక్ష జరగనుంది.

## అమిత్‌షా రాజీనామా చేయాలి

### అంబేద్కర్‌ను అవమానించడంపై దేశవ్యాప్త నిరసనకు సిపిఐ పిలుపు



**న్యూఢిల్లీ :** రాజ్యాంగ నిర్మాత, రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను ఉద్దేశించి అవమానకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా తక్షణమే ఆయన చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పి పదవికి రాజీనామా చేయాలని సిపిఐ డిమాండ్ చేసింది. అమిత్ షా చేసిన వ్యాఖ్యల ద్వారా అంబేద్కర్‌పై ఆయన, ఆయన పార్టీ మనువాద మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని డి.రాజా ఒక ప్రకటనలో విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్, దాని అనుబంధ సంస్థలు ఎన్నడూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని సమర్థించలేదన్నారు. అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సిపిఐ శాఖలన్నీ నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

## అమిత్‌షా వ్యాఖ్యలపై

# దేశవ్యాప్తంగా నిరసనలు

### అంబేద్కర్‌ను అవమానించిన కేంద్రమంత్రి రాజీనామా చేయాలి

### ఈ అంశం నుంచి దృష్టి మళ్లించేందుకు బిజెపి యత్నం

### కాంగ్రెస్ ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్ విమర్శ



**న్యూఢిల్లీ :** రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్ షా అవమానించిన అంశం నుండి బిజెపి దృష్టిని మళ్లిస్తోందని కాంగ్రెస్ గురువారం ఆరోపించింది. అమిత్ షా తక్షణమే రాజీనామా చేసి తన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది.బిజెపి 'రాజ్యాంగ వ్యతిరేకి', 'అంబేద్కర్ వ్యతిరేకి' అని ఆరోపించింది.ఢిల్లీలోని ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మాట్లాడుతూ అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలను ఖండించారు. దీనికి వ్యతిరేకంగా ఇప్పటికే ఉద్యమం ప్రారంభమైందని, దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగిస్తామని వారు చెప్పారు.అంబేద్కర్‌పై షా చేసిన వ్యాఖ్యల నుండి బిజెపి దృష్టి మళ్లించాలని భావిస్తోందని, అందుకే వారు ఇతర అంశాలను లేవనెత్తుతున్నారని ఖర్గే అన్నారు. కాంగ్రెస్ నేతలు హోంమంత్రి షా రాజీనామాను మాత్రమే డిమాండ్ చేస్తున్నారని , మా డిమాండ్లకు మద్దతుగా నిరసన తెలుపుతున్నారని, కానీ బిజెపి ఎంపీలు మమ్మల్ని పార్లమెంటులోకి ప్రవేశించకుండా అడ్డుకున్నారని ఆయన అన్నారు. 'వారు నన్ను నెట్టారు, నేను అదుపు తప్పడంతో కూలబడ్డాను'ని ఖర్గే తెలిపారు. అంబేద్కర్ ను హోం మంత్రి అవమానించారనే అంశాన్ని లేవనెత్తుతూ దేశవ్యాప్తంగా ఉద్యమం నిర్వహిస్తామన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచన 'రాజ్యాంగ వ్యతిరేకం' 'అంబేద్కర్ వ్యతిరేకం' అని రాహుల్ గాంధీ అన్నారు.'బిజెపి దృష్టి మళ్ళించడంలో నిమగ్నమైంది. అంబేద్కర్ పై హోంమంత్రి చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు తరువాయి 12లో



## కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను

# బర్తరఫ్ చేయాలి

### జాతికి క్షమాపణ చెప్పాలి - కాంగ్రెస్ డిమాండ్

### అసెంబ్లీ ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నాయకుల నిరసన

ప్రజాపక్షం / హైదరాబాద్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను అవమాన పరిచే విధంగా మాట్లాడిన కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని, జాతికి క్షమాపణ చెప్పాలని రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేసింది. అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా అసంబ్లీ ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి తరువాయి 12లో

## 'బలగం' మొగిలయ్య కన్నుమూత



ప్రజాపక్షం /వరంగల్ ప్రతినిధి

'బలగం' మూవీ ఫేమ్ జానపద కళాకారుడు మొగిలయ్య మృతి చేందారు. నర్సంపేట నియోజకర్గం దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన ఆయన గత కొద్ది రోజుల నుంచి కిడ్నీ వ్యాధితో పాటు, గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. కొన్నాళ్లుగా ఇంటి వద్ద వైద్య చికిత్స తరువాయి 2లో


తెలంగాణ కళాకారులు తమ గళాలకు, కవులు తమ కలాలకు

పదును పెట్టాలి 02

## ఆఫ్ఘనిస్థాన్‌లో రెండు బస్సుప్రమాదాలు

52 మంది మృతి



**అద్నాన్ :** అఫ్ఘానిస్థాన్‌లో రెండు బస్సు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో 52 మంది మరణించారు. మరో 65 మంది గాయపడ్డారు. ఘజ్నీ రాష్ట్రంలో రాజధాని కాబూల్‌కు దక్షిణ నగరం కాందహార్‌కు మధ్య జాతీయ రహదారిపై బుధవారం రాత్రి పొద్దుపోయాక ఈ రెండు బస్సు ప్రమాదాలు జరిగాయని ఘజ్ని రాష్ట్ర సమాచార, సాంస్కృతిక విభాగాధిపతి హమీదుల్లా నిసార్ ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. సెంట్రల్ ఘజ్నీలోని షాబాజ్ గ్రామంలో ఒక బస్సు ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. మరోబస్సు తూర్పు అంధార్ జిల్లాలో ఒక లారీని ఢీ కొట్టింది. అఫ్ఘానిస్థాన్‌లో రోడ్డు ప్రమాదాలు అత్యంత సహజంగా మారాయి. రహదారులు ఏ మాత్రం బాగోకపోవడం, ఎవరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, సరైన నియంత్రణ చర్యలు లేకపోవడం వంటి అనేక సమస్యల కారణంగా రోడ్డు ప్రమాదాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు మరణిస్తున్నారు.

## లెక్కలు (మొదటి పేజీ తరువాయి)

ఇందులోభాగంగానే గత ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా హరీశ్ రావు ప్రవేశపెట్టిన బడ్జెట్ పుస్తకంలోని లెక్కలనే ఆర్‌బిఐ తన నివేదికలోఅప్పుల లెక్కలను పొందపర్చిందని, ఆ లెక్కలనే మళ్లీ హరీశ్‌రావు సభలో , బయట ప్రస్తావిస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ తరహ లో తాము ప్రభుత్వం ఆస్తులను అమ్ముకోలేదని, ఒఆర్ఆర్‌ను లీజుకు ఇచ్చుకోలేదని ఎద్దేవా చేశారు. ఏ ఆస్తులను అమ్మకుండానే హామీలను అమలు చేస్తున్నామన్నారు. పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం కనీసం పాఠశాలల డైట్ బిల్లులు కూడా పెంచలేదన్నారు. పెండింగ్ బిల్లులో రూ.40,154 కోట్లతో కలిపి మొత్తం తెలంగాణరాష్ట్ర అప్పులు రూ.7,11,911 కోట్లు అని స్పష్టం చేశారు. ఏడాది పాలనలో తాము ఎటువంటి దుబారా చేయలేదన్నారు. ఉచిత విద్యుత్ కాంగ్రెస్‌పేటెంట్‌హక్కు అని, ఈ పథకం కింద బిఆర్ఎస్ ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను సరఫరాచేసినప్పటికీ దీనికి సంబంధించిన బిల్లులనుమాత్రం చెల్లించలేదని, చివరకు ఆబిల్లులను తామే చెల్లిస్తున్నామని తెలిపారు. గతంలో హరీశ్‌రావు సభను తప్పుదోవ పట్టించారని, ఇది పాలకులకు ఉండాల్సిన లక్షణం కాదని, పాలకులకు విశాల దృక్పథం ఉండాలని సూచించారు.

## బలగం మొగిలయ్య కన్నుమూత
(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం మృతి చెందాడు. కాగా, జబర్దస్త్ ఫేమ్‌వేణు దర్శకత్వంలో వచ్చిన చిత్రం బలగంతో గుర్తింపు పొందాడు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అయితే ఈ సినిమాలో క్లైమాక్స్ పాట అందరినీ కన్నీళ్ళుపెట్టించింది. బుడగ జంగాల కళాకారులు పస్తం మొగిలయ్య దంపతులు పాడిన ఈ పాట తెలంగాణ ప్రజలను కన్నీళ్లు పెట్టించింది. మొగిలయ్య మృతితో గ్రామంలో విషాదశాయలు అలుముకున్నాయి. రాజకీయ నాయకులు, వివిధ కుల సంఘాల పెద్దలు, గ్రామస్తులు మొగిలయ్యకు కన్నీటి వీడ్కోలు పలికారు.

## టోల్ టెండర్లపై సిట్(మొదటి పేజీ తరువాయి)

విధివిధానాలను రూపొందిస్తామన్నారు. చాలా రోజుల నుంచి ఒఆర్ఆర్‌పై చర్చ జరుగుతోందని, ఎన్నికల కంటే ముందు హడావుడిగా సరైన విధివిధానాలు అవలంబించకుండా టెండర్ ప్రక్రియను డీవియేట్ చేసి, కొద్ది మంది వ్యక్తులకు ఆయాచిత లబ్ధి చేకూర్చడానికే అవుటర్ రింగ్‌రోడ్డును 30 సంవత్సరాల లీజుకు అప్పగించారని,సమాజమంతా, రాష్ట్రమంతా దీనిపై తీవ్ర చర్చ జరిగిందని సిఎం గుర్తు చేశారు. ఒఆర్ఆర్ లీజ్‌పైన విచారణ జరపాలని హరీశ్‌రావు కోరడం అభినందనీయమని, ప్రధాన ప్రతిపక్షం కోరిక మేరకు ఒఆర్ఆర్ టెండర్‌కు సంబంధించి ఈ సభ సభ్యులందరి ఆమోదంతో విచారణకు ఆదేశిస్తున్నానని అన్నారు. కృష్ణా గోదావరి నదీ జలాలు, ఒఆర్ఆర్, అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్, హైదరాబాద్ మెట్రో రైలు, ఫార్మా, ఐటీ కంపెనీలు, శాంతి భద్రతలు కాపాడటం, మత సామరస్యం పెంపొందించడంతోనే హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా రాణించిందని సిఎం అన్నారు.భాగ్యనగరం విశ్వనగరంగా ఎదుగుతుందంటే అందుకు కారణం కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. ఒఆర్ఆర్, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌తో రాష్ట్ర ఆదాయం పెరిగిందన్నారు. నాటి వైఎస్ఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో రాష్ట్ర ముఖచిత్రమే మారిపోయిందని చెప్పారు. హస్తం పార్టీ తీసుకున్న విధానపరమైన నిర్ణయాలతో రాష్ట్ర ఆదాయం పెరిగిందని సిఎం అన్నారు.

## ఎ1 కెటిఆర్ (మొదటి పేజీ తరువాయి)

కుదుర్చుకున్నాయి. 9, 10, 11, 12వ సీజన్ల కార్ రేస్లు హైదరాబాద్‌లో నిర్వహించేలా ఒప్పందం కుదిరింది. 2023 ఫిబ్రవరి 10, 11 తేదీల్లో నెక్లెస్‌రోడ్డులో తొమ్మిదో సీజన్ రేసింగ్ నిర్వహించారు. రెండు నెలల క్రితం ఎసిబికి అప్పటి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ ఫిర్యాదు చేశారు. ఫార్ములా ఈ రేస్ కోసం జరిగిన బ్యాంక్ లావాదేవీలపై ఎసిబి ఆరా తీసింది. పెట్టుబడులను రాబట్టే వ్యూహం పేరుతో గత సర్కారు హుస్సేన్ సాగర్ చుట్టూ ప్రత్యేక ట్రాక్ ఏర్పాటు చేసి రాకపోకలను నిషేధించి ఫార్ములా ఈ రేసింగ్ నిర్వహించింది. ఇందుకోసం భారీగా ఖర్చు చేసింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో 'కీ' రోల్‌లో ఉన్న ఉన్నతాధికారి అరవింద్‌కుమార్ అడ్డదారిలో ఈ ఒప్పందం చేసుకున్నట్లు తేలింది. కేబినెట్ అనుమతి లేకుండానే రేస్ నిర్వహణకు రూ.55 కోట్లు అడ్వాన్స్‌గా ముట్టజెప్పినట్లు బయటపడింది. అది కూడా ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో, కేవలం ఫోన్ల ద్వారానే ఇదంతా నడిపించారు. అత్యంత రద్దీగా ఉండే ట్యాంక్ బండ్ చుట్టూ ఐమాక్స్ సమీపంలో 2023లో కార్ల రేసింగ్ (ఫార్ములా రేస్ సీజన్ ఈవెంట్9)ను నిర్వహించారు. దీని వల్ల హైదరాబాద్ జనం నానా తిప్పలు పడ్డారు. అప్పుడు రేసింగ్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలకు హెచ్ఎండిఏ రూ.20 కోట్లు, రేస్‌కు ప్రమోటర్‌గా ఉన్న నెక్స్ట్ జెన్ అనే ప్రైవేట్ ఏజెన్సీ దాదాపు రూ.150 కోట్లు ఖర్చు చేసింది. క్యాంపెయిన్‌తో పాటు స్టాల్స్, సీటింగ్, స్ట్రీట్ లైట్లు.. ఇతర ఖర్చులన్నీ ఆ ఏజెన్సీ భరించింది.

## మార్చాలనే లక్ష్యంతోనే...
(మొదటి పేజీ తరువాయి)

ఉంది. ఎఫ్ 1 చుట్టూ నగరాల అభివృద్ధి ఆధారపడి ఉంది. ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీ తీసుకురావాలి. భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వాహనాలదే అవుతుందన్న ఉద్దేశంతో ఫార్ములా ఈ–కార్ రేస్ పెట్టాలని నిర్ణయించాం. చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడు 2001లో శామీర్‌పేట దగ్గర జీనోమ్ వ్యాలీ పెట్టారు. ఈరోజు అది ప్రపంచ వ్యాప్తంగా వ్యాక్సిన్ల ఉత్పత్తికి కేంద్రంగా మారింది. మొక్క ఒకరు నాటొచ్చు.. విత్తనం ఒకరు పెట్టొచ్చు.. దాని ఫలాలు మాత్రం భవిష్యత్ తరాలకు అందుతాయి. ముందు చూపుతో ప్రభుత్వాలు కొన్ని కార్యక్రమాలు చేయాలి.. చేస్తాయి. కెసిఆర్ నాయకత్వంలో ఆటోమొబైల్ రెన్యువబుల్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వెహికల్స్‌కు తెలంగాణ భారతదేశానికి కేంద్రంగా ఉండాలనే ఎజెండాతో ప్రయత్నాలు ప్రారంభించాం. ఈ–కార్ రేసింగ్ క్రెడిట్‌ను పొందేందుకు బిజెపి కూడా ప్రయత్నించింది. కేంద్రం సహకారంతోనే ఈ కారు రేసింగ్ జరుగుతోందని కిషన్‌రెడ్డి అన్నారు. సచిన్, ఆనంద్ మహీంద్రాతోపాటు దేశంలోని చాలా మంది ప్రముఖులు ఈ–కార్ రేసింగ్‌ను ప్రశంసించారు. క్రికెటర్లు, బాలీవుడ్ ప్రముఖులను ఈ–కార్ రేసింగ్ ఆకర్షించింది. తర్వాత సీజన్ ముంబయిలో నిర్వహించాలని మహారాష్ట్ర సీఎం అడిగారు. ప్రైవేటు వ్యక్తులు, ప్రభుత్వం కలిపి ఈ–రేస్ కోసం పెట్టిన ఖర్చు రూ.150 కోట్లు అయితే... దాదాపు రూ.750 కోట్ల ఆదాయం వచ్చింది' అని కెటిఆర్ తెలిపారు.

# ఉక్రేన్‌పై రోజు రోజుకూ పట్టు సాధిస్తున్నాం

### వార్షిక పత్రికాగోష్టిలో పుతిన్ వెల్లడి

ప్రపంచం

**మాస్కో :** రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ గురువారం నాడు ఇయర్ ఎండింగ్ పత్రికాగోష్టి నిర్వహించారు. అనేక విషయాల గురించి ఆయన మాట్లాడారు. ముఖ్యంగా ఉక్రేన్‌తో యుద్ధం, రష్యా ఆర్థిక పరిస్థితి, సిరియాలో అస్సాద్ ప్రభుత్వ వైఫల్యం, ట్రంప్ గెలుపు వంటి అనేక విషయాల గురించి ఆయన మాట్లాడారు. ఉక్రేన్ యుద్ధంలో తమ దళాలు రోజు రోజుకూ పురోగతి సాధిస్తున్నాయని, వాటి భూభాగాలను స్వాధీనం చేసుకుంటూ ముందుకు వెళుతున్నామని చెప్పారు. యుద్ధంలో తాము విజయానికి చేరువలో ఉన్నామనీ, ఐతే కుర్స్క్ రీజియన్‌పూ తిరిగి ఎప్పుడు నియంత్రణ సాధిస్తామనే విషయాన్ని మాత్రం తాను చెప్పలేనని అన్నారు. ఉక్రేన్ రాజధాని కీవ్‌పై తమ ఓరెష్నిక్ క్షిపణితో దాడిచేస్తే ముందుగానే చెబుతామని, అప్పుడు నాటో కూటమి ఎంతమేరకు ఆ నగరాన్ని రక్షించగలదో తామూ చూస్తామని పుతిన్ నవ్వుతూ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఉక్రేన్ సైన్యాలను కుర్స్క్‌నుండి తాము బయటకు తరిమి కొడతామని అందుకు ఎంత సమయం పడుతుందో ఇప్పుడే చెప్పలేనన్నారు. ఉక్రేన్‌తో శాంతియుత చర్చల ద్వారా పరిష్కారానికి తాము సిద్ధంగా ఉన్నామని కూడా చెప్పారు. ఐతే నాటోలో చేరాలనే ఆలోచనను ఉక్రేన్ వదులుకోవాలని, రష్యా ప్రయోజనాలను ఆలోచించాలని అన్నారు. రష్యా ఆర్థిక వ్యవస్థ పుంజుకుందని, ఈ ఏడాది దాదాపు నాలుగుశాతం మేరకు వృద్ధి సాధించామని అన్నారు. అదేవిధంగా సిరియాలో పదవీచ్యుతుడైన నియంత అల్ బషర్ అస్సాద్‌తో త్వరలో తాను మాట్లాడతానన్నారు. అస్సాద్ ప్రభుత్వం కుప్పకూలిపోవడం రష్యా వైఫల్యం ఎంతమాత్రం కాదని పుతిన్ చెప్పారని పాశ్చాత్య మీడియా రిపోర్టు చేసింది. తాను అస్సాద్‌ను కలుసుకోలేదని, ఆయనకు తమ దేశంలో ఆశ్రయం కల్పించామని, త్వరలో ఆయన్ను కలుస్తానని పుతిన్ అన్నారు. గడచిన నాలుగు సంవత్సరాలుగా తాను డోనాల్‌ట్రంప్‌తో మాట్లాడలేదని, ఆయనతో మాట్లాడాలనే ఉందని, ఐతే ఆయన కోరుకుంటే ఆయనను కలడానికి తనకు అభ్యంతరం లేదని, ట్రంప్‌ను ఎప్పుడు కలుస్తానో తాను చెప్పలేననీ పుతిన్ వార్షిక పత్రికాగోష్టిలో చెప్పారు. ఇజ్రాయెల్ యుద్ధం గురించి మాట్లాడుతూ, గాజాలో యుద్ధ సమస్య పరిష్కారానికి మూలకారణాలను ముఖ్యంగా పరిష్కరించాల్సి ఉందని అన్నారు.



## లైబీరియా పార్లమెంటు భవంతి దగ్ధం

### ప్రభుత్వ వ్యతిరేక నిరసన ప్రదర్శనలు



**మన్రోవియా :** పశ్చిమ ఆఫ్రికా తీరప్రాంతదేశం లైబీరియాలో రెండు రోజులుగా ప్రభుత్వ నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఈ పూర్వరంగంలో పార్లమెంటు భవంతి అగ్నికీలల్లో దగ్ధమైంది. ఐతే ఈ నిరసన ప్రదర్శనలకు, పార్లమెంటు భవంతి దగ్ధం కావడానికి మధ్య సంబంధం ఏదైనా ఉందా? అనే విషయం వెంటనే తెలియరాలేదు. దేశంలో అవినీతి పెచ్చుమీరిందనే పేరుతో ప్రతిపక్షానికి చెందిన పార్లమెంటు స్పీకర్‌ను పదవినుండి తొలగించాలని నిర్ణియం తీసుకోవడంతో ఈ నిరసన ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. దీంతో దేశాధ్యక్షుడు బొయాకాయ్ కూడా రాజీనామా చేయాలని ప్రదర్శకుల నుండి డిమాండ్‌లు పెరిగాయి. పార్లమెంటు భవంతి దగ్ధమైన ఘటనకు సంబంధించి పార్లమెంటు స్పీకర్‌ను, మరో ప్రతినిధి ఫ్రాంక్ ఫోకోతో సహా నలుగురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. పార్లమెంటు భవంతి లో ఛాంబర్స్ అగ్నికి ఆహుతి అవుతాయన్న బెదిరింపులు ఉన్నాయని కొద్దిరోజుల క్రితమే పార్లమెంటు స్పీకర్ ఒక ఇంటర్వ్యూలో అన్నారు. ఏ ప్రాతిపదికపై ఆయన ఆ ప్రకటన చేశారని ఆయనను ప్రశ్నిస్తున్నారు. కాగా అనేకమంది ప్రదర్శకులను కూడా పోలీసులు అరెస్టు చేశారు. వారిని చెదరగొట్టేందుకు బాష్పవాయువును ప్రయోగించారు. దిగువసభ స్పీకర్ కొనాటీ కఫ్వాను పదవి నుండి తొలగించాలా?లేదా? అనే విషయంపై అనేక నెలలుగా ఉద్రిక్తతలు నెలకున్న తరుణంలో ఈ నిరసనలు ప్రారంభమయ్యాయి. పార్లమెంటు స్పీకర్‌ను మూడింట రెండు వంతుల మెజారిటీతో పదవి నుండి తొలగించవచ్చు. ఆయనను తొలగించనిదే బడ్జెట్ సభలో ఆమోదం పొందే పరిస్థితి కనిపించడంలేదు.

## యెమెన్‌పై ఇజ్రాయెల్ దాడి: 9 మంది మృతి



**సనా:** యెమెన్‌పై ఇజ్రాయెల్ గురువారంనాడు వరుస క్షిపణి దాడులు చేసింది. ఈ దాడుల్లో తొమ్మిదిమంది మరణించారు. అంతకుముందు హౌతీ ఉగ్రవాదులు సెంట్రల్ ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకుని హౌతీలు దాడులు చేశారు. దాంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఇజ్రాయెల్ సైన్యం యెమెన్‌పై వరుస దాడులు చేసింది. రాజధాని సనా మీద, వ్యూహాత్మక రేవు నగరం హొదేడాహ్ లపై ఇజ్రాయెల్ వరుస దాడులు చేసింది. ఎర్రసముద్రంలో వాణిజ్యనౌకల రాకపోకలు ఎక్కువగా జరుగుతూ ఉంటాయి. ఈ వాణిజ్య నౌకలపై ఏడాదికాలంగా హౌతీలు దాడులు చేస్తున్నారు. హౌతీల దాడులకు ఇరాన్ మద్దతుగా నిలుస్తున్నది. తాజాగా ఇజ్రాయెల్ యెమెన్‌లో దాడులు చేసిన తర్వాత ఎర్రసముద్రంలో కూడా తదుపరి మరింత ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే అవకాశాలు పెరిగాయి. హౌతీ తిరుగుబాటుదారుల నియంత్రణలో పనిచేసే శాటిలైట్ న్యూస్ ఛానల్ ''అల్ మషీరా' ఒక నివేదిక ఇస్తూ, ఎర్రసముద్రంలో ఉన్న ఆయిల్ టెర్మినల్ రాస్ ఇసాతోపాటు విద్యుత్ స్టేషన్లను కూడా లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులు చేసిందని పేర్కొంది. సలీఫ్ పోర్టు సిటీవద్ద ఏడుగురు, రాస్ ఇసా వద్ద ఇద్దరు మరణించారని తెలిపింది. గత ఏడాది అక్టోబరులో ఇజ్రాయెల్ – హమాస్ మధ్య గాజాలో యుద్ధం ప్రారంభమైనప్పటినుండీ హౌతీలు ఎర్రసముద్రంలో కనీసం 100కు పైగా వాణిజ్య నైకలపై దాడులు చేశారు. ఇజ్రాయెల్ దాడులవల్ల గాజాలో 45,000 మంది పాలస్తినా ప్రజలు మరణించారు.

## పైశాచిక భర్తకు జైలు..

### భార్యపై 72 మందితో రేప్ చేయించిన క్రూరుడు!






**అవిగ్నాన్ :** భార్యకు మత్తు పదార్థాలు ఇస్తూ పదేళ్ళ పాటు 72 మంది ఇతరులతో అత్యాచారం చేయించిన 'ఘనమైన భర్త'కు ఫ్రాన్స్ న్యాయస్థానం 20 సంవత్సరాలు జైలుశిక్ష విధించింది. ఈ కేసులో బాధితురాలైన భార్య గిసెలె పెలికోట్స్ (72) ప్రస్తుతం అమ్మమ్మ పాత్రలో ఉన్నారు. మొత్తం 72 మంది నిందితులలో యాభైమందిని పోలీసులు గుర్తించారు. మిగిలినవారి జాడ ఇంకా తెలుసుకోవాలి. ఆమె మాజీ భర్త డొమినిక్ పెలికోట్‌తోపాటు మరో 49 మంది నిందితులను దక్షిణ ఫ్రాన్స్‌నగరం అవిగ్నాన్‌లోని న్యాయస్థానం విచారణ చేసి గురువారంనాడ శిక్షలు విధిస్తూ తీర్పు చెప్పింది. తన భార్యపై అత్యాచారం చేశానని పెలికోట్స్ ఒప్పుకున్నాడు. తనతోపాలు అనేకమందిని ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసి తీసుకువచ్చినట్లు అంగీకరించాడు. తన భార్యకు రోజూ డ్రగ్స్ ఇచ్చేవాడిననీ, ఆమె అపస్మాకరస్థితిలో ఉన్న దశలో ఆన్ లైన్ బుకింగ్ ద్వారా వచ్చిన వారు అత్యాచారాలు చేశారని న్యాయస్థానం ఎదుట భర్త డొమినిక్ పెలికోట్ నేరాన్ని అంగీకరించాడు. పైగా ఈ అత్యాచారాలన్నింటినీ సదరు భర్త వీడియోలు కూడా తీయించాడు. ఇప్పుడు ఈ రిటైర్డ్ పవర్ కంపెనీ వర్కర్ భార్య గిసెలె పెలికోట్స్ దేశంలో ఒక ఫెమినిస్టుగా మారారు. ఈ ఏడాది సెప్టెంబరులో డొమినిక్ పెలికోట్ కోర్టులో తన నేరం అంగీకరించాడు. 2011 నుండి 2020 వరకూ ఈ విధంగా తన భార్యపై ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా అత్యాచారాలు జరిగాయని ఒప్పుకోవడంతో అతడికి జైలుశిక్ష ఖరారైంది.

## తెలంగాణ కళాకారులు తమ గళాలకు, కవులు తమ కలాలకు పదును పెట్టాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** చరిత్రలో ఎప్పుడు చరిత్రకారులు రాసిందే నిజమైన చరిత్ర అని, తెలంగాణ కళాకారులు తమ గళాలకు, కవులు తమ కలాలకు పదును పెట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మొదలు తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమంలో అమరుల త్యాగాలు మరుగునపడి, గెలిచిన వారే తమ పేరుతో చరిత్రను లిఖించుకునే ప్రయత్నం చేస్తారని, గడిచిన ఈ పదేళ్ల కాలమే ఇందుకు నిదర్శనమని సిఎం పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ స్టేడియం దాశరథి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రదర్శనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు, కవి యాకుబ్ అధ్యక్షతన బోయి విజయభారతి వేదికపై జరిగిన కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, హైదరాబాద్ బుక్ ఫెయిర్ సలహాదార్లు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, ఎంఎల్‌సి, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ప్రొఫెసర్ రమా మేల్కొటే, ప్రముఖ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, రాష్ట్ర గ్రంథాలయం ఛైర్మన్ రియాజ్, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తమ కలం, గళం ద్వారా సమాజానికి చైతన్యాన్ని అందించడంతో పాటు ప్రజా పోరాటాలు చేసిన కవులు, కళాకారులపేర్లు బుక్ ఫెయిర్ వేదికలకుపెట్టడం ద్వారా మంచి సందేశాన్ని ఇచ్చారని సిఎం నిర్వాహకులను అభినందించారు. తెలంగాణ ఉద్యమంలో సమిదలైన వారి కంటే రాజకీయ ప్రయోజనం పొందిన వారికే ఎక్కువ పేరు వచ్చిందని, తెలంగాణ ఉద్యమంలో పోరాటంలో చేసిన వారి పేర్లు చరిత్రలో ఉండాలని, చదివిన పుస్తకాలు, చైతన్య పర్చిన గానం నుంచి క్రోడీకరించి నేను ఉమ్మడి ఎపి అసెంబ్లీలో తెలంగాణ బిల్లుపై మాట్లాడానని సిఎం గుర్తు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో డిజిటల్ మీడియా కారణంగా పుస్తకాల ప్రాధాన్యత తగ్గిపోతున్న ఈ తరుణంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను నిర్వహించడం ద్వారా వచ్చే తరానికి స్ఫూర్తినిస్తున్నారన్నారు. చరిత్ర చదువుకుంటూనే భవిష్యత్తు తరాలకు మంచి సందేశం ఇవ్వగలమని, ఈ జ్ఞానాన్ని అందించే పుస్తక భాండాగారాన్ని అందించడంలో కృషి చేస్తున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను రాష్ట్ర ప్రభుత్వం తప్పకుండా ప్రోత్సహిస్తుందని సిఎం చెప్పారు. మంచి సందేశం ఇవ్వడం కోసమే బుక్ ఫెయిర్‌లో ముఖ్యమంత్రిగా తాను, మంత్రులు పాల్గొన్నామని, సామాజిక చైతన్యం , సమాజంలో వచ్చే మార్పుల పై చర్చించడానికి బుక్ ఫెయిర్ మంచి వేదిక గా ఉంటుందని సిఎం పేర్కొన్నారు. కొత్త తరానికి తెలిసింది గూగుల్ మాత్రమే, అందులో ముందు ఎవరో పెట్టిన సమాచారం పూర్తి వాస్తవం కూడా కాకపోవచ్చని, అందుకే చరిత్రకారులు రాసిన పుస్తకాలు చదవడం ద్వారా చరిత్రలో పోరాడి అమరులైనవారి చరిత్ర తెలుస్తుందన్నారు. ఎందుకంటే తమకు అనుకూలంగా రాయించుకున్న చరిత్రనే అసలైన చరిత్ర అని గత పదేళ్ల నుంచి కొందరు ప్రచారం చేయించుకుంటున్నారని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చరిత్రకారులను గుర్తించుకోవడం కోసమే ప్రభుత్వం తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెట్టిందని, కాళోజీ, దాశరథి లాంటి కవులెందరో తెలంగాణ తొలి దశ ఉద్యమానికి, స్ఫూర్తి ఇవ్వగా, అందెశ్రీ, గూడ అంజయ్య, గద్దర్ లాంటి వారు మలి దశ తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చారని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ రచయితలు, కవులు రాసిన పుస్తకాలు, మేధాశక్తిని పెంచే పుస్తకాలతో మరింత పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

జ్ఞానం ఎక్కడో కొనుక్కుంటే దొరికేది కాదని, పుస్తకాలు చదివితేనే వచ్చేదని, విద్యార్థులు ఈ బుక్ ఫెయిర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ పుస్తకాలు లేని గది ఆత్మలేని శరీరం లాంటిందనే నానుడు ఉందని, అందుకే పుస్తకానికి అంత ప్రాముఖ్యతర్పడిందన్నారు. పుస్తక పాఠనం వల్ల మనిషి ఆలోచన, సమర్థత, యుక్తి నైపుణ్యం వికసిస్తాయని తెలిపారు. అంతకు ముందు ముఖ్యమంత్రి తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ కార్యదర్శి వాసు, కోశాధికారి పి.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బుక్ ఫెయిర్‌లో టిసాట్ స్టాల్ ప్రారంభం**

హైదరాబాద్ లో నిర్వహిస్తున్న 37వ బుక్ ఫేయిర్ లో టిసాట్ స్టాల్‌ను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సమక్షంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రియాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా టిసాట్ సిఈఓ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. జవహర్‌లాల్ నెహ్రూ రచించిన భారత దర్శనం పుస్తకాన్ని వేణుగోపాల్‌రెడ్డి సిఎం రేవంత్‌రెడ్డికి అందజేశారు. పుస్తక ప్రదర్శనలో టిసాట్ స్టాల్ ఏర్పాటు చేసిన ఉద్దేశ్యాన్ని సిఎంకు ఆయన వివరించారు.

## మాకేం తెలియదు (మొదటి పేజీ తరువాయి)

బహిరంగ విచారణ నిర్వహించింది. బహిరంగ విచారణకు మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్, సిఎం మాజీ కార్యదర్శి స్మితా సబర్వాల్ హాజరయ్యారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజ్ల నిర్మాణ అనుమతులపై ప్రశ్నలు అడిగింది. క్యాబినెట్ అనుమతి లేకుండానే జీఓలు వచ్చాయా అని స్మితా సబర్వాల్‌ను కమిషన్ ప్రశ్నించింది. కమిషన్ ప్రశ్నలకు స్మితా సభర్వాల్ తెలియదని సమాధానమిచ్చారు. తొలుత జస్టిస్ జోష్ విచారణను ప్రారంభిస్తూ రాష్ట్ర మంత్రివర్గం అనుమతి లేకుండానే జీఓలు వచ్చాయా? అని ప్రశ్నలు సంధించగా, స్మితా సభర్వాల్ సమాధానమిస్తూ ఆ విషయం తనకు తెలియదని సమాధానమిచ్చారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజ్‌ల నిర్మాణ అనుమతులు, మంత్రిమండలి సమావేశాల్లో మీ పాత్ర ఏంటి? అని జస్టిష్ ఘోష్ ప్రశ్నించగా ఫైళ్లను పరిశీలించడం వరకే తన విధి అని ఆమె కమిషన్‌కు తెలిపారు. వివిధ శాఖలు, సిఎస్ నుంచి వచ్చే ఫైళ్లను ముఖ్యమంత్రికి క్లుప్తంగా వివరించడం తన బాధ్యత అని ఆమె వివరించారు. జస్టిస్ పిసి.ఘోష్ అడిగిన చాలా ప్రశ్నలకు స్మితా సభర్వాల్ తెలియదు, గుర్తులేదు, అవగాహన లేదు అనే సమాధానం ఇవ్వడం గమనార్హం.

తాను సిఎస్ కాకముందే ప్రాజెక్టు పూర్తయింది.

**కమిషన్ ముందు మాజీ సిఎస్ సోమేశ్ కుమార్**

స్మితా సభర్వాల్ అనంతరం మాజీ సిఎస్ సోమేశ్ కుమార్‌ను కాళేశ్వరం కమిషన్ విచారించింది. ముఖ్యంగా మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజ్‌లకు సంబంధించిన అనుమతుల గురించి ఆయనను పలు ప్రశ్నలు అడిగారు. బ్యారేజ్ నిర్మాణంలో అంతా సరిగ్గానే జరిగిందా? అని సోమేశ్‌కుమార్‌ను జస్టిస్ ఘోష్ ప్రశ్నించగా, నీటిపారుదల శాఖ ఈఎన్‌సి, కార్యదర్శి వాటిని పర్యవేక్షించారని సమాధానమిచ్చారు. ప్రాజెక్టు నిర్మాణం గురించి వార్తా పత్రికల్లో చదివేవాడినని ఆయన పేర్కొన్నారు. తాను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించక ముందే బ్యారేజ్‌ల నిర్మాణం పూర్తి అయిందని సోమేశ్‌కుమార్ సమాధానం చెప్పారు.

**ఆర్థిక భారాన్ని ఆర్థిక శాఖ చూసుకుంటుంది**

బ్యారేజీల నిర్మాణం వల్ల రాష్ట్రంపై ఆర్థిక భారం పడిందని మీకు అనిపించలేదా? అని జస్టిస్ ఘోష్ కమిషన్ ప్రశ్నించగా, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి ఆ విషయాలను చూసుకుంటారని సోమేశ్ సమాధానమిచ్చారు. శాఖల అధిపతులే చూసుకున్నారంటే, సిఎస్‌గా మీ బాధ్యత ఏమిటి? అని కమిషన్ మళ్లీ ప్రశ్న వేసింది. ఫైల్స్ పరిశీలించి లోటుపాట్లు ఉంటే సూచనలిస్తానని సోమేశ్ కుమార్ జస్టిస్ ఘోష్‌కు వివరించారు. అనంతరం ప్రాజెక్టు నిర్మాణంలో క్లియరెన్స్ అయిన దస్త్రాలపై మాత్రమే సంతకం చేసినట్లు సోమేశ్‌కుమార్ తెలిపారు. ఇతర శాఖల గురించి సోమేశ్ కుమార్ చెప్పే ప్రయత్నం చేయగా, కేవలం కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల గురించి మాత్రమే చెప్పాలని ఆయనకు జస్టిస్ ఘోష్ సూచించారు.

## కలిసికట్టుగా పోరాటం
(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సిఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి, మాజీ మంత్రి హరీశ్ చెబుతున్న అప్పుల లెక్కల్లో ఎక్కడో తేడా కనిపిస్తోందన్నారు. రాష్ట్రంలో రూ. 6,71,757 కోట్ల వరకు అప్పులు ఉన్నట్టు బిఆర్ఎస్ అగీకరించినప్పటికీ, నేరుగా కొన్ని చేయలేదని చెబుతున్నారని వివరించారు. మరో వైపు ఏడాది పాలనలో రూ.1,27,000 కోట్ల అప్పు ఎలా చేశారని కాంగ్రెస్‌ను బిఆర్ఎస్ ప్రశ్నిస్తుందని, కానీ ప్రభుత్వం చేసిన అప్పులో ఎఫ్ఆర్‌బిఎం పరిధిలో రూ.52,118 కోట్లు, ప్రభుత్వ గ్యారంటీ రుణాలు కింద రూ. 2823 కోట్లు , ఎస్‌పివి,ప్రభుత్వ గ్యారంటీ రూ.40,203 కోట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేసిందని, ఎస్‌పివి అప్పులను తీసివేస్తే అసలు అప్పుల లెక్క తేలుతుందన్నారు. జిఎస్‌టి ద్వారా రూ. 18 లక్షల కోట్లు చెల్లి స్తుంటే, ఇందులో 3 శాతం మాత్రమే ధనికులు చెల్లిస్తున్నారని, మిగతా పేదలు చెల్లిస్తున్నారని వివరించారు. ప్రజలు చెల్లిస్తున్న జిఎస్‌టి డబ్బులు బకాయిలు రద్దుకు, రాయితీలకు, అదానీ, అంబానీలకు రాయితీలు, రియల్ ఎస్టేట్ రంగానికి పోతున్నాయని విమర్శించారు. కోటీ 80 లక్షల మంది చేతి పనులు చేసుకునేవారు ఉన్నారని, తక్కువ వేతనాలు పొందేవారు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నతదితరులను గురించి ఎప్పుడైనా ఆలోచించారా అని ప్రశ్నించారు. జిఎస్‌టిలో రిక్షా కార్మికుడు చెల్లించే డబ్బులు కూడా ఉన్నాయని, కానీ దేశ సంపదలో పేదలకు ఎంత భాగస్వామ్యం ఉన్నదో లెక్కలు తీస్తే, దేశం ఎటువైపు ప్రయాణిస్తుందో స్పష్టం అవుతుందన్నారు.

మీరు చేస్తే దొరతనం..ఇంకోకరు చేస్తే దొంగతనమా?

''మీరు(బిఆర్ఎస్) చేస్తే దొరతనం, ఇంకోకరు(కాంగ్రెస్) చేస్తే దొంగతనమా?, అని కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. ఐదేళ్ల కాలాన్ని ముందే ఊహించి , ఐదేళ్ల కాలానికి ఎన్ని అప్పులు చేస్తారో ముందే అంచనాలు వేసి బిఆర్ఎస్ చెప్పడం మంచి పద్ధతి కాదని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అప్పులు చేయకపోతే ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్‌మెంట్, చిన్న పాటి కాంట్రాక్ట్ బిల్లులు, అలాగే కాంగ్రెస్ వాగ్దానాలు ఇలా అనేకం ఉన్నాయని, ఈ బకాయిలను ఎవరు చెల్లిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ అప్పును ఎవరు తీర్చాలని, ఎగ్గొడుతారా? లేదా ఏదైనా బ్యాంక్‌ను లూటీ చేసి డబ్బులు తీసుకొస్తారా అని మండిపడ్డారు. ఎంత వరకు పేదలకు మేలు జరిగిందని, ఎంత మందికి పర్మినెంట్ ఉద్యోగాలు వచ్చాయని, సింగరేణి ఇది వరకు లక్ష మంది పర్మినెంట్ ఉద్యోగులు ఉంటే, ప్రస్తుతం 30 వేలకు పడిపోయిందని,అవుట్ సోరింగ్, కనీస వేతనాలు లేని వారు రాష్ట్రంలో 1,80 కోట్లు ఉన్నారని, వారు మనుషులు కాదా?,వారిని ఎలా బతికించాలనే ఆలోచన ఉండాలన్నారు.

**ఆ బకాయిలను తీర్చండి ..**

ఫీజ రీయంబర్స్‌మెంట్, చిన్న,చిన్న కాంట్రాక్టులు, బకాయి వేతనాలు, తదితర వాటిని చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం మరింత అప్పులు చేసి, పూర్తి బకాయిలను చెల్లించాలని, తద్వారా ప్రశాంతంగా ఉండాలని, భవిష్యత్‌లో మరింత ఆదాయ వనరు పెంచుకుని ,అప్పులు తీర్చాలని కూనంనేని సాంబశివరావు ఆర్థిక శాఖ మంత్రికి సూచించారు. ముందుగా కార్మికులకు, ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించేలా అప్పులు చేయాలన్నారు. నీతివంతమైన పాలన అందిస్తూ , అవినీతికి పాల్పడాల్సిన అవసరం లేదని, తద్వారా దేశంలోనే తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు వస్తుందని సూచించారు. అప్పుల కోసం కాకుండా అభివృద్ధికి ఏం చేస్తే బాగుటుందనే విషయమై సలహాలు ఇస్తే బాగుంటుందని ఆయన ప్రతిపక్ష పార్టీకి సూచించారు. పర్మినెంట్ ఉద్యోగులకు మాత్రమే ప్రతి నెలా 1వ తేదీన జీతాలు చెల్లిస్తున్నారని, కానీ మున్సిపల్, పంచాయతీరాజ్, అంగన్‌వాడి కార్మికలుకు, మధ్యాహ్నం భోజన కార్మికులకు మూడు,నాలుగు నెలలుగా వేతనాలు లేవని, వారే అసలైన మనుషులని, వారిని ముందుగా చూడాలని కోరారు. రాష్ట్రంలో అప్పులు తప్పని సరి చేయాల్సిన అవసరం ఏర్పడిందని, అప్పులు చేయకుండా ఎంత కాలం మభ్యపెడుతారని, ఇంకేంత కాలం బాకాయిలు చెల్లించకుండా ఉంటారో తేల్చాల్సిన అవసరం ఉన్నదని కూనంనేని అన్నారు.

**దక్షిణాధి నిధులు ఎక్కడికెళ్తున్నాయో**

తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు. రాష్ట్రం నుంచి ఒక రూపాయి కేంద్రానికి చెల్లిస్తే, కేంద్రం తిరిగి ఆ రాష్ట్రానికి 40 పైసలు మాత్రమే తిరిగి చెల్లిస్తోందని వివరించారు. జిఎస్‌టిలో 40 శాతం ఇవ్వాలని 15వ ఆర్థిక సంఘం సిఫారసు చేసిందని, ఇప్పటికే 24 శాతమే ఇస్తున్నారని తెలిపారు. దక్షిణాధి రాష్ట్రాలు చెల్లించే డబ్బులు ఎక్కడికో పోతున్నాయోనని అన్నారు. 'మీరు(కాంగ్రెస్), వారు (బిఆర్ఎస్) తమను( సిపిఐ) ఆహ్వానిస్తే అందరూ కలిసి మన రాష్ట్ర వాటా కోసం పోరాటం చేద్దామని, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వాటాను సాధిద్దామని చెప్పారు. నిధులు ఒక చోట (కేంద్రం) పెట్టుకుని ఇక్కడ ఘర్షణకు దిగితే ఏం ఉపయోగమన్నారు.



## అసెంబ్లీ మీడియా పాయింట్

### అమిత్ షా ను బర్తరఫ్ చేయాలి

మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:**రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ని అవమాన పరిచిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా ను వెంటనే భర్తరఫ్ చేయాలని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా అమిత్ షా మీద ఎస్‌సిఎస్‌టి కేసులు నమోదు చేయాలన్నారు. అంబేద్కర్‌ని బిజెపి అవమాన పరిస్తే బిఆర్‌ఎస్ ఎందుకు మౌనంగా ఉంటుందో చెప్పాలని డిమాండ్ చేశారు. దానిపైన ప్రతిపక్ష పార్టీగా బిఆర్‌ఎస్ సభలో తీర్మానం ప్రవేశపెట్టి అమిత్ షా ను భర్తరఫ్ చేయాలి, అరెస్టు చేసి జైల్లో పెట్టాలి.. అనే మాట ఎందుకు చెప్పడం లేదని ఎద్దేవచేశారు.అంబేద్కర్ మీద మాట్లాడిన అమిత్ షా పై తెలంగాణ వ్యాప్తంగా దళిత సంఘాలు పోలీస్ స్టేషన్ లలో పిర్యాదు చేస్తాయన్నారు. బిజెపి స్టాండ్ అంబేద్కర్ పై ఏముందో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు స్పష్టం చేయాలన్నారు. సభ లో అమిత్ షా అంబేద్కర్ మీద ఆరోపణలు చేస్తే బిఆర్‌ఎస్ ఎందుకు మాట్లాడడం లేదన్నారు. బిజెపికి స్వాతంత్ర్య నిర్మాణం లో పాత్ర లేదు .. ఇంగ్లీష్ వాళ్ళకి తావేదారులుగా పని చేసిన పార్టీ అని ఆరోపించారు.బి ఆర్ అంబేద్కర్ మాట ప్యాషన్ అయిందని అనడం తప్పు కాదా..? అని ప్రశ్నించారు.బిజెపి అదానికి మధ్య ఉన్న స్నేహం పై జెపిసి వేయాలని చెప్పాం దానిపై బిఆర్‌ఎస్ స్టాండ్ ఏమిటని ప్రశ్నించారు.

### భారత రాజ్యాంగానికి ఘోర అవమానం

ఎంఎల్‌సి మహేష్‌కుమార్‌గౌడ్

బాబాసాహెబ్ అంబేద్కర్ పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు బిజెపి అహంకారానికి నిదర్శనమని టిపిసిసి అధ్యక్షుడు, ఎంఎల్‌సి మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. దళిత, గిరిజన, బీసి, మైనారిటీ ప్రజల మనోభావాలను అమిత్ షా తీవ్రంగా దెబ్బతీసినట్లేనని ఆరోపించారు.ఇది భారత రాజ్యాంగానికి ఇది ఘోర అవమానకరమన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుస్మృతిని అమలు చేసేందుకు సంఘ్ పరివార్ కుట్రలో భాగమే ఇదంతా అని అన్నారు. రాజ్యాంగ నిర్మాతను ప్రతి సారి బిజెపి హేళన చేస్తోందన్నారు. మన రాజ్యాంగం మీద, మన జాతీయ జెండా మీద బిజెపికి గౌరవం లేదని మరోసారి నిరూపితం అయ్యిందన్నారు. అంబేద్కర్ ను అవమానించినందుకు అమిత్ షా వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే ఆయన వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని కోరారు. అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ఎఐసిసి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం చేయాలని ఆయన కోరారు.అమిత్ షా పై చర్యలు తీసుకునేంతవరకూ కాంగ్రెస్ పోరాడుతూనే ఉంటుందని స్పష్టం చేశారు.

### ఎన్‌టిఆర్ ఘాట్ జోలికి వస్తే ఊరుకునేది లేదు

ఎంఎల్‌ఎలు మాగంటి గోపినాథ్, మాదవరం కృష్ణారావు

సెక్రటేరియట్ పక్కనే ఉన్న ఎన్‌టిఆర్ ఘాట్ ను తొలగిస్తామని కాంగ్రెస్ ఎంఎల్‌ఎ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు మాగంటి గోపినాథ్, మాదవరం కృష్ణారావు తీవ్రంగా ఖండించారు.అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద వారిద్దరు మాట్లాడుతూ......ఎన్‌టిఆర్ ఘాట్ జోలికి వస్తే ఊరుకునేది లేదని వారు స్పష్టం చేశారు. ఎన్‌టిఆర్ ను బతికుండగా వేధించిన కాంగ్రెస్ నేతలు ఆయన చనిపోయాక కూడా వదలడం లేదన్నారు.ట్యాంక్ బండ్ ను నాడు అభివృద్ధి చేస్తానంటే ఎన్‌టిఆర్‌ను కాంగ్రెస్ నేతలు అడ్డుకున్నారన్నారు. కాంగ్రెస్ నేతలు అడ్డుకున్నా ఎన్‌టిఆర్ కుర్చీ వేసుకుని మరీ ట్యాంక్ బండ్ ను నిర్మించారన్నారు.

### అవి ఫేక్ వీడియోలు

బిజెపి ఎంఎల్‌ఎ పాయల్ శంకర్

ఫేక్ వీడియోలు వైరల్ చేస్తూ అమిత్ షా మాటలు వక్రీకరిస్తున్నారని బిజెపి ఎంఎల్‌ఎ పాయల్ శంకర్ అన్నారు.అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని మోదీ ముందుకు వెళ్తున్నారన్నారు.ఏదో విధంగా అమిత్ షా మాటలు రచ్చ చేయాలని కాంగ్రెస్ పార్టీ చూస్తుందన్నారు.గతంలో కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ని రెండుసార్లు ఓడించిందని గుర్తు చేశారు. అంబేద్కర్‌ని దేవునితో సమానంగా బిజెపి చూస్తుందన్నారు.

# ఏ హోదాతో హరీశ్ మాట్లాడుతున్నారు?

## ప్రశ్నోత్తరాల సమయంలో బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ హరీశ్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆగ్రహం



**ప్రజాపక్షం/హైదరాబాద్:**శాసనసభ సమావేశాలు వాడీవేడిగా కొనసాగుతున్నాయి. అధికార, విపక్ష సభ్యు ల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ హరీశ్ రావుపై రోడ్లు భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సభలో హరీశ్‌రావు ఏ హోదాతో ప్రశ్నలు అడుగుతున్నారని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. శాసనసభ సమావేశాలు గురువారం ప్రారంభమైన వెంటనే స్పీకర్ ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపట్టారు. నీటి పారుదల అంశంపై చర్చ జరుగుతుండగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతుండగా హరీశ్ రావు జోక్యం చేసుకున్నారు. దీంతో మంత్రి కోమటిరెడ్డి అసలు హరీశ్ రావు ఎవరని ప్రశ్నించారు. ప్రశ్నోత్తరాల సమయం నుంచి ప్రతిసారీ హరీశ్‌రావు మాట్లాడుతున్నారని, ఆయన బిఆర్‌ఎస్‌ఎల్‌పికి డిప్యూటీ లీడరా? లేదా ఎంఎల్‌ఏనా అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. హరీష్ రావు అందరిలాగే ఎంఎల్‌ఏ అని, ప్రతిపక్ష నేత కెసిఆర్ ఎక్కడున్నారని మంత్రి కోమటిరెడ్డి అడిగారు. బిఆర్‌ఎస్‌ఎల్‌పికి పూర్తి కార్యవర్గమే ఏర్పాటు కాలేదని, హరీశ్‌రావు ఒక ఎంఎల్ ఎ మాత్రమేనని, అలాంటప్పుడు ఆయన ప్రతి అంశంలో ఎలా మాట్లాడుతారని అన్నారు. ప్రతిపక్ష నాయకుడు సభకు రాకపోవడం శాసనసభనే కాదని, తెలంగాణ ప్రజలను కూడా అవమానించినట్టేనని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లగొండ గురించి, తన గురించి మాట్లాడే హక్కు హరీశ్‌రావుకు లేదన్నారు. పదేళ్ల పాలనలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం మూసీని పట్టించుకోలేదని విమర్శించారు.

**ఏకలింగం తరహా ఒక్కరే గెలిచారు**

గత ప్రభుత్వం పదేళ్లలో కాలంలో రూ.7లక్షల కోట్ల అప్పు తీసుకొచ్చినప్పటికీ నల్లగొండలో 70శాతం పూర్తయిన పనులను పక్కన పెట్టారని, అందుకే ప్రజలు కూడా వారికి సరైన బుద్ధి చెప్పారని, ఆ పార్టీకి డిపాజిట్లు కూడా రాలేదని, ఏకలింగం తరహాలో జిల్లా నుంచి ఒక్కరే గెలిచారని అన్నారు. అది కూడా వెయ్యి, రెండు వేల ఓట్ల మెజారిటీతోనే గెలిచారన్నారు. శాసనసభ ఎన్నికల్లో తమ వద్ద 50 నుంచి 60వేల మెజార్టీతో కాంగ్రెస్ గెలిచిందని, ఎంపి ఎన్నికల్లో తమ ఎంపి అభ్యర్థి దక్షిణా ది రాష్ట్రాలలో అత్యధిక మెజార్టీతో ప్రజలను గెలిపించారంటేనే గత ప్రభుత్వంపై ప్రజలు ఎంత కసిగా ఉన్నారో తెలుస్తుందన్నారు. మల్లన్న సాగర్‌లో 50 టిఎంసిల నీటి ని దాచిపెట్టుకున్నారని, రూ.20వేల ఖర్చుతో రిజర్వాయర్ నిర్మించారని, కానీ గందమల్ల రిజర్వాయర్ పనులను పట్టించుకోలేదని, ఈ పనులకు టెండర్లను ఆహ్వానించి, ఆ తర్వాత రద్దు చేశారని ఆరోపించారు. సింగూరుకు రూ.4 వేల కోట్లతో పైకి తీసుకెళ్తారని, తాము ఏమి పాపం చేశామని, రూ.800కోట్లతో 1.5 టిఎంసి సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టను పూర్తిచేస్తే, ఆలేరు నియోజకవర్గంలో 1.50లక్షల ఎకరాలు నీళ్లు వచ్చేవని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

**మంత్రులే ప్రశ్నిస్తే ఎలా? : హరీశ్‌రావు**



ప్రశ్నోత్తరాల సమయంలో ఒక మంత్రి మరొక మంత్రిని ప్రశ్న అడగడం ఏమిటని, కొత్త సంస్కృతిని సభలో తీసుకురావద్దని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ తన్నీరు హరీశ్‌రావు స్పీకర్‌ను కోరారు. మంత్రివర్గం అంటేనే సమిష్టి నిర్ణయమని, ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి ప్రశ్న అడిగితే ఇక ప్రశ్నోత్తరాల సమయానికి అర్థమే మారిపోతుందని, ఒక్కో ప్రశ్నకు సూటిగా సమాధానం వచ్చేలా చూడాలని స్పీకర్‌ను ఆయన కోరారు. సుదీర్ఘకాలం రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ పరిపాలించిందని, నల్లగొండ బాధలకు ప్రధాన ముద్దాయి కాంగ్రెస్ పార్టీ అని హరీశ్‌రావు ఆరోపించారు.

**ఉద్దేశపూర్వకంగానే ప్రశ్నోత్తరాల సమయాన్ని వృథా చేస్తున్నారు : కూనంనేని సాంబశివరావు**



శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయాన్ని ఉద్దేశపూర్వకంగా ఒకటి, రెండు, మూడు ప్రశ్నలకే పరిమితం చేస్తున్నారని సిపిఐ శాసనసభాపక్ష నాయకుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రశ్నోత్తరాలకు సంబంధించిన అంశం కాకపోయినప్పటికీ ఇతర అంశాలు జొప్పిస్తున్నారని, ఎవరి ప్రభుత్వ హయాంలో వారు గొప్పగా చేశారని చెప్పుకుంటున్నారని అన్నారు. ఒకే అంశంపైనే అర్ధగంట జరిగితే మిగతా సభ్యులు తమ హక్కును కోల్పోయినట్టు కాదా? అని ఆయన ప్రశ్నించా రు. ఏదైనా చర్చ జరగాలం టే అందుకు స్పెషల్ నోటీసు ఇవ్వడం లేదా రూపాల్లో వస్తే సరిపోతుందని సూచించారు. ప్రశ్నోత్తరాల సమయాన్ని వృథా చేయకుండా అందరినీ నియంత్రించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కూనంనేని సాంబశివరావు కోరారు.

**ఆకుపచ్చ కండువాలతో శాసనసభకు బిఆర్‌ఎస్ సభ్యు లు**

బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు ఆకుపచ్చ కండువాలతో శాసన సభ, శాసనమండలి సమావేశాలకు హాజరయ్యారు. రైతు సమస్యలపై శాసన మండలి, శాసన సభలో చర్చించాలంటూ బిఆర్‌ఎస్ పార్టీ వాయిదా తీర్మానం ఇచ్చింది. బిఆర్‌ఎస్ వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్న శాసనసభలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

# సంక్రాంతి తర్వాత కొత్త రేషన్ కార్డులు

ఒకటి, రెండు నెలల్లో సన్న బియ్యం పంపిణీ

ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలందరికీ సంక్రాంతి పండుగ తర్వాత కొత్త రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి శాసనసభలో ప్రకటించారు. ఒకటి, రెండు నెలల్లో రేషన్ కార్డులపై సన్నబియ్యం పంపిణీ చేయనున్నామని మంత్రి వెల్లడించారు. రేషన్ కార్డులపై అదనపు సరుకులను పంపిణీ చేసే అంశాన్ని కూడా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రేషన్ బియ్యంపై వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఇటీవల పిడిఎస్ వ్యాపారులపై పిడియాక్ట్ నమోదు చేసి, వారిని జైలుకు పంపించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. శాసనసభలో గురువారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో సిపిఐ శాసనసభా ప్రక్షనాయకులు కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ సభ్యులు వాకిటి శ్రీహరి, బిఆర్‌ఎస్ సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సమాధానమిచ్చారు. రేషన్ కార్డులలో కొత్తగా 'నగదు బదిలీ' తీసుకొచ్చే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. రేషన్ డీలర్లకు ఇన్సూరెన్స్ ఇవ్వనున్నామన్నారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో వెయిట్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. సప్లయ్ చెయిన్‌లో డీలర్లు ఇబ్బంది పడకుండా చూస్తున్నామని, రవాణా, ఇతర చార్జీల నిమిత్తం కేంద్రం ఇచ్చే రూ.21లు డీలర్లకు అందుతుందా? లేదా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తామన్నారు. అవసరమైన చోట కొత్త రేషన్ షాపులను ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తామని, కానీ అలా ఎక్కువగా ఇస్తే ప్రస్తుతం ఉన్న షాపులకు కార్డులు తగ్గుతాయని తెలిపారు. మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కొత్త రేషన్ షాపులకు అనుమతి ఇవ్వాలని, రేషన్ డీలర్లకు కమీషన్ పెంచాలన్నా రు.

**తొమ్మిది సరుకులను పునరుద్దరించాలి : సిపిఐ శాసనసభా పక్షనేత కూనంనేని సాంబశివరావు**

రేషన్ కార్డులపై గతంలో తొమ్మిది రకాల వస్తువు లు పంపిణీ చేసేవారని, వాటిని తిరిగి పునరుద్ధరించాలని సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రేషన్ కార్డులపై నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని తాను మధిరలో సభలో రూపాయికి కిలో బియ్యం పథకాన్ని ప్రకటించేందుకు వచ్చిన సిఎం కిరణ్ కుమార్ రెడ్డికి సూచించానని, అందుకు ఆ సిఎం 9 రకాల వస్తువులను పంపిణీ చేస్తామని ప్రకటించిన విషయాన్ని కూనంనేని గుర్తు చేశారు. నిరుపేద డీలర్లకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవకాశాన్ని కల్పిస్తారా? అని ప్రశ్నించారు. ప్రశోత్తరాల సమయంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ నాటి సిఎం వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏ పథకాన్ని అయినా సాచురేషన్ వరకు తీసుకెళ్లేవారని సాంబశివరావు గుర్తు చేశారు. అలాగే అందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని, ఎప్పటి నుంచి నూతన రేషన్ కార్డులు ఇస్తారో ప్రకటిస్తే బాగుంటుందన్నారు. కల్తీ పదార్థాలు వస్తున్నాయని, స్టాండర్డ్ మార్కు ఉత్పత్తులను జోడించి, ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే ఆలోచన ఉన్నదా? అని ఆయన ప్రశ్నించా రు. చౌక దుకాణాల్లో పంపిణీ చేస్తున్న బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో రూ.7నుంచి రూ.10 లకు విక్రయిస్తున్నారని, తద్వారా ఈ బియ్యాన్ని రీ సైకిలింగ్‌చేసి, ఎపిలో రూ.40నుంచి రూ.50లకు విక్రయిస్తున్నారని వివరించారు. అక్కడి నుంచి చైనా మీదుగా ఇతర దేశాలకు పంపిస్తున్నారని తెలిపారు. గతంలో మిల్లర్లు ధాన్యం పట్టించి, ఆ బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వకుండా టన్నుల కొద్దీ వారి వద్దనే నిల్వ చేసుకునే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి కొనసాగుతుందా? అని ప్రశ్నించారు. రేషన్ డీలర్లకు రూ.5వేలు, క్వింటాకు కమీషన్ రూ.300లు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, దీనిని అమలు చేస్తున్నారా? అని ప్రశ్నించారు. కేరళ, తమిళనాడులో రూ.18వేలకు పైగా చెల్లిస్తున్నారన్నారు. నగదు బదిలీ స్కీమ్‌ను తీసుకురావాలనే కేంద్ర ప్రభుత్వ ఆలోచన నిజమేనా అని ప్రశ్నించారు. ప్రశ్నోత్తరాల సమయంలో కొత్త సభ్యు ల కు, తమలాంటి వారికి ముందుగా అవకాశం కల్పిస్తే ప్రశ్నోత్తరాల్లో అన్ని ప్రశ్నలకు అవకాశం లభిస్తుందని, ముఖ్యమైన అంశాలను ఇతర వేరే నిబంధనల కింద వస్తే బాగుంటుందని సూచించారు.

# రెండేళ్లలో ఎస్ఎల్‌బిసి టన్నెల్ పనులు పూర్తి చేసాం

సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రెండేళ్లలో ఎస్ఎల్‌బిసి టన్నెల్ పనులు పూర్తి చేస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్ పనులు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభిస్తామన్నారు. మూడు కాలువలు బూన్వాది, పిల్లయి పల్లి, ధర్మారెడ్డి కాల్వల పనులను రెండేళ్లలో చేస్తామని, భూసేకరణలో అంద రూ సహకరిస్తే ఒక ఏడాదిలోనే ఆ పనులను పూర్తి చేస్తామన్నారు. శాసనసభలో గురువారం జరిగిన ప్రశ్నత్తోరాల సమయంలో సభ్యులు వేముల వీరేశం, రామారావు పాటిల్, మందుల స్వాయ్యేల్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, కౌశిక్ రెడ్డి, పాయల్ శంకర్, బీర్ల ఐలయ్య అడిగిన ప్రశ్నకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానమిచ్చారు. బూన్వాది, పిల్లయి పల్లి, ధర్మారెడ్డి ఈ మూడు కాలువలకు మూసీ నది జలాలల ద్వారా నీళ్లు ఇవ్వబోతున్నామని, తద్వారా 60 వేల ఎకరాల కు నీళ్లు పారబోతాయన్నారు. గతంలో నీటిపారుదలపైన చాలా ఖర్చు చేసినప్పటికీ, చాలా తక్కు వ ఆయకట్టు మాత్రమే వచ్చిందన్నారు.

పదేళ్ల కాలంలో రూ. 1.81లక్షల కోట్లు ఖర్చు పెడితే ఆయకట్టు చాలా తక్కువ వచ్చిందని, అందుకే తాము తక్కువ ఖర్చుతో ఎక్కువగా ఆయకట్టు వచ్చేలా ప్రయత్నిస్తున్నామన్నారు. మూసీ పునర్జీ వం జరిగి, ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అదనపు నీరు వస్తే ఆ జిల్లా ప్రజలకు మేలుజరుగుతుందన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ కాల్వకు రూ.120 కోట్లు, త్వరలో టెండర్లు పిలుస్తామని అన్నారు. బహ్మణ వెల్లంల ప్రాజెక్ట్ పనులను అప్పటి సిఎం వై.ఎస్. ప్రారంభించారని వివరించారు. ఈ ప్రాజెక్ట్‌కు భూసేకరణ నిమిత్తం ఈ మధ్యనే రూ. 37 కోట్లు మంజూరుచేశామని, ఈవారంలోనే మరో రూ.22 కోట్లను మంజూరు చేస్తామని, వారం, పదిరోజుల్లో రూ.10 కోట్లు విడుదల చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

చిన్నచిన్న ఎత్తిపోతల ప్రాజెక్ట్‌లకు సరైన భద్రత లేకపోవడంతో ఎత్తిపోతల ప్రాజెక్ట్‌లు దెబ్బతిన్నాయని, అందుకే తాము 'మినీ స్మాల్ ప్రాజెక్ట్ ఎత్తిపోతల ప్రాజెక్ట్'ను ప్రత్యే క డ్రైవ్‌గా చేపట్టామని మంత్రి వివరించారు. ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు సరైన నిర్వహణ ఉండాలనే ఉద్దేశంతోనే 700మంది ఇంజనీర్లను నియమించామని, 1800 లష్కర్ల నియామకాలకు ఆర్థిక శాఖ నుంచి అనుమతి వచ్చిందన్నారు. నీటిపారుదల శాఖలో గతంలో ఒక్కరిని కూడా నియమించాలేదన్నారు. బస్వాపూర్ ప్రాజెక్ట్‌కు గత ప్రభు త్వం పనులు మొదలు పెట్టినప్పటికీ భూసేకరణ పనులను నిధులు ఇవ్వలేదన్నారు. కాస్ట్ బినిఫెట్ లేనిది ఏ ప్రాజెక్ట్‌కు తాము అనుమతి ఇవ్వడం లేదని స్పష్టం చేశారు. నీరు అందుబాటులో ఉండాలని, భూసేకరణకు స్థానికులు అంగీకరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

# రెవెన్యూ వ్యవస్థలో పూర్తిస్థాయి ప్రక్షాళన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రెవెన్యూ వ్యవస్థను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ధరణి పెండింగ్ దరఖాస్తుల స్థితి అనే అంశంపై బిజెపి సభ్యులు పాయల్ శంకర్, బిఆర్‌ఎస్ సభ్యులు గంగుల కమలాకర్ ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రెవెన్యూ వ్యవస్థను సరిదిద్దే బాధ్యతల అందరిపై ఉందన్నారు. భూభారతి(భూమి హక్కుల రికార్డు)పై బిల్లు బుధవారం ప్రవేశపెట్టామని తెలిపారు. భూ సమస్యలపై భవిష్యత్తులో హైదరాబాద్ వచ్చే పరిస్థితి ఉండదన్నారు. ఇప్పటికే జారీ చేసిన ఓఆర్‌సిలు పరిశీలిస్తామని, బోగస్ ఓఆర్‌సిలు కొన్ని ఉంటే ఉండొచ్చు అని మంత్రి అన్నా రు. బిజెపి సభ్యులు పాయల్ శంకర్ చెప్పినవన్ని నగ్న సత్యాలు అని మంత్రి అన్నారు. అంతకు ముందు బిఆర్‌ఎస్ సభ్యులు గంగుల కమలాకర్ మాట్లాడుతూ ఓఆర్‌సి సర్టిఫికేట్‌లు పిఓబిలో పెట్టారని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

**బాలనాగమ్మ- మాయల పకీర్ కథలా ధరణి పోర్టల్ : పాయల్ శంకర్**

అంతకు ముందు బిజెపి సభ్యులు పాయల్ శంకర్ మాట్లాడుతూ బాలనాగమ్మ మయాల పకీర్ కథలా ధరణి పోర్టల్ వ్యవహారం ఉందన్నారు. ధరణి పోర్టల్‌తో అనేక ఘోరాలు జరిగాయన్నారు. పట్టా భూములున్న రైతులు రోడ్డున పడ్డారని, కూలీలుగా, అనాదలుగా మారారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భూములు ఆదిలాబాద్ లో ఉంటే, వాటిని వివాదం చేసి, హైదరాబాద్ సిసిఎల్‌ఎలో ఉన్నాయన్నారు. భూముల సమస్యలు పరిష్కరించేందుకు తహసీల్దార్, ఆర్‌డిఓ, కలెక్టర్‌లకు కూడా అధికారం లేకుండా పోయిందన్నారు. సిసిఎల్‌ఎకు పోతే సమస్య పరిష్కారం అవుతుందనుకుంటే, అక్కడ సమస్య పరిష్కారం లభించడం లేదన్నారు.

**త్వరలోనే వెయ్యిమంది సర్వేయర్లను నియమిస్తాం**

త్వరలోనే వెయ్యిమంది సర్వేయర్లను నియమాకం చేసి, అటవీ, ఇతర భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖలో కేవలం 248 మంది సర్వేయర్లు మాత్రమే ఉన్నారని తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో గిరిజనులు, అటవీ అధికారుల మధ్య భూ వివాదాల అంశంపై సభ్యులు మదన్ మోహన్ రావు, బాలు నాయక్, పాల్వాయి హరీశ్, కవ్వంపల్లి సత్యనారాయణ, మురళీ నాయక్, అనిరుధ్ రెడ్డి, మనోహర్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ ఖమ్మం పాల్వంచలో కూడా అటవీ భూమి సమస్య ఉందన్నారు. అటవీ భూముల సమస్య అన్ని జిల్లాల్లో ఉందని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కర్నాటక సరిహద్దు సమస్యను పరిష్కరిస్తామని, కర్నాటక ప్రభుత్వంతో మాట్లా డి డిమార్కెష న్ చేయిస్తానని సభ్యులకు ఆయన హామీనిచ్చారు. అంతకు ముందు బిజెపి సభ్యులు పాల్వాయి హరీశ్ మాట్లాడుతూ సిర్పూర్‌లో 2002, 2004 లో గిరిజనులకు పట్టాలు ఇచ్చారని, పూర్తిగా ఆసైన్డ్ భూములన్నారు.మదన్ మోహన్ రావు మాట్లాడుతూ ఆర్‌ఓఆర్ పట్టాలు ఉన్నాయని, 30 ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటున్న భూములు అటవీ భూములని, రైతులను రానివ్వడం లేదన్నారు. బోర్లు, విద్యుత్ తీసుకొనివ్వడం లేదన్నారు. అటవీ శాఖ అధికారుల అత్యుత్సహానికి అడ్డుకట్ట వేయాలని సభ్యులు కోరారు.

# అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలు హేయం

బే షరతుగా క్షమాపణ చెపాలి : డిహెచ్‌పిఎస్ రాష్ట్ర సమితి డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు హేయమని, ఈ వ్యాఖ్య లను దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) తీవ్రంగా ఖండి స్తోందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక.అనిల్ కుమార్ అన్నారు.అమిత్ షా బేషరతుగా దేశ ప్రజానీకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ పేరును పలకటం ఫ్యాషన్ కాదని, అది సమానత్వం, స్వాతంత్రం, సామాజిక మార్పు కోసం జరిగిన విప్లవానికి ప్రతీక ఆయన పేర్కొన్నారు. అంబేద్కర్ కోట్లాది పీడితులకు న్యాయం, హక్కులను అందించిన ఒక చారిత్రక ఉద్యమం అన్నారు. అంబేద్కరును దేవుడితో పోల్చడం, ఆయన ఆలోచన తత్వాన్ని, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్రను తగ్గించడానికి చేసిన ప్రయత్నమని పేర్కొన్నారు. ఇది బిజెపి సామాజిక ఐక్యత, ప్రజాస్వామ్య విలువల పట్ల అవహేళనకు సంకేతం అన్నారు.



హైదరాబాద్‌లో శీతాకాల విడిది చేస్తున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మహారాష్ట్ర మాజీ గవర్నర్ సిహెచ్. విద్యాసాగర్‌రావు కుటుంబ సమేతంగా కలిసి, ఆయన రచించిన 'ఉనికి ' పుస్తక ప్రతిని అందజేసారు.

# అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలు అమిత్ షా వెనక్కి తీసుకోవాలి

## ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బి.ఆర్అంబేద్కర్ పై కేంద్రహోంమంత్రి అమిత్ షా వేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలీ ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలీ ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ అమిత్ షా రాజ్యసభలో చేసిన వ్యాఖ్యల్ని ఉపసంహరించుకుని దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ కు, ఆయన సిద్ధాంతాలకు బిజెపి వ్యతిరేకమని వారు మండిపడ్డారు. బాబా సాహెబ్ అంబేద్కర్ ను, ఆయన రచించిన రాజ్యాంగాన్ని గౌరవించకూడదని మనుస్మృతి, ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం అమిత్‌షా కు నేర్పుతోందన్నారు. దళితులను ఈసడించడమే పనిగా పెట్టుకున్న సంఘ్ పరివార్ సామాజిక న్యాయం కోరుకునే వారందరికీ స్ఫూర్తి ప్రదాత అయిన అంబేద్కర్ ను అవమానించడం పరిపాటిగా మారిందన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజ్యసభలో 'అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్' అనడం ఫ్యాషన్ అయిపోయింది. ఇన్నిసార్లు భగవంతుడి పేరు తలిస్తే ఏడు జన్మల దాకా స్వర్గ ప్రాప్తి కలిగేది' అని అన్నారన్నారు. అమిత్ షా అంబేద్కర్ మీద చేసిన వ్యాఖ్యలు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌కు త్రివర్ణ పతాకం మీద, అశోకచక్రం మీద విశ్వాసం లేదని నిరూపించాయన్నారు. ఇదేక్రమంలో అంబేద్కర్ నూ తీవ్రంగా అవమానించారని వారు పేర్కొన్నారు.

# విన్నపాలపై ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక అందిస్తాం

ఎస్‌సి ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్




**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి:** ఎస్సీ కులాల ఉప వర్గీకరణ కోసం నిర్వహించిన బహిరంగ విచారణలో తమ దృష్టికి వచ్చిన అభ్యర్థనలు, విన్నపాలపై పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామని ఎస్సీ ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో వివిధ ఎస్సీ కులాల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్నామని తెలిపారు. హనుమకొండ కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల విచారణ కమిషన్ ఆధ్వర్యంలో గురువారం షెడ్యూల్డ్ కులాల్లో ఉప వర్గీకరణపై వివరణాత్మక అధ్యయనం కోసం వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలో బహిరంగ విచారణ నిర్వహించారు. వర్గీకరణపై ఉమ్మడి జిల్లా పరిధిలోని వివిధ ఎస్సీ కుల సంఘాలు ఇచ్చిన దరఖాస్తులను ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఏక సభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ మాట్లాడు తూ షెడ్యూల్డ్ వివిధ ఎస్సీ కుల సంఘాల నుంచి 135 వినతులు, అభ్యర్థనలు అందాయ ని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన న్యాయపరమైన అంశాలు, ఉద్యోగ, సామాజిక పరిస్థితులు, చరిత్రాత్మక వ్యవహారాలను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పా టు చేసిందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల కుల సంఘాల అభ్యర్థనలు, వినతులు సేకరించి ప్రభుత్వానికి పూర్తి స్థాయి నివేదిక అందిస్తామని పేర్కొన్నారు. బహిరంగ విచారణ జరగకంటే ముందు హనుమకొండ ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద దేవి ఏకసభ్యకమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేశారు. పలు అంశాలను చర్చించారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ ను ఘనంగా సన్మానించారు. వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని హనుమకొండ, మహబూబాబాద్, ములుగు, భూపాల్ పల్లి జిల్లాల నుంచి ఎస్సీ కుల సంఘాల నాయకులు ప్రతినిధులు పెద్ద సంఖ్యలు తరలి వచ్చారు.

**హసన్‌పర్తి మండలం సుబ్బాయపల్లి ఎస్‌సి కాలనీ సందర్శన**

హసన్‌పర్తి మండలం సుబ్బాయపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీని ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్సీలతో ప్రత్యేకం గా మాట్లాడారు. వసతుల కల్పన, మౌలిక సౌకర్యాల పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏమై నా ఇబ్బందులు, సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కాలనీ వాసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి,సాంఘిక సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల డిఎస్సిడివో, ఎస్ డబ్ల్యూ ఓ లు, ఎస్సీ, ఎస్టి, విజిలెన్స్ కమిటీ మెంబర్ ఈవి శ్రీనివాస్ రావు, పలువురు జిల్లా అధికారులు, వివిధ ఎస్సీ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**సూపరింటెండెంట్ కార్యాలయం :: మోడర్న్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి**

పెట్లబుర్జ్, హైదరాబాద్ - తెలంగాణ రాష్ట్రం.

Rc.No. Peshi/MGMH/2024/SPL **టెండర్ ఫారం** తేది: 17.12.2024

**విషయం:** పేషి - మోడర్న్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, పెట్లబుర్జ్, హైదరాబాద్ - నిరుపయోగ పరికరాలు తొలగించడం - సంబంధించి.

**తరపున :** **1.** ఈ అధికారి, మేనేజింగ్ డైరెక్టర్, టిఎస్ఎంఎస్ఐడిసి, హైదరాబాద్ Lr.Rc.No. Peshi/MGMH/2023/1211, తేది: 10-10-2023 నుండి. **2.** G.O.Ms.No.87, HM&FW (C2) శాఖ, తేది: 13.10.2025.

*****

పైన పేర్కొనబడిన ఆసుపత్రుల నుండి నిరుపయోగ పరికాలను తొలగించేందుకు ప్రముఖ వ్యక్తుల నుండి సీల్డ్ టెండర్లను దాఖలు చేసేందుకు సీల్డ్ టెండర్లను ఆహ్వానించడమైనది.

**(1)** టెండరు ఫారాల విక్రయ ప్రారంభం తేది: 20.12.2024 నుండి 24.12.2024 వరకు అన్ని పని వేళలలో ఉ.11.00గం.ల నుండి మ.3.00 గం.ల వరకు జరుపబడును. **(2)** టెండర్ ఫారాల ధర రూ.5000/-, ఈ నగదు తిరిగి ఇవ్వబడదు. **(3)** ఆసక్తిగల టెండరుదారులు హెచ్‌డిఎస్, మోడర్న్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, పెట్లబుర్జ్, హైదరాబాద్ పేరుతో డి.డి. రూపంలో ఇఎండి రూ.1,00,000/- డిపాజిట్ చేయవలెను. ఈ డి.డి.ని టెండర్‌తో జతపర్చవలెను. లేని యెడల దానిని పరిగణలోనికి తీసుకోబడదు మరియు నిరాకరించబడును. **(4)** నిరుపయోగ పరికరాలకు సంబంధించి నియమ నిబంధనములను మరియు ఇతర వివరాలకు సూపరింటెండెంట్, మోడర్న్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, పెట్లబుర్జ్, హైదరాబాద్ నుండి 20.12.2024 నుండి 24.12.2024 వరకు ఏ పనిదినములోనైనా ఉ.11.00గం.ల నుండి మ.3.00గం.ల వరకు పొందవచ్చు. **(5)** సీల్డ్ టెండర్లను 27.12.2024న మ.3.00గం.ల వరకు సూపరింటెండెంట్, మోడర్న్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, పెట్లబుర్జ్, హైదరాబాద్ చాంబర్‌లో (డ్రాప్ సీల్డ్ టెండర్లు వేయబడును) సంప్రదించవచ్చు. **(6)** సీల్డ్ టెండర్లను 27.12.2024న మ.3.30గం.లకు సూపరింటెండెంట్, మోడర్న్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, పెట్లబుర్జ్, హైదరాబాద్ చాంబర్‌లో టెండరుదారుల సమక్షంలో తెరువబడును.

సం/- సూపరింటెండెంట్, మోడర్న్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, పెట్లబుర్జ్, హైదరాబాద్.

DIPR R.O. No. : 8088-PP/CL/ADVT/1/2024-25, Date: 19-12-2024

ఫోకస్

# వ్యవసాయం

## సాగు విధానంలో పెను మార్పులు..



ప్రపంచ వ్యాప్తంగా ఇటీవల కాలంలో వ్యవసాయ రంగం విప్లవాత్మక మార్పులకు లోనవుతున్నది. అత్యాధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో, ఈ మార్పులు సాధ్యమవుతున్నాయి.



### వాటిలో కొన్ని కీలక అంశాలు..

డిజిటలైజేషన్... ఆటోమేషన్: ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), రోబోటిక్స్ వ్యవసాయ కార్యకలాపాలను విప్లవాత్మకంగా మారుస్తున్నాయి, నిజసమయ పర్యవేక్షణ, ఖచ్చితమైన వ్యవసాయం మరియు స్వయంచాలక నిర్ణయం తీసుకోవడాన్ని ప్రారంభిస్తాయి. ఉదాహరణకు, ఐఒటి పరికరాలు నేల ఉష్ణోగ్రత, తేమ, పంట ఆరోగ్యాన్ని ట్రాక్ చేయగలవు, ఎఐ శక్తితో పనిచేసే డ్రోన్లు పంట డేటాను విశ్లేషించి వ్యాధులను గుర్తించగలవు.

**ఖచ్చితత్వ వ్యవసాయం:** పంట దిగుబడిని ఆప్టిమైజ్ చేయడానికి, వ్యర్థాలను తగ్గించడానికి, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి జిపిఎస్, సెన్సార్లు, డేటా అనలిటిక్స్ వంటి అధునాతన సాంకేతికతలను ఉపయోగించడం ఈ విధానంలో ఉంటుంది. ఖచ్చితమైన వ్యవసాయం రైతులకు సరైన మొత్తంలో నీరు, ఎరువులు, పురుగుమందులను సరైన సమయంలో వర్తింపజేయడంలో సహాయపడుతుంది. పర్యావరణ ప్రభావాన్ని తగ్గిస్తుంది.

**నియంత్రిత పర్యావరణ వ్యవసాయం (సిఇఎ):** దిగుబడిని గరిష్టంగా చేయడానికి చేయడానికి మరియు పర్యావరణ ఒత్తిళ్లను తగ్గించడానికి ఇండోర్ పొలాలు, గ్రీన్‌హౌస్‌లు లేదా నిలువు పొలాలు వంటి నియంత్రిత వాతావరణాలలో పంటలను పండించడం సిఇఎలో ఉంటుంది. ఈ విధానం పంట నాణ్యతను మెరుగుపరుస్తుంది, నీటి వినియోగాన్ని తగ్గిస్తుంది ఆహార భద్రతను పెంచుతుంది.

**పునరుత్పత్తి వ్యవసాయం:** ఈ ధోరణి నేల ఆరోగ్యం, జీవవైవిధ్యం మరియు పర్యావరణ వ్యవస్థ సేవలను సాగు చేయని లేదా తగ్గించిన వ్యవసాయం, కవర్ క్రాపింగ్, పశువుల మేతని సమగ్రపరచడం వంటి పద్ధతుల ద్వారా ప్రచారం చేయడంపై దృష్టి పెడుతుంది. పునరుత్పత్తి వ్యవసాయం కార్బన్ను సీక్వెస్టర్ చేయడంలో సహాయపడుతుంది, నేల సంతానోత్పత్తిని మెరుగుపరుస్తుంది. పర్యావరణ వ్యవస్థ స్థితిస్థాపకతకు మద్దతు ఇస్తుంది.

**అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ:** బయోటెక్నాలజీలో పురోగతి కరువును తట్టుకోవడం, చీడపీడల నిరోధకత, మెరుగైన పోషకాహారం వంటి మెరుగైన లక్షణాలతో పంటల అభివృద్ధిని అనుమతిస్తుంది. బయోటెక్నాలజీ పురుగు మందుల వాడకాన్ని తగ్గించడంలో, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడంలో కూడా సహాయపడుతుంది.

**బిగ్ డేటా/ అనలిటిక్స్:** వ్యవసాయంలో బిగ్ డేటా, అనలిటిక్స్ వాడకం చాలా ముఖ్యమైనది, రైతులు డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడానికి, దిగుబడిని ఆప్టిమైజ్ చేయడానికి మరియు ఖర్చులను తగ్గించడానికి వీలు కల్పిస్తుంది. డేటా అనలిటిక్స్ రైతులకు ట్రెండ్లను గుర్తించడంలో, వాతావరణ నమూనాలను అంచనా వేయడంలో, వ్యాధులను ముందుగానే గుర్తించడంలో సహాయపడుతుంది.

**పట్టణ వ్యవసాయం:** 2050 నాటికి ప్రపంచ జనాభా 9.7 బిలియన్లకు చేరుతుందని అంచనా వేయబడినందున, ఆహార ఉత్పత్తిని పెంచడానికి, రవాణా ఖర్చులను తగ్గించడానికి మరియు ఆహార భద్రతను ప్రోత్సహించడానికి పట్టణ వ్యవసాయం వినూత్న పరిష్కారాలుగా అభివృద్ధి చెందుతోంది. ఈ విధానాలు పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడానికి, ఆహార నాణ్యతను మెరుగుపరచడంలో కూడా సహాయపడతాయి.

**అగ్రి-రోబోటిక్స్/ డ్రోన్లు:** రోబోటిక్స్ మరియు డ్రోన్లు వ్యవసాయంలో మొక్కలు నాటడం, కత్తిరించడం, కోయడం వంటి పనులను ఆటోమేట్ చేయడానికి,



పంట ఆరోగ్యాన్ని పర్యవేక్షించడానికి, వ్యాధులను గుర్తించడానికి ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఈ సాంకేతికతలు సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయి, కార్మిక వ్యయాలను తగ్గించగలుగుతాయి. ఖచ్చితమైన వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తాయి.

# పర్యావరణం

## చెట్లుతో ముప్పు!



చెట్లు పర్యావరణానికి మేలు చేస్తాయన్నది అందరికీ తెలిసిన విషయమే. కానీ, కొన్నిరకాల చెట్లు పర్యావరణానికి, జంతుజాలానికేకాదు.. వృక్షజాలానికి కూడా కీడుచేస్తాయని మద్రాసు హైకోర్టు తీర్పుతో స్పష్టమైంది. తమిళనాడు అడవుల్లో అన్యదేశ, ఆక్రమణ జాతులను నిర్మూలించాలని కోర్టు ఆదేశాలు జారీ చేయడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. 2025 అక్టోబర్ ఒకటో తేదీలోగా సెన్నా స్పెక్టాబిలిస్ వంటి ఆక్రమణ వృక్షజాతులను రాష్ట్రంలోని అడవుల నుంచి పూర్తిగా తొలగించాలని మద్రాసు హైకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. సెన్నా స్పెక్టాబిలిస్ అనేది స్థానిక వృక్షజాలం, జంతుజాలానికి ముప్పు కలిగించే ఒక ఆక్రమణ వృక్ష జాతి. ప్రస్తుతానికి, తమిళనాడు అడవుల్లో ఈ జాతులుదాదాపు 28,000 టన్నుల మేర మిగిలిఉన్నాయి. దీన్ని ఏడాదిలోగా పూర్తిగా తొలగించాలని హైకోర్టు ఆదేశించింది.ఈ నిర్ణయంతో సంవత్సరాల తరబడి న్యాయ, పర్యావరణం మధ్య పడిన చిక్కుముడి వీడింది. తమిళనాడు న్యూస్‌ప్రింట్ అండ్ పేపర్స్ లిమిటెడ (టిఎన్‌పిఎల్), శేషసాయి పేపర్స్ అండ్ బోర్డ్స్ లిమిటెడ్ ఒకొక్కటి14,000 టన్నుల చొప్పున సెన్నా స్పెక్టాబిలిస్‌ను అందుకోనున్నాయి.ఈ కేటాయింపు ప్రక్షాళన ప్రణాళికలో ఒకభాగం. ఈ కంపెనీల నుంచి కలపకు మంచి ధర లభించేలా చర్యలు కొనసాగుతున్నాయి. అయితే ఈచర్యల వల్ల సెన్నా స్పెక్టాబిలిస్ నిర్మూలన ప్రక్రియను ఆలస్యం కారాదని న్యాయమూర్తులు జస్టిస్ ఎన్. సతీష్ కుమార్, జస్టిస్ డి. భరత చక్రవర్తి నేతృత్వంలోని మద్రాసు హైకోర్టు బెంచ్ పేర్కొంది. లాంటానా కమారా తొలగింపును సులభతరం చేయడానికి బ్రికెట్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని అటవీ శాఖను ఆదేశించింది. ఈ యూనిట్ ఇన్వాసివ్ జాతులను ఇంధనం కోసం బ్రికెట్లుగా మారుస్తుంది. ప్రైవేటు బ్రికెట్ యూనిట్లు ఉన్నప్పటికీ, ప్రభుత్వం నిర్వహించే యూనిట్ ఉండితీరాలని ధర్మాసనం స్పష్టం చేసింది. మొత్తం మీద మద్రాసు హైకోర్టు తీర్పు, అడవుల్లో చెట్లకు, జంతుజాలానికీ ప్రమాదాన్ని తెచ్చిపెట్టే వృక్షజాతులపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది.

# వ్యవసాయం వెంటే పశుపోషణ





వ్యవసాయాన్ని, పశుపోషణను వేరువేరుగా చూడడానికి వీల్లేదు. ఎంత యాంత్రికత ప్రవేశిస్తున్నా, అనేకానేక రకాలుగా పశుపోషణ గ్రామీణ జీవనంలో కీలక పాత్ర పోషిస్తునే ఉంది. వ్యవసాయానికి ఊతమిస్తునే ఉంది. పశుపోషణ అనేది మాంసం , ఫైబర్, పాలు లేదా ఇతర ఉత్పత్తుల కోసం పెంచే జంతువులకు సంబంధించిన వ్యవసాయ శాఖ. ఇది రోజువారీ సంరక్షణ, నిర్వహణ, ఉత్పత్తి, పోషణ, ఎంపిక చేసిన పెంపకం వంటి అంశాలతో కూడుకుంది. క్రీస్తుపూర్వం 13,000లోనే పలు జంతువులను మొదటిసారిగా పెంపుడు జంతువులుగా మార్చారు. ఈ 'నియోలిథిక్ విప్లవం'తో మొదలై, మొదటి పంటల వ్యవసాయానికి ముందు నుండి, యానిమల్ హస్బెండరీకి సుదీర్ఘ చరిత్ర ఉంది. ఈజిప్టు వంటి పురాతన సమాజాల కాలంలో, పశువులు, గొర్రెలు, మేకలు, పందులను పొలాల్లో పెంచేవారు. క్రమంగా ఈ రంగంలో మార్పులు చోటు చేసుకోవడం ప్రారంభమైంది. 18వ శతాబ్దపు బ్రిటిష్ వ్యవసాయ విప్లవ సమయంలో డిష్లీ లాంగ్ హార్న్ పశువులు, లింకన్ లాంగ్వూల్ గొర్రెలు ఓ విప్లవం. పలు రకాల పశు జాతులను పరిశోధకులు అభివృద్ధి చేసినప్పుడు, కొలంబియన్ మార్పిడి భారీ మార్పులకు పునాది వేసింది. ఎక్కువ మాంసం, పాలు, ఉన్ని ఇచ్చే పశువుల పెంపకం లాభాల పంట పండించింది. ఆవులు, గేదెలతోపాటు గుర్రాలు, నీటి గేదెలు, కుందేళ్లు, పందులు ఈ జాబితాలో చేరాయి. కేవలం మన దేశంలో మాత్రమేగాక, ప్రపంచ వ్యాప్తంగా ఇలాంటి అనేక రకాల జంతువులు పశుపోషణ విభాగంలో చేరిపోయాయి. అనంతరం కాలంలో చేపల పెంపకం (అక్వాకల్చర్) కూడా రంగ ప్రవేశం చేసింది. కాగా, ఆధునిక పశుపోషణ అందుబాటులో ఉన్న భూమికి అనుగుణంగా ఉత్పత్తి వ్యవస్థలపై ఆధారపడుతుంది. జీవనాధార వ్యవసాయం ప్రపంచంలోని మరింత అభివృద్ధి చెందిన ప్రాంతాలలో విస్తారమైన జంతు పెంపకం ద్వారా భర్తీ అయింది. ఉదాహరణకు, గొడ్డు మాంసం పశువులను అధిక సాంద్రత కలిగిన ఫీడ్లాట్లలో ఉంచుతారు. వేలాది కోళ్లను బ్రాయిలర్ ఇళ్ళు లేదా ఫారాల్లో పెంచుతున్నారు. స్థాయిలో జంతు వ్యవసాయం వాతావరణ మార్పు, సముద్ర ఆమ్లీకరణ, జీవవైవిధ్య నష్టానికి దారితీస్తుంది. సర్వభక్షకులైన పందులు, కోళ్ల వంటి వాటిని మినహాయిస్తే, చాలా వరకు పశువులు శాకాహారులు. పశువులు, గొర్రెలు వంటి రూమినెంట్లు గడ్డిని తినడానికి అనుకూలంగా ఉంటాయి. అవి ఆరుబయట మేత పొందుతాయి లేదా గుళికల తృణ ధాన్యాలు వంటి శక్తి, మాంసకృత్తులలో సమృద్ధిగా ఉన్న దాణాను పూర్తిగా లేదా పాక్షికంగా తినిపించవచ్చు. పందులు, పౌల్ట్రీలు మేతలోని సెల్యులోజ్‌ను జీర్ణించుకోలేవు. వాటికి ఇతర రకాలైన అధికప్రోటీన్ ఆహారాలు అవసరం. పశు సంవర్ధక శాఖలు దాదాపు అన్ని దేశాల్లోనూ ఉంటాయి. వాటి సాయంతో పశువుల పెంపకందారులు కీకలకమైన సమాచారాన్ని పొందవచ్చు. అదే విధంగా వాటికి సోకే వివిధ రకాల రోగాలపైన అవగాహనను కూడా పొందవచ్చు. లాభదాయకమైన పశుపోషణ రైతులకు అదనపు ఆదాయ వనరుగా ఉపయోగపడుతుంది.

## పేదప్రజలకు పట్టాలుఇవ్వాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** జీవో నెంబర్ 58 ప్రకారం పేదప్రజలకు పట్టాలుఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. గురువారం ఖిలా వరంగల్ మండల బిఆర్ అంబేద్కర్ నగర్ జనరల్ బాడీ సమావేశం మండల సహాయ కార్యదర్శి ఓర్సు రాజు అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో జిల్లా కార్యదర్శి మేకల రవి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు జీవోనెంబర్ 58 ప్రకారం పట్టాలు ఇస్తామని చెప్పి, ఇవ్వకుండా మోసం చేశారని, దీంతో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో గుడిసెలు వేసి పేద ప్రజలకు పంచడం జరుగుతుందన్నారు. వారు ఇవ్వలేని భూమిని పేద ప్రజలు గుడిసెలు వేసుకుంటే వారిపైన అక్రమ కేసులు పెట్టి బెదిరించడం హేయమైన చర్య అన్నారు. తక్షణమే ఇచ్చిన హామీ ప్రకారం పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు కట్టివ్వాలని, బొల్లికుంటలో గుడిసెలు వేసిన పేద ప్రజలు అందరూ ఈ పోరాటం విజయవంతం అయేంతవరకు పోరాటం చేయాలని, పోరాటాన్ని విజయవంతం అయ్యేంత వరకు వెంట ఉంటామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్ మియా, ఖిలా వరంగల్ మండల కార్యదర్శి దండు లక్ష్మణ్, మండల సహాయ కార్యదర్శి జాన్ పాల్, మండలనాయకులు సౌందర్య, చిట్యాల సువర్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ల్యాదల్ల శరత్, రమేష్ బాబు, కుమార్, ప్రభాకర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామగ్రామాన జెండాలు ఎగురవేద్దాం



**ప్రజాపక్షం/రామడుగుః** సిపిఐ శత జయంతి ఉత్సవాలను గ్రామ గ్రామాన జెండాలు ఎగురవేసి విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని దేశరాజ్‌పల్లి, మోతె, గుండి గ్రామాల్లో సిపిఐ సభ్యత్వ పునరుద్ధరణతో పాటు నూతన సభ్యుల నమోదు కార్యక్రమం చేపట్టి కార్డుల పంపిణీ చేశారు.సృజన్ మాట్లాడుతూ దేశంలో సిపిఐ పార్టీ ఏర్పడి 100 వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సంధర్భంగా అన్ని గ్రామాల్లో పండుగ వాతావరణంలో పార్టీ జెండాలు ఎగురవేయాలన్నారు. దేశానికి స్వాతంత్రం రాక ముందే రాజకీయ పార్టీగా ఈ దేశంలో ఆవిర్భవించిన ఏకైక పార్టీ సిపిఐ మాత్రమేనన్నారు. ఇదే కాకుండా క్షేత్రస్థాయిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికుల నుంచి మొదలకుని విమానాల్లో పనిచేసే ఏర్ హోస్ట్ వరకు వారి సమస్యల పరిష్కారం కోసం కార్మిక సంఘాలను నిర్మించి, కోట్లాది మంది ప్రజలు, కార్మికుల కోసం అశేష త్యాగాలు చేసి హక్కులు సాధించిన ఏకైక పార్టీ సిపిఐ అన్నారు.అనేక అబద్దాలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రజా సమస్యలను పరిష్కారం చేయడంలో పూర్తిగా వైఫల్యం చెంది ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ అనుకూలంగా ఉన్న కార్పోరేట్ దోపిడీదారులకు సంపద ముట్ట చెప్తున్నారని విమర్శించారు.సిపిఐ మండల కార్యదర్శి గొడిశాల తిరుపతి గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉమ్మెంతుల రవీందర్ రెడ్డి, మచ్చ రమేష్, నాయకులు మహబూబ్, సాజీద్, మోజేష్, నర్సయ్య, లక్ష్మణ్, సురేందర్ తదితరులున్నారు.

## కేంద్ర మంత్రి అమిత్‌షాను బేషరతుగా బర్తరఫ్ చేయండి

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు హేయమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు అమిత్ షా బేషరతుగా దేశ ప్రజానీకానికి క్షమాపణలు చెప్పాలని కేంద్ర హోం మంత్రి పదవి నుంచి అమిత్‌షాను తొలగించాలని డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలోని బాలసముద్రంలో గల జిల్లా కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి సిపిఐ నాయకులు నివాళులర్పించారు. అనంతరం తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ అంబేద్కర్ పేరును పలకటం ఫ్యాషన్ కాదని, అది సమానత్వం, స్వాతంత్రం, సామాజిక మార్పు కోసం జరిగిన విప్లవానికి ప్రతీక పేర్కొన్నారు. అంబేద్కర్ ది కోట్లాది పీడితులకు న్యాయం, హక్కులను అందించిన ఒక చారిత్రక ఉద్యమంఅన్నారు. అంబేద్కర్‌ను దేవుడితో పోల్చడం, ఆయన ఆలోచన తత్వాన్ని, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్రను తగ్గించడానికి చేసిన ప్రయత్నం అన్నారు. ఇది బిజెపి సామాజిక ఐక్యత, ప్రజాస్వామ్య విలువల పట్ల అవహేళనకు సంకేతం అన్నారు. అంబేద్కర్ ను గౌరవించే ప్రజలు ఈ అవమానానికి ప్రతిస్పందనగా బిజెపికి తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. అణగారిన జాతికి వేగుచుక్క అంబేద్కర్ అన్నారు. దళితులు బడుగు బలహీన వర్గాలు నేడు దేశంలో స్వేచ్ఛ వాయువులను పిలుస్తుందంటే కేవలం అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా ఇచ్చిన హక్కు తప్ప ఏ దేవుడో ఇచ్చింది కాదని అన్నారు. ఎన్నికలకు ముందు అంబేద్కర్ పేరు జపం చేసి అధికారంలోకి వచ్చిన బిజెపి నేడు అంబేద్కర్ పేరు ఎత్తకూడదని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. మనువాద, మతోన్మాద ప్రభుత్వంలో భారత రాజ్యాంగంపై, ప్రభుత్వరంగ సంస్థలపై బిజెపి ప్రభుత్వం దాడి చేస్తుంది అన్నారు. వీరి నుండి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మహబూబాబాద్, జనగామ. హనుమకొండ, వరంగల్, ములుగు జిల్లాల కార్యదర్శులు బి. విజయ సారథి, సిహెచ్ రాజారెడ్డి, కర్రె బిక్షపతి, మేకల రవి, తోట మల్లిఖార్జున రావు, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, బి. అజయ్, ఆదరి శ్రీనివాస్, నల్లు సుధాకర్ రెడ్డి, ఎస్కే బాషుమియా, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, పనాస ప్రసాద్,ఆకుల శ్రీనివాస్, బుస్సా రవీందర్, కర్రే లక్ష్మణ్, బాషబోయిన సంతోష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టులు దేశానికే దిక్సూచి

### సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** కమ్యూనిస్టులు దేశానికే దిక్సూచి అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి అన్నారు. భువనగిరిలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యవర్గ సమావేశం ఏశాల అశోక్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ నాటి నుండి నేటి వరకు భారత కమ్యూనిస్టు పార్టీ శ్రమజీవుల రాజ్యస్థాపన కోసం సమరశీల పోరాటాలు నిర్వహించిందని దేశాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని సిపిఐ దిక్సూచిగా ఉన్నదన్నారు. సిపిఐ 100 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్రంలో గొప్ప బహిరంగ సభ నిర్వహించుటకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. 1925 డిసెంబర్ 26 రోజున కాన్పూర్లో పార్టీ ఆవిర్భావం జరిగిందన్నారు. కష్ట జీవుల రాజ్యం సమ సమాజ నిర్మాణం దోపిడీ లేని సమాజం నిర్మించుటకు అనేక పోరాటాలు ఉద్యమాలు కొనసాగినాయన్నారు.సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మాట్లాడుతూ భూములు లేని నిరుపేదలకు దేశంలో భూ పోరాటాలు నిర్వహించి లక్షల ఎకరాలు నిరుపేదలకు పంపిణీ చేసిన ఘనత కమ్యూనిస్టుపార్టీ దేనన్నారు. ఈనాటికి పెట్టుబడిదారీ వ్యవస్థ గ్రామీణ ప్రాంతాలలో భూస్వాములు యదేచ్ఛగా ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. కమ్యూనిస్టు పార్టీ లక్ష్యసాధన కోసం సంఘటితంగా ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని, యువజన విద్యార్థి అన్ని రంగాలలో ముందుకు తీసుకుపోవడానికి సమగ్రంగా ఉపాధి కల్పన కల్పించాలని అన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ జాతీయ మాజీ కార్యదర్శి నల్లగొండ మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి శాసనసభ్యులు సాంబశివరావు, రాష్ట్ర ఉమ్మడి జిల్లా నాయకులు బహిరంగ సభలో ప్రసంగిస్తారని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర నాయకులు ఉజ్జిని రత్నాకరరావు, సహాయ కార్యదర్శిలు యానాల దామోదర్ రెడ్డి, బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, బచ్చనగోని గాలయ్య, బోడ సుదర్శన్, చెక్క వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టుల అవసరం పెరుగుతోంది

### సిపిఐ నేత బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/కారేపల్లి:**సమాజంలో మారుతున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాల నేపథ్యంలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తిస్తున్నారని తెలిపారు. కారేపల్లి, కామేపల్లి మండలాల సిపిఐ కౌన్సిల్ సంయుక్త సమావేశం గురువారం కారేపల్లి క్రాస్ రోడ్డులో కామేపల్లి మండల కార్యదర్శి పుచ్చకాయల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. హేమంతరావు మాట్లాడుతూ ప్రపంచంలో వామపక్ష అనుకూల తీర్పులు వస్తున్నాయని భారతదేశంలో కూడా బిజెపి అనుసరిస్తున్న విధానాలు, పెరుగుతున్న ఆర్థిక అంతరాలు, నిరుద్యోగం నేపథ్యంలో కమ్యూనిస్టుల అవసరాన్ని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర భారతంలో కమ్యూనిస్టుల పోరాటాలు, త్యాగాల ఫలితంగానే సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ప్రజా అనుకూలమైన అనేక చట్టాలు రూపొందించబడ్డాయన్నారు. పార్టీ శత సంవత్సర ప్రారంభ సభ ఈనెల 2న ఖమ్మంలో జరుగుతుందనితెలిపారు. ఖమ్మంలో భక్త రామదాసు కళాక్షేత్రంలో సభ జరుగుతుందని తెలిపారు. జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ ఖమ్మంజిల్లా సిపిఐకి ఒక చరిత్ర ఉందని పార్టీ నేతృత్వంలో అనేక చారిత్రాత్మక పోరాటాలు జరిగాయన్నారు.సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఏపూరి లతాదేవి, తాతా వెంకటేశ్వర్లు, ఉంగరాల సుధాకర్, పుచ్చకాయల వెంకటకృష్ణ పాల్గొన్నారు.

## స్థానిక సమరానికి సిపిఐ శ్రేణులు సిద్ధంగా ఉండాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా



**ప్రజాపక్షం/పాల్వంచ:**వాడవాడలా సిపిఐ శత వసంతాలు పండుగ జరుపుకుందామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. గురువారం స్థానిక చంద్ర రాజేశ్వర రావు భవన్‌లో సిపిఐ మండల, పట్టణ విస్తృత కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగాసాబీర్ పాషా మాట్లాడుతూ డిసెంబర్ 26నాటికి పార్టీ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో గ్రామ గ్రామాన వందేళ్ల ఉత్సవాలనునిర్వహించి పార్టీ చరిత్రను త్యాగాలను ప్రజలకు వివరించాలని, ప్రతి గ్రామం, బస్తీలో ఉత్సవాలుఘనంగా జరిగేలా ప్రణాళిక రూపొందించుకోవాలని, డిసెంబర్ 26న ప్రతి ఇంటిపై ఎర్రజెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు. పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు.పాల్వంచ ప్రాంత సమగ్ర అభివృద్ధిపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రత్యేక దృష్టి సారించారని, ఇప్పటికే వివిధ పథకాలతో రోడ్లు, డ్రైన్లు, నీటి పథకాలు శరవేగంగా పనులు పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన పనులు త్వరలో ప్రారంభం అవుతాయన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇల్లు పథకంలో అర్హులైన పేదలకు మంజూరయ్యేలా నాయకులు, కార్యకర్తలు చొరవ తీసుకునిసర్వేలో భాగస్వాములు కావాలని కోరారు. అంబేద్కర్‌పై అవమానకరంగావ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఏ రాజ్యాంగం మీద అయితే ప్రమాణం చేసి, ఏ రాజ్యాంగం వలన పదవి అనుభవిస్తున్నాడు ఆ పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందరరావు, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, వీ పద్మజ, సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు వీసంశెట్టి విశ్వేశ్వర రావు, శనగరపు శ్రీనివాసరావు, ఎండి అస్లాం, నరహరి నాగేశ్వరరావు, ఇట్టి వెంకట్రావ్, తదితరులు ఉన్నారు.

## అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలు

# పార్లమెంట్‌లో దుమారం



**న్యూఢిల్లీ :** బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమానిస్తే కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు, పార్లమెంట్ ఆవరణలో బిజెపి ఎంపిల పట్ల ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణలపై పార్లమెంట్ గురువారం అట్టుడికింది. అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. సభా కార్యక్రమాలు పలుమార్లు వాయిదా పడ్డాయి. ఇరు పక్షాల సభ్యుల నినాదాలతో సభలు దద్దరిల్లడంతో చివరికి సభలను మరుసటి రోజుకు వాయిదా వేశారు. లోక్‌సభ ఉదయం 11 గంటలకు సమావేశమైన వెంటనే అంబేద్కర్‌ను అవమానించినందుకు అమిత్ షా రాజీనామా చేయాలని కోరుతూ ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో సభ తొలిసారి వాయిదా పడింది. ఆ తరువాత సభ తిరిగి ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు తమ స్థానాల్లో నుంచి లేచి నిలబడి తమ గళాన్ని వినిపిస్తూ నిరసన తెలిపారు. స్పీకర్ ఓమ్ బిర్లా వారిని శాంతిపజేసేందుకు ప్రయత్నిస్తూ కేంద్రమాజీ మంత్రి ఇవికెఎస్ ఎలంగోవన్ మృతి చెందినట్లు ప్రకటన చేశారు. ఆయనకు సభ్యులు నివాళి అర్పించి కొద్దిసేపు మౌనం పాటించారు. ఆ తరువాత ప్రతిపక్ష సభ్యులు మళ్లీ పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. దీంతో సభను బిర్లా మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. మధ్నాం సభ ప్రారంభం కావడానికి ముందు కాంగ్రెస్ నేత ప్రియాంకాగాంధీ సహా ప్రతిపక్ష సభ్యులు జైమ్ భీమ్ అంటూ నినాదాలు చేస్తూ అంబేద్కర్ పోస్టర్లను ప్రదర్శించారు. కాగా, 2 గంటలకు సభ తిరిగి ప్రారంభం కాగానే నిరసనను కొనసాగించారు. దీంతో స్పీకర్ స్థానంలో ఉన్న దిలీప్ సైకియా సభను శుక్రవారానికి వాయిదా వేశారు. అయితే సభ వాయిదా పడినప్పటికీ బిజెపి, ఇతర అధికార కూటమి సభ్యులు సభను పూర్తిగా బయటకు వెళ్లేంత వరకు కూడా ప్రతిపక్ష సభ్యులు తమ నిరసనను కొనసాగించారు. ఇదిలా ఉండగా జమిలి ఎన్నికలకు సంబంధించిన రెండు బిల్లులను ఉభయసభలకు చెందిన జాయింట్ కమిటీకి సిఫార్సు చేయాలని ప్రభుత్వం తీర్మానం చేసింది.

**రాహుల్ అనుచిత ప్రవర్తన ఆరోపణలపై రాజ్యసభలో గందరగోళం**

అటు రాజ్యసభలోనూ అమిత్ షా రాజీనామా చేయాలని ప్రతిపక్ష ఎంపిలు డిమాండ్ చేయగా, బిజెపి ఎంపిల పట్ల రాహుల్ అనుచితంగా ప్రవర్తించారని అధికార పక్ష ఎంపిలు ఆందోళనకు దిగారు. పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేస్తున్న సందర్భంగా రాహుల్‌గాంధీ తనపై అరిచారని బిజెపి సభ్యురాలు ఎస్ ఫంగ్నోన్ కొన్యాక్ ఆరోపణలు చేయడంతో ఆయనపై చర్యలు తీసుకోవాలని సభలో అధికారపక్ష సభ్యులు నినాదాలు చేశారు. గాంధీ చర్యల వల్ల ఇద్దరు ఇతర ఎంపిలకు గాయాలయ్యాయని బిజెపి నేతలు ఆరోపించారు. చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ కొన్యాక్ తన చాంబర్‌లో తనను కలిశారని, ఆమె ఇచ్చిన ఫిర్యాదును పరిశీలిస్తున్నానన్నారు. గాంధీపై వచ్చిన ఆరోపణలపై డిఎంకె నేత తిరుచ్చి శివ స్పందిస్తూ అధికార పార్టీ సభ్యులే తనను నెట్టారని కాంగ్రెస్ నేత చెప్పారని అన్నారు. నాగాలాండ్ ఎంపి కొన్యాక్ మాట్లాడుతూ పార్లమెంట్ ప్రాంగణంలో రాహుల్‌గాంధీ తనను అసౌకర్యానికి గురిచేశారంటూ అసహనం వ్యక్తం చేశారు. 'ప్లకార్డు పట్టుకుని శాంతియుతంగా తాము నిరసన తెలుపుతున్నాం. అదే సమయంలో రాహుల్‌గాంధీ నాకు సమీపంగా వచ్చారు. ఆయన నాపై అరిచారు. అనుచితంగా ప్రవర్తించారు. ఒక మహిళగా ఎంతో అసౌకర్యానికి గురయ్యా. చాలా బాధగా అనిపించింది. ఆయన తీరుతో పక్కకు తప్పుకున్నా' అని అన్నారు. దీనిపై చైర్మన్‌గా ఫిర్యాదు చేశారు. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్‌పై అవిశ్వాస తీర్మానంపై రాజ్యసభ సెక్రటరీ జనరల్ పిసి మోడీ రూలింగ్‌ను చదవకుండానే రూలింగ్ కాపీని ఉంచడంతో కొన్యాక్ సభలో మాట్లాడే అవకాశం లభించింది. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు రాహుల్ గాంధీ ఒక మహిళా ఎంపిని నెట్టారని, ఆమెపై శారీరకంగా అభియోగాలు మోపారని ఆరోపించారు. రాహుల్ మరో ఇద్దరు సభ్యులను బలంగా నెట్టారని, వారు రక్తస్రావం అయ్యారని, ఆసుపత్రి పాలయ్యారని ఆయన అన్నారు. పార్లమెంట్ కుస్తీ వేదిక కాదని, పార్లమెంటు సభ్యుడు మరే ఇతర సభ్యులపైనా చేతులు ఎత్తలేరని అన్నారు. డిఎంకెకు చెందిన తిరుచ్చి శివ ట్రెజరీ బెంచ్ సభ్యులు చేసిన వాదనలను వ్యతిరేకించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చాలా సీనియర్ వ్యక్తి అని, ఆయన తనను మాత్రమే నెట్టారని ఫిర్యాదు చేశారని, తాము ఎగువసభ సభ్యులందరినీ గౌరవిస్తామన్నారు. శివ మాట్లాడిన తరువాత సభ మరుసటి రోజుకు సభ వాయిదా పడింది.

## 'ఢిల్లీ' బరిలో వామపక్షాలు

**6 చోట్ల సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్) పోటీ**

**ఉమ్మడి 'మేనిఫెస్టో'విడుదల**

**బిజెపిని ఓడించండి..లెఫ్ట్‌ని గెలిపించాలని పిలుపు**

**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల బరి సిద్ధ మవుతోంది. ప్రత్యామ్నాయ శక్తిగా ఆవిర్భవించే ప్రయత్నాన్ని వామపక్షాలు చేస్తున్నాయి. బిజెపిని ఓడించడమే లక్ష్యంగా ఐక్యంగా ముందుకెళుతున్నాయి. ఇదే క్రమంలో లెఫ్ట్‌ను గెలిపించండి..బిజెపిని ఓడించండి అంటూ ఢిల్లీ ప్రజలకు సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్)ఉమ్మడిగా పిలుపునిచ్చాయి. ప్రత్యామ్నాయ శక్తిగా లెఫ్ట్‌ను గెలిపించాలని కోరాయి. ఎన్నికల కోసం ఉమ్మడి మేనిఫెస్టోను గురువారం విడుదల చేశాయి. ఆరు అసెంబ్లీ స్థానాల్లో ఉమ్మడిగా పోటీ చేస్తున్నట్లు సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్) ప్రకటించాయి. వికాస్ పూరి, పాలం స్థానాల నుంచి సిపిఐ పోటీ చేస్తుండగా... కరావల్ నగర్, బాద ర్పూర్ నుంచి సిపిఎం బరిలో నిల్వనుంది. నరే లా, కోండ్లీ స్థానాల నుంచి సిపిఐ(ఎంఎల్) పోటీ చేస్తున్నది. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ కూడా పోటీకి సిద్ధమవుతోంది. తమ అభ్యర్థుల నూ త్వరలోనే ప్రకటించనుంది. అయితే సిపిఐ మరిన్ని స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తోంది. ఆయా స్థానాలు, అభ్యర్థులను సమీప భవిష్య త్‌లో ప్రకటించబోతోంది. కాగా, ఢిల్లీకి సంపూర్ణ రాష్ట్ర హోదా, రేషన్ పంపిణీ విశ్వజనీకరణ, అనధికారిక రంగ కార్మికులకు సామాజిక భద్రత ఫలాల విస్తరణ, పట్టణాల కోసం ఉపాధి హామీ పథకం, మరిన్ని ప్రభుత్వ ఆసుపత్రుల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వస తుల కల్పన, మెరుగుదల, మెరుగైన నిర్వహణ వంటి అనేక అంశాలతో వామపక్షాల మేనిఫెస్టో రూపొందింది.

## అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాను సమర్థిస్తారా?

**చంద్రబాబు, నితీశ్‌కు కేజ్రీవాల్ సూటి ప్రశ్న**

**న్యూఢిల్లీ:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగింది. కేంద్ర మంత్రి అమిత్ షా ప్రజలకు క్షమాపణలు చెప్పాలని, కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు నిరసనలు, ఆందోళనలు, ధర్నాలు, పాదయాత్రలు చేపట్టాయి. ఇదేసమయంలో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ గురువారం తన ఎక్స్ వేదికగా స్పందించారు. ఎన్డీయే మిత్రపక్షాలైన తెలుగుదేశం పార్టీ, జనతాదళ్ (యు) అధినేతలకు ఆయన సూటిగా ఓ ప్రశ్న సంధించారు. ఈ ప్రశ్నను దేశ ప్రజలు నితీశ్, చంద్రబాబు నాయుడును అడగాలనుకుంటున్నారు 'అమిత్ షా జీ... బాబా సాహెబ్‌ను అవమానించడాన్ని మీరు సమర్థిస్తారా?' అని ఎక్స్ వేదికగా వారిద్దరిని కేజ్రీవాల్ హిందీలో ప్రశ్నించారు. వరుసగా రెండు రోజుల పాటు రాజ్యాంగంపై పార్లమెంట్‌లో చర్చ జరిగింది. రాజ్యసభలో అమిత్ షా మాట్లాడుతూ... అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్ అనడం నేడు ఫ్యాషన్ అయిపోయింది. అదే దేవుడి పేరును అన్నిసార్లు తలుచుకొంటే... స్వర్గంలో చోటు లభిస్తుందని వ్యాఖ్యలు చేశారు. దీంతో అమిత్ షా వ్యాఖ్యలపై విపక్షాలు మండిపడ్డాయి. ఈ సందర్భంగా అమిత్‌షా వ్యాఖ్యలను సమర్థిస్తారా అని నితీశ్, చంద్రబాబును కేజ్రీవాల్ నిలదీశారు.

## కుల్గామ్‌లో ఎన్‌కౌంటర్

**ఐదుగురు ఉగ్రవాదులు హతం, ఇద్దరు భద్రతా సిబ్బందికి గాయాలు**



**శ్రీనగర్:** జమ్ము కశ్మీర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు ఉగ్రవాదులు హతం కాగా.. ఇద్దరు సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. కుల్గాం జిల్లాలో గురువారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. బెహిబాగ్ ప్రాంతంలోని కద్దార్‌లో ఉగ్రవాదులు నక్కి ఉన్నారని భద్రతా దళాలకు నిఘా లు వర్గాలు బుధవారం రాత్రి సమాచారం అందించాయి. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున భద్రతా దళాలకు చెందిన సైనికులతోపాటు జమ్ము కశ్మీర్ పోలీసులు సంయుక్తంగా రంగంలోకి దిగి ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ విషయాన్ని ఉగ్రవాదులు పసిగట్టారు. దీంతో భద్రతా దళాలతోపాటు పోలీసులపైకి ఉగ్రవాదులు కాల్పులకు తెగ బడ్డారు. దీంతో భద్రతా దళాలు సైతం స్పందించి.. ఎదురు కాల్పులకు దిగాయి. దీంతో ఇరువైపులా భీకరంగా కాల్పులు చోటు చేసుకున్నాయి. ఉగ్రవాదులు కాల్పులను భద్రతా దళాలతోపాటు జమ్ముకశ్మీర్ పోలీసులు తిప్పికొట్టారని ఇండియన్ ఆర్మీ ఉన్నతాధికారులు తమ ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించారు. మరోవైపు డిసెంబర్ మాసం ప్రారంభంలోనే జమ్ముకశ్మీర్ లోని దాచిగ్రామ్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ లో ఉగ్రవాది జునైద్ అహ్మద్ భట్‌ను భద్రతా దళాలు కాల్చి చంపాయి. అతడు లష్కర్–ఏ–తోయిబా ఉగ్రవాద సంస్థకు చెందిన వ్యక్తి అని ఆర్మీ ఉన్నతాధికారులు వెల్లడించారు. అతడు.. గగన్ గిర్, గందర్ బల్ తదితర ప్రాంతాల్లోని పౌరులే లక్ష్యంగా చేసుకొని హతమారుస్తున్నాడని తెలిపారు. ఇంకోవైపు.. ఈ ప్రాంతంలో ఇటీవల ఉగ్రవాదుల దాడుల ఘటనలు పెచ్చురిల్లుతోన్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ భద్రత దళానికి చెందిన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ను జమ్మూలో ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆదేశాలు జారీ చేసిన విషయం విధితమే. అయితే ఈ ఏడాది జమ్మూ ప్రాంతంలోని మొత్తం 10 జిల్లాల్లో 8 జిల్లాల్లో ఉగ్రవాదుల దాడులు గణనీయంగా పెరిగాయి. ఈ దాడుల్లో మొత్తం 44 మంది మృతి చెందారు. వారిలో 18 మంది భద్రతా సిబ్బంది కాగా.. 14 మంది పౌరులు, 13 మంది ఉగ్రవాదులు ఉన్నారని అధికారులు వెల్లడించారు.

## ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు 4లక్షలకు పైగా

# రిజర్వుడ్ బ్యాక్‌లాగ్ ఖాళీలు భర్తీ

**కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ రాజ్యసభకు రాతపూర్వక సమాధానం**

**2016 నుండి భర్తీ నిరంతర ప్రక్రియగాజరుగుతున్నదని వెల్లడి**

**న్యూఢిల్లీ :**షెడ్యూల్ కులాలు (ఎస్‌సి), షెడ్యూల్ తెగలు (ఎస్‌టి), ఇతర వెనకబడిన తరగతులు (ఒబిసి)కి సంబంధించిన అభ్యర్థులకు 4లక్షలకు పైగా రిజర్వ్‌డ్ బ్యాక్‌లాగ్ వెకెన్సీలను 2016నుండి భర్తీచేసినట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ గురువారం చెప్పారు. 'బ్యాక్‌లాగ్ రిజర్వుడ్ ఖాళీలతో సహా ఖాళీలు ఏర్పడినప్పుడల్లా ఖాళీలను భర్తీచేయడం ఒక నిరంతర ప్రక్రియ' అని ఆయన రాజ్యసభకు ఒక రాతపూర్వక సమాధానంలో వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వంలోని అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలు బ్యాక్‌లాగ్ రిజర్వుడ్ ఖాళీలను గుర్తించేందుకు ఒక అంతర్గత కమిటీని వేయాలని, అటువంటి ఖాళీలకు మూలకారణాన్ని అధ్యయన చేయడానికి, అటువంటి ఖాళీలకు కారణమయ్యే కారకాలను తొలగించడానికి, ప్రత్యేక రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లతో సహా వాటిని భర్తీ చేయడానికి చర్యలు ప్రారంభించాలని ఆదేశాలు జారీచేసినట్లు కేంద్ర సిబ్బంది సహాయ మంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు. రిజర్వేషన్లకు సంబంధించిన విధివిధానాలు, సూచనలను సక్రమంగా పాటించేలా పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వంలోని ప్రతీ మంత్రిత్వశాఖ/ విభాగం డిప్యూటీ సెక్రటరీ అంతకంటే ఎక్కువ స్థాయి హోదాకలిగిన అధికారిని లైజన్‌ఆఫీసర్‌గా నియమించాలని మంత్రి చెప్పారు. 'ప్రతీ మంత్రిత్వ శాఖ/ విభాగం విధుల నిర్వహణలో అతడికి లేదా ఆమెకు సహాయం చేయడానికి లైజన్ ఆఫీసర్ ప్రత్యక్షనియంత్రణలో ఒక స్పెషల్ రిజర్వేషన్ సెల్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే ఖాళీల వివరాలను సంబంధిత మంత్రిత్వశాఖ/ విభాగం పరిధిలోని ప్రభుత్వ సంస్థలు నిర్వహిస్తాయని మంత్రి తెలియజేశారు.కాలానుగుణంగా ఏర్పడిన ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీచేయడానికి కేంద్ర ప్రభుత్వం మంత్రిత్వశాఖలు, డిపార్ట్‌మెంట్‌లు ఎంపికచేయబడ్డాయి' అని సింగ్ వివరించారు. కేంద్ర ప్రభుత్వంలోని మం త్రిత్వ శాఖలు, విభాగాలకు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలలో సివిల్ పోస్టులు, సివిల్ సర్వీసెస్, కేంద్ర ప్రభుత్వ రంగసంస్థలలోని ఉద్యోగాలకు బహిరంగ పోటీ ద్వారా ఆల్ ఇండియా బేసిస్ ప్రాతిపదికన డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిన నియామకాలు చేపట్టేందుకు ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వారికి వరుసగా 15శాతం రిజర్వేషన్, 7.5శాతం రిజర్వేషన్, 27శాతం కల్పిస్తున్నామని మంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు.ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి రిజర్వేషన్ల పథకం పరిధిలోకి రాని ఆర్థికంగా బలహీన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) చెందిన వ్యక్తులకు ప్రత్యక్షనియామకాలలో 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులలో ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రాతినిథ్యం నిర్దేశిత పరిమితి ప్రకారం ఉన్నదని కేంద్ర సిబ్బంది సహాయ మంత్రి జితేంద్రసింగ్ గురువారం రాజ్యసభకు తెలిపారు. ఆయన ఈ విషయాన్ని రాతపూర్వక సమాధానంలో వెల్లడించారు. వివిధ మంత్రిత్వశాఖలు, విభాగాలు అందించిన సమాచారం ప్రకారం...ఊఎస్‌సిలు, ఎస్‌టిలు, ఒబిసిలకు చెందిన ఉద్యోగులు వరుసగా 5.47లక్షలు, 2.82లక్షలు, 8.55లక్షల మంది ఉన్నారని వివరించారు. గత 10సంవత్సరాలుగా ఎస్‌సి, ఎస్‌టి వారికి నిర్దేశించిన పరిమితి ప్రకారం ప్రాతినిథ్యం 15శాతం, 7.5శాతం కల్పించామని, ఒబిసిలకు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కూడా నిలకడగా 27శాతానికి సమయానుకూలంగా భర్తీ చేయాలని కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలను ఆదేశించినట్లు తెలిపారు. '2022 సంవత్సరం అక్టోబరు 22న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన 'రోజ్‌గార్ మేళా' ద్వారా ఎప్పటికప్పుడు ఏర్పడ్డ ఖాళీ పోస్టులు భర్తీ చేయబడ్డాయి' అని మంత్రి చెప్పారు.

## అంబేడ్కర్ రాజ్యాంగం లేకుంటే

# అమిత్‌షా పాత సామాను డీలర్‌గా ఉండేవాడు

**కర్నాటక సిఎం సిద్ధరామయ్య**

**బెలగావి :** అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే లేకుంటే కేంద్ర హోం మంత్రి అమిత్ షా తన స్వంత ఊళ్ళో పాత సామాను డీలర్‌గా ఉండేవారని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నా రు. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ నిజంగానే రాజ్యాంగం ప్రకారం పనిచేస్తున్నట్లయితే అంబేద్కర్‌కు వ్యతిరేకంగా రాజ్యసభలో మాట్లాడిన వెంటనే అమిత్‌షాను సభ నుంచి సస్పెండ్ చేయాల్సిందని అన్నారు. ఈ అంశంపై కర్నాటక శాసనసభలో బిజెపి, కాంగ్రెస్ ఎంఎల్‌ఏల మధ్య దుమారం నేపథ్యంలో కర్నాటక సిఎం ప్రకటన చేశారు. హోంమంత్రి నోటి నుంచి బాబా సాహెబ్ అంబేద్కర్‌పై చేసిన అవమానకర వ్యాఖ్యలను దేశమంతా విన్నదని అన్నారు. అమిత్ షా మాటలు ఆశ్చర్యం కలిగించలేదని, బిజెపి, సంఘ్‌పరివార్ నాయకులు మదిలో ఉన్న విషయాలనే ఆయన నోటి నుంచి వెలువడ్డాయని సిద్ధరామయ్య చెప్పారు. అంబేద్కర్ అంటే బిజెపి, సంఘ్ పరివార్‌కు ద్వేషమని, అందు కు ఆయన రాజ్యాంగం రాయడమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. లిఖిత రాజ్యాంగం అమలులోకి రానంత వరకు భారతీయ సమాజంలో మనుస్మృతి ఉండేదని,కులం,లింగ వివక్షను అది సమర్థించేదని చెప్పా రు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని అందించడమే కాకుండా, 1927 డిసెంబర్ 25నబహిరంగంగా మనుస్మృతి ప్రతులను తగులబెట్టారని గుర్తు చేశారు.

### అమిత్‌షాకు పిచ్చిపట్టింది : లాలు

**పట్నా :** అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ చేసిన అనుచిత వ్యాఖ్యలపట్ల ఆర్‌జెడి అధ్యక్షుడు లాలు ప్రసాద్ తీవ్రంగా ఖండిం చారు. తక్షణమే అమిత్‌షా పదవికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకోవాలని డిమా ండ్ చేశారు. అమిత్‌షాకు పిచ్చి పట్టిందని, అంబేద్కర్‌కు వ్యతిరేకంగా ఆయన నిలువెల్లా విద్వేషం నింపుకున్నాడని, ఆయన పిచ్చితనాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. .

## మూడు ఈశాన్య రాష్ట్రాల్లో మళ్లీ పిఎపి అమలు

**13ఏళ్ల తర్వాత పునరుద్ధరణ**

న్యూఢిల్లీ: ఈశాన్య రాష్ట్రాలైన మణిపూర్, మిజోరం, నాగాలాండ్‌లో రక్షిత ప్రాంత పాలన లేక రక్షిత ప్రాంత అనుమతి (పీఏపీ)ని కేంద్రం తిరిగి అమల్లోకి తెచ్చింది. రద్దు చేసిన 13ఏళ్ల తర్వాత దీనిని పునరుద్ధరించింది. ఈ మేరకు మణిపూర్ ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. పీఏపీ తిరిగి అమల్లోకి రావడంతో రాష్ట్రానికి వచ్చే విదేశీ పర్యాటకుల కదలికలను నిశితంగా గమనిస్తారని తెలిపింది. విదేశీయుల (రక్షిత ప్రాంతాల) ఆర్డర్1958 ప్రకారం రక్షిత ప్రాంత అనుమతుల (పీఏపీ)ను విదేశీ పర్యాటకులు పొందాల్సి ఉంటుందని ప్రభుత్వ ప్రకటన పేర్కొంది. మణిపూర్, నాగాలాండ్, మిజోరంలో పీఏపీని 2011లో అప్పటి యూపీఏ2 ప్రభుత్వం రద్దు చేసింది. ఈశాన్య రాష్ట్రాల పర్యాటక రంగానికి ప్రోత్సాహం అందించే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. పీఏపీ తిరిగి అమల్లోకి రావడంతో ఈశాన్య రాష్ట్రాలకు వెళ్లే విదేశీయులు కొన్ని ప్రాంతాలలో పర్యటించేందుకు ముందస్తు అనుమతులు పొందాలి. పీఏపీ సాధారణ గడువు 10 రోజులు కాగా దీనిని విస్తరించవచ్చు. పీఏపీ తిరిగి అమల్లోకి వచ్చిన మూడు రాష్ట్రాల్లో ఒకటైన మణిపూర్ గతేడాది మే నుంచి అట్టుడికిపోతున్న విషయం తెలిసిందే.

## మళ్లీ తెరపైకి ప్రజా భద్రతా బిల్లు

**'అర్బన్ నక్సల్స్' పేరుతో మహారాష్ట్ర అసెంబ్లీలో రెండోసారి ప్రతిపాదన**



**న్యూఢిల్లీ:** ప్రత్యేక ప్రజా భద్రతా బిల్లును మహారాష్ట్ర అసెంబ్లీలో ఫడ్నవీస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. తొలుత జులై 11న ఈ బిల్లును శాసనసభ ముందుర ఉంచారు. దీనికి ఆమోదం లభించలేదు. బిల్లులోని అనేక సెక్షన్లపై కార్యకర్తలు, న్యాయవాదులు, విశ్లేషకులు అభ్యంతరం తెలిపారు. అవి అస్పష్టంగా ఉన్నాయి లేదా రాష్ట్రానికి అధికారాలు కట్టబెట్టేవిగా ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో బిల్లుకు సభ ఆమోదం లభించలేదు. తాజాగా మాజీ సీఎం ఏక్‌నాథ్ షిండే ఈ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టగా దీనిని సంయుక్త సెలక్ట్ కమిటీకి పంపుతామని ఫడ్నవీస్ తెలిపారు. భాగస్వామ్యుల సూచనలు పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. వచ్చే ఏడాది జులైలో జరగబోయే అసెంబ్లీ వర్షాకాల సమావేశాలలో ఈ బిల్లును ఆమోదిస్తామని సీఎం తెలిపారు. నక్సలిజం అన్నది గ్రామాలకే పరిమితం కాదని, పట్టణాలకూ విస్తరించిందని, అర్బన్ నక్సల్స్ కట్టడికి ఇలాంటి చట్టాన్ని మహారాష్ట్ర యాంటీ నక్సల్ స్క్వాడ్‌లు కోరుకుంటున్నాయని ఫడ్నవీస్ అన్నారు. ప్రతిపాదిత చట్టం అసంతృప్తి స్వరాల అణచివేతకు కాదని, అర్బన్ నక్సల్స్ అడ్డాల మూసివేత కోసమన్నారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రజా భద్రతా చట్టాలు అమల్లో ఉన్నాయని, 48 అనుబంధ సంస్థలను నిషేధించాయని ఫడ్నవీస్ తెలిపారు. కాగా, తాజా ప్రతిపాదిత బిల్లు ప్రకారం చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఏడేళ్ల శిక్ష, రూ.5లక్షల వరకు జరిమానా విధించవచ్చు. చట్టవ్యతిరేక సంస్థల సంస్థల సభ్యులకు మూడేళ్ల జైలు, రూ.3లక్షల జరిమానా ఉంటుంది. సభ్యులు కాని వారు తోడ్పాటు అందిస్తే రెండేళ్ల శిక్ష పడుతుంది. కొన్ని సందర్భాల్లో మూడేళ్ల జైలు, రూ.3లక్షల జరిమానా విధిస్తారు. ఈ చట్టం కింద నేరాలన్నీ శిక్షార్హమైనవే కాగా బెయిల్ కూడా లభించదు.

# నిరసన కొనసాగించేలా డల్లేవాల్‌ను ఒప్పించండి

**పంజాబ్ ప్రభుత్వాన్ని కోరిన సుప్రీంకోర్టు**

**డల్లేవాల్ సురక్షితంగా ఉండాలని కోరుకుంటున్నాం...**




**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోన్న రైతుల ఆం దోళన పట్ల కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటోందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దేశానికి వెన్నెముకగా భావించే రైత న్న సమస్యల పరిష్కారం పట్ల బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభు త్వం సవతితల్లి ప్రేమను ప్రదర్శిస్తోంది. వైద్యుల పర్యవేక్షలో ఇరోమ్ షర్మిళ కూడా తన నిరసనను కొనసాగించారని, ఆరోగ్య పరీక్ష లు చేయించుకునేందుకు 70ఏళ్ల రైతు నాయకుడు జగ్జిత్‌సింగ్ డల్లేవాల్ నూ అదే తరహాలో ఒప్పించాలని గురువారం అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు పంజాబ్ ప్రభుత్వానికి సూచించింది. పంజాబ్‌హర్యానా రాష్ట్రాల మధ్య ఖనౌరీ సరిహద్దు పా యింట్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న డల్లేవాల్‌కు వైద్యపరీక్షలు చేయకపోవడం పట్ల సుప్రీం పంజాబ్ ప్రభుత్వ ంపై తీవ్రస్థాయిలో మండిపడింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, ఉజ్వల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం నిరసన తెలియజేస్తున్న రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ఏ ఒక్కరూ ప్రయత్నం చేయడం లేదని, డల్లేవాల్ రక్ష ణను సర్వోన్నత న్యాయస్థానం కోరుకుంటోందని, ఆయన ఒక ప్రజల నాయకుడని అభివర్ణించింది. వైద్యుల పర్యవేక్షణ లో నిరసన దీక్షను సంవత్సరాలపాటు కొనసాగిస్తు న్న పౌర హక్కుల కార్యకర్త ఇరోమ్ షర్మిళ కేసును జస్టిస్ భుయాన్ ప్రస్తావిస్తూ..డల్లేవాల్ కూడా వై ద్యుల పర్యవేక్షణలో తన నిరసనను కొనసాగించవచ్చనిపేర్కొన్నారు. వైద్య పరీక్షలు చేయకుండానే డల్లేవాల్ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని పంజా బ్ ప్రభుత్వ డాక్టర్లు ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను కోర్టు గమనించింది. 'వివిధ వ్యాధులతో బాధపడుతున్న 70సంవత్సరాల వ్యక్తి డల్లేవాల్ గత 21రోజులుగా ఆమరణ నిరాహారదీక్ష చే స్తున్నారని, అదిఎలా సా ధ్యమని ధర్మాసనం ప్రశ్నించింది. మీరు ఏమైనా అతని రక్త పరీక్షలను, ఇసిజి పరీక్షను ఏమైనా చేశారా? అవసరమైన విచార ణ జరిపారా?' అని ప్రశ్నించింది. 'ఆయనక్షేమంగా ఉన్నారని సంతృ ప్తి చెందిన తర్వాత కోర్టు అతడితో (జగ్జిత్‌సింగ్ డల్లేవాల్)మాట్లాడుతుంది'అని జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. తానువ్యక్తిగతంగా కోర్టును ఆశ్రయించదల్చుకున్నట్లు రైతు నాయకు డు డల్లేవాల్ అధికారుల ద్వారా తెలియజేసినట్లు సమాచారం. ఇతరు లు కూడా నిరసనను కొనసాగించవచ్చని, కనీసం వారం రోజుల పాటు వైద్య చికిత్స చేయించుకునే లా డల్లేవాల్‌ను ఒప్పించాల ని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు పంజాబ్ అడ్వకేట్ జనరల్ గుర్మీందర్‌సింగ్‌ను కోరింది. కాగా డల్లేవాల్‌ను ఒప్పిం చి, ఆయన శ్రేయస్సు ను నిర్ధారించడానికి ఒకరోజు సమయం ఇవ్వాలని గు ర్మీందర్‌సింగ్ ధర్మాసనాన్ని కోరారు. ఈ విచారణను ధర్మాసనం డిసెంబరు 20కు వా యిదా వేసింది. రైతు ల పంటలపై కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కల్పిస్తామనే చట్టబద్ధమైన హామీ సహా పలు డిమాండ్ల పరిష్కారాన్ని కోరు తూ రైతు నాయకు డు డల్లేవాల్ కనౌరీ సరిహద్దు వద్ద నవంబరు26 నుండి ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న విషయం తెలిసిందే.

## నేపాల్‌లో 4.4 తీవ్రతతో భూకంపం

ఖాట్మాండు: నేపాల్‌లో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 4.4గా నమోదైంది. ఈ మేరకు నేషనల్ సిస్మాలజీ సెంటర్ (ఎన్‌సిఎస్) తెలిపింది. గురువారం ఉదయం 7.22 గంటలప్పుడు భూప్రకంపనలు సంభవించాయి. 10 కి.మీల లోతులో భూకంపం వచ్చినట్లు ఎక్స్‌లో ఎన్‌సీఎస్ పేర్కొంది.

## రాజ్యసభ చైర్మన్‌పై అభిశంసన నోటీసు తిరస్కరణ



**న్యూఢిల్లీ:** ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్‌పై విపక్షాలు ప్రవేశపెట్టిన అభిశంసన నోటీసు తిరస్కరణకు గురైంది. ఎగువ సభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ దీనిని తిరస్కరించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అది వాస్తవ ప్రాతిపదికన లేదని, చట్టబద్ధమైన ఆందోళన కంటే ప్రచారం పొందడమే లక్ష్యంగా కనిపించిందని ఆయన వ్యాఖ్యానించినట్లు తెలిపాయి. ధన్కర్ పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని, ప్రతిపక్ష నేతలను ఆయన లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతత్వంలోని ఇండియా ఐక్యసంఘటన ఈ నోటీసు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆమ్‌ఆద్మీ పార్టీ సహా ఇండియా ఐక్యసంఘటన నేతలు దీనికి మద్దతిచ్చారు. కాగా, పార్లమెంట్ ప్రవేశ ద్వారం వద్ద మహిళా ఎంపీలను రాహుల్ గాంధీ నెట్టేశారంటూ కేంద్రమంత్రులు జేపీ నడ్డా, కిరణ్ రిజిజు చేసిన ఆరోపణలపై ఎగువసభలో తీవ్ర గందరగోళం నెలకొంది. మధ్యాహ్నం రెండు గంటలకు తిరిగి సభ ప్రారంభంకాగానే రాహుల్ గురించి మంత్రులు ఆరోపణలు చేశారు. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అధికార, విపక్ష ఎంపీల నిరసనలతో సభా కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. దాంతో సభ శుక్రవారానికి వాయిదా పడింది.

**NOTICE IN THE COURT OF HON'BLE II ADDL. DISTRICT JUDGE (MACT) AT KARIMNAGAR**

**MVOP No. (344) OF 2022**

Between:

**Boya Lalitha & others** ...Petitioners

And

**Kajampuram Rajendar & Others** ...Respondents

To,

**Dr. Reddys Laboratari R/by Mohammed Amjad Basha Occ: owner of Hundai Verna car bearing No. AP-09-CQ-0435, R/o. H.No. 7-1-27, Ameerpet, Hyderabad.**

Whereas the above named Petitioners had filed the above OP for grant of Compensation on account of death of her **Boya Anjaneyolu** in a motor vehicle accident against the above Respondents.

Please take notice that the above said MVOP was posted on 30-12-2024 at 10:30 A.M before the above said Court for your appearance and counter by appearing in person or duly authorized person, otherwise case will be called and determined as per law.

//By order of the Court//

Sd/-

**[G. SRINIVAS GOUD] ADVOCATE**

# H.No.3-1-197/1, Vasundra Nursing Home Complex, Christian Colony, KARIMNAGAR - 505001. Mobile No. 98498-36469

# ప్రజాపక్షం

శుక్రవారం, డిసెంబరు 20

## అవసరానికే అంబేద్కర్!

బాబాసాహెబ్ అంబేద్కర్‌పై బిజెపి మరోసారి విషం కక్కింది. ఆయనను ఉద్దేశించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు బిజెపి వికృత రాజకీయ ముఖచిత్రాన్ని మరోసారి ఆవిష్కరించాయి. అంబేద్కర్ పేరును ప్రస్తావించడాన్ని ఆయన ఫ్యాషన్‌గా అభివర్ణించడమేకాదు.. అన్నిసార్లు భగవన్నామ స్మరణ చేస్తే స్వర్గం ద్వారాలు తెరుచుకుంటాయని హితవు కూడా పలికారు. రాజ్యాంగం పట్ల, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పట్ల ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలను అమలు చేస్తున్న మోదీ సర్కారుకు మొదటినుంచీ చిన్న చూపే. ఓట్ల కోసం అంబేద్కర్‌ను అక్కున చేర్చుకోవడం, ఆ తర్వాత నిర్లక్ష్యం చేయడం షరా మమూలే. అందుకే, తరచూ రాజ్యాంగానికి విరుద్ధమైన ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. లౌకిక దేశాన్ని మత రాజ్యాంగంగా మార్చే దిశగా అడుగులుపడుతూనే ఉన్నాయి. ప్రతిపక్ష పార్టీలకు భయపడి ఆర్‌ఎస్‌ఎస్‌బిజెపి, ఎజెండాలో కొన్నింటిని ఇప్పటి కప్పుడు అమలు చేయడం లేదు. కానీ, పరోక్ష కార్యాచరణ ఇప్పటికే మొదలైంది. సమాఖ్య స్ఫూర్తిని ఛిన్నాభిన్నం చేసిన మోదీ ప్రభుత్వం, ఏకీకృత నియంతృత్వాన్ని దేశంపై రుద్దేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నది. జమిలీ బిల్లును సిద్ధం చేయడమే ఇందుకు నిదర్శనం. దేశ భవిష్యత్తును నిర్దేశించే నిర్ణయాలు తీసుకోవాల్సిన పార్లమెంటులో చర్చలకు ఏనాడో తెరపడింది. పార్లమెంటు సమావేశాల్లో గుణాత్మక మార్పులు ఎండమావులే. ప్రజాస్వామిక విలువలకు తిలోదకాలిచ్చి.. విధానాలను విస్మరించి... నిరంకుశ పాలనకు పునాదులు వేస్తున్న బిజెపికి అంబేద్కర్ ఆశయాలను అమలు చేయడం అటువుంచి, ఆయన పేరు వినడానికి కూడా ఇష్టం లేదు. ఇప్పుడు అమిత్ షా ఆ విధానాలకు విరుద్ధంగా ఏమీ చెప్పలేదు. పైగా.. అందరికీ తెలిసిన అంబేద్కర్ వ్యతిరేకతను మరోసారి చాటారు.. అంతే. సామ్యవాదం అంటే బిజెపికి గిట్టదు. కార్పొరేట్ శక్తులను భుజానికెత్తుకొని ఊరేగుతున్న ప్రభుత్వానికి ప్రజాభిప్రాయం పట్టదు. ప్రజాస్వామిక హక్కులపై అనేక రకాల ఆంక్షలు, పౌరులకు వ్యతిరేకంగా లెక్కలేనన్ని ఆణచివేత చర్యలు, ప్రశ్నించే గొంతుకలపై ఉక్కుపాదం, రాజకీయ లబ్ధికోసం కుల, మత, వర్గ, ప్రాంతీయ ఘర్షణలు పెంచేతత్వం. రాజ్యాంగాన్ని తొక్కిపట్టే చేష్టలు. ఇవీ బిజెపి ట్రేడ్‌మార్క్ రాజకీయాలు. వరుసగా రెండు పర్యాయాలు ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన బిజెపి, మూడవసారి అతికష్టం మీద, మిత్రపక్షాల మద్దతుతో ముచ్చటగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. ఈ ఫలితాలను ఏమాత్రం సమీక్షించుకున్నా, ప్రజల నాడి తెలిసేది. కానీ, తన వైఖరిని మార్చుకునే అలవాటు బిజెపికి లేదు. మారే అభిప్రాయం మోదీకీ అంత కంటే లేదు. పార్లమెంటులో లోతైన చర్చలు జరిగినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని చెప్పడం అంబేద్కర్ చేసిన నేరం. లౌకిక విధానం అమలుకావాలని.. సమభావం విరాజిల్లాలని.. సమన్యాయం జాతీయ విధానం కావాలని అనడమే అంబేద్కర్ అపరాధం. రాజ్యాంగంలో కీలక అంశాలన్నీ బిజెపి అమలు చేయాలని చూస్తున్న ఎజెండాకు పూర్తి వ్యతిరేకం. అవకాశం లేకపోయిందిగానీ, లేకుండా రాజ్యాంగ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేసి, దేశాన్ని మత రాజ్యంగా ప్రకటించాలన్నది ఆ పార్టీ నేతల ఆకాంక్ష. మతానికి ప్రభుత్వం దూరంగా ఉండాలని రాజ్యాంగం నిర్దేశిస్తే, అందుకు భిన్నంగా, అయోధ్య రామమందిర ప్రారంభోత్సవాన్ని ప్రధాని మోదీ స్వయంగా నిర్వహించడం బిజెపి విధానాలను స్పష్టం చేసింది. అంతకు ముందు... ఆ తర్వాత కూడా రాజ్యాంగ వ్యతిరేక విధానాలను కేంద్రం అమలు చేస్తునే ఉంది. అంబేద్కర్‌ను విమర్శించి, దేశదేశాన భారత ప్రతిష్టను మంటగలిపిన అమిత్ షా, ఇకనైనా బేషరతుగా క్షమాపణ చెప్పడం కనీస మర్యాద. కొంతలో కొంతైనా పరువు నిలుస్తుంది. అంబేద్కర్‌వాదులను చులకన చేయడం ఒక గౌరవ స్థానంలో ఉన్న వ్యక్తికి తగని పని. ఆ మాత్రం ఇంగితం అమిత్ షాకు ఉంటుందనే ఆశిద్దాం. పొరపాటును అంగీకరించాలని కోరుకుందాం. లేకపోతే, రాజ్యాంగానికి, రాజ్యాంగ నిర్మాతకు బిజెపి పూర్తి వ్యతిరేకమన్న విమర్శలు నిజమవుతాయి.

# రేవంత్ సారథ్యంలో ఇక 'నవ శకం'!



ఎస్‌కె. జకీర్
9052631212
సీనియర్ జర్నలిస్ట్

కెసిఆర్ హయాంలో దాదాపు అన్ని వ్యవస్థలు నిర్వీర్యం కావడమో లేదా విధ్వంసం కావడమో జరిగింది. ఇందులో అత్యంత కీలకమైన రెవెన్యూ వ్యవస్థను ఉద్దేశపూర్వకంగా కుప్పకూల్చి పారేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయా వ్యవస్థలకు 'మరమ్మతులు' చేసి, వాటిని బలోపేతం చేసే దిశగా అడుగులు పడుతున్నవి.

భూభారతి 2024 చట్టాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూపకల్పన చేసింది. ధరణి ఇకపై 'భూ భారతి'గా మారిపోనుంది. కెసిఆర్ హయాంలో 'ధరణి' చట్టం 'దోపిడీకి గేట్ వే'గా మారినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. లక్షన్నర కోట్లకు పైగా 'భూదందా' జరిగినట్లు ప్రభుత్వ వర్గాల అనుమానం. ధరణితో సమస్యలు పరిష్కారం కాకపోగా, కొత్తగా లక్షలాది సమస్యలను తెచ్చిపెట్టింది. కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలిక ఊడిందన్నట్లు ధరణి పోర్టల్‌తో లెక్కలేనన్ని ఇబ్బందులు ఎదురవుతున్నవి. ధరణిని బంగాళాఖాతంలో పారేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. తెలంగాణలో సామాన్య ప్రజల భూ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా కొత్త చట్టం అమల్లోకి రానుంది.

ధరణి 2020 చట్టాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసి భూభారతిని రూపొందించామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అసెంబ్లీలో చెప్పారు. ఆగస్టు 2న భూభారతి ముసాయిదాను ప్రవేశపెట్టి, ప్రత్యేకంగా 40రోజుల పాటు వెబ్‌సైట్లో పెట్టి ప్రజాప్రతినిధులు, కవు లు, మేధావులు, విశ్రాంత అధికారుల సలహాలు, సూచనలు స్వీకరించి కొత్త చట్టానికి రూపకల్పన చేశారు. 18 రాష్ట్రాలలోని ఆర్వోఆర్లను అధ్యయనం చేసి ఉత్తమ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని భూభారతిలో పొందుపరిచినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

వేలాది పుస్తకాలు చదివినట్లు క్లెయిమ్ చేసే మేధావి కెసిఆర్ 2020ఆర్వోఆర్ చట్టం ద్వారా తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో మూడేండ్లలోనే లక్షలాది కొత్త సమస్యలు తలెత్తాయి. గతంలో ధరణి కారణంగా అన్యాక్రాంతమైన భూముల వివరాలను భూ భారతి ద్వారా ప్రజలకు ప్రభుత్వం బట్టబయలు చేయనుంది. 2014కు ముందు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల దగ్గర ఉన్న ప్రభుత్వ భూముల జాబితాలోని రెవెన్యూ, ఎండోమెంట్, వక్ఫ్, భూదాన్, ఫారెస్ట్ తదితర భూముల వివరాలను ధరణిలోని డేటాతో పోల్చిచూసి అన్యాక్రాంతమైన భూముల వివరాలను బహిర్గతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ధరణి తెచ్చిన తర్వాత మూడేండ్లు దాటినా 'రూల్స్' ఫ్రేమ్ చేయకపోవడంతో తప్పులు జరిగాయి. ఆ తప్పుల్ని ప్రజలపై కెసిఆర్ బలవంతంగా రుద్దారన్న విమర్శలున్నవి. మూడు నెలల్లోనే రూల్స్ ఫ్రేమ్ చేయనున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 'ధరణి దోపిడీ'పై శోధిస్తున్నకొద్దీ కొత్త విషయాలు బయటపడ్డాయి. ప్రభుత్వ పనిని ధరణి పేరుతో పూర్తిగా ప్రైవేట్ కంపెనీ ఐఎల్ అండ్ ఎఫ్‌ఎస్‌కు కట్టబెట్టారు. రాష్ట్రంలో భూ లావాదేవీలన్ని ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీ గతంలో బ్యాంకులను నిండా ముంచిందన్న ఆరోపణలు ఉన్నాయి.

కాగా "వచ్చే ఏడాదిలో మాజీ సిఎం కెసిఆర్ తన ఉనికిని కోల్పోతారు. ఆయన రాజకీయ శకం ముగిసిపోతుంది" అని మూడు నెలల కిందట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోస్యం చెప్పారు. కెసిఆర్ కుటుంబంలో విభేదాలు ఉన్నాయని ఆయన అన్నారు. కెటిఆర్, హరీశ్‌రావులను ఎలా ఎదుర్కోవాలో కాంగ్రెస్ పార్టీకి తెలుసని రేవంత్ రెడ్డి అన్నారు. కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు తమ ప్రాబల్యాన్ని కోల్పోవడంతో రాష్ట్రంలో బిఆర్‌ఎస్ ప్రాభవం కోల్పోతుందన్నది సిఎం అంచనా. రేవంత్ రెడ్డి అంచనా నిజం కావాలంటే ముందుగా కెసిఆర్ 'ఆనవాళ్ల'ను, ఒక్కొక్కటిగా తుడిచిపెట్టవలసి ఉన్నది.తొమ్మిదిన్నరేండ్ల పాటు విచ్చలవిడిగా జరిగిన విధ్వంసం నుంచి వికాసం వైపునకు తెలంగాణను మళ్లించవలసి ఉన్నది.

కెసిఆర్ జనవరిలోనో, ఫిబ్రవరిలోనో 'జన జీవన స్రవంతి' లోకి వస్తారని బిఆర్‌ఎస్ నాయకులు, క్యాడర్ ఆశలతో ఉన్నారు. బలంగా నమ్ముతున్నారు. రాజకీయాలు నిరంతర చలనశక్తిగా ఉంటాయి కనుక ఎప్పుడు ఏమి జరుగుతుందో సరిగ్గా జోస్యం చెప్పలేం. రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానమే ఇందుకు ఒక సజీవ సాక్ష్యం. ఆయన తెలుగుదేశం పార్టీని వదిలి, కాంగ్రెస్ పార్టీలో చేరతారని గానీ, ఆ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడు అవుతారని గానీ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని గానీ, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని గానీ రాజకీయ పరిశీలకులు ఎవరూ ఊహించలేదు. రాజకీయాల్లో హఠాత్తు పరిణామాలు ఎక్కువగా చోటు చేసుకుంటూ ఉంటాయి.



తెలంగాణ కాంగ్రెస్ రాజకీయం ఆసక్తికరంగా మారడానికి రేవంతే కారణం. ముఖ్యమంత్రిగా రేవంత్‌ను ప్రకటించే సమయంలో 'ఒన్ మ్యాన్ షో' ఉండదని కాంగ్రెస్ హైకమాండ్ తేల్చి చెప్పినట్టు అప్పట్లో ఒక ప్రచారం సాగింది. పార్టీ సీనియర్లకు మంత్రి పదవుల్లో కీలక శాఖలు అప్పగించారు. రేవంత్ ప్రతీ విషయంలోనూ ఉప ముఖ్యమంత్రి భట్టికి ప్రాధాన్యత ఇవ్వడాన్ని మనం గమనించవచ్చు. 'కలిసి కొత్త శకాన్ని నిర్మించే' కర్తవ్యాన్ని రేవంత్ టీమ్ భుజాన వేసుకున్నది. 'కొత్త శకం' నిర్మాణంలో పార్టీ సీనియర్లు, జూనియర్ల మధ్య అంతరాలు రాకుండా, పొరపొచ్చాలు తలెత్తకుండా అత్యంత 'మెలకువ'తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేయవలసి ఉన్నది. ముఖ్యమంత్రి పదవి రావాలని ఎవరు మాత్రం ఆశించకుండా, ఆశలేకుండా ఉండగలరు. మల్లు భట్టి, కెప్టెన్ ఉత్తమ్, పొంగులేటి, శ్రీధర్ బాబు వంటి సీనియర్లందరికీ ఆ పదవిపై ఆశ, అది దక్కనందుకు నిరాశ పడడం సహజమే. కానీ పరిస్థితులు తమకు ప్రతికూలంగా ఉన్నంతకాలం ఓర్పుతో ఉండడం, సానుకూల పరిస్థితులు నెలకొనగానే దాన్ని అందిపుచ్చుకొని రాజకీయాల్లో రాణించడం రాజకీయ పరిపక్వత ఉన్న నాయకులెవరైనా చేయవలసిన పని. డాక్టర్ వైఎస్. రాజశేఖర రెడ్డి రాజకీయ ప్రస్థానం అందుకు ఉదాహరణ. ఆయన మూడు దశాబ్దాలుగా సిఎం పదవికోసం చేయని ప్రయత్నమూ, సాగించని పోరాటమూ లేదు. ఎన్నో ఆటుపోట్లను తట్టుకొని నిలబడ్డారు. చంద్రబాబు నాయుడు పట్ల ప్రజల్లో వ్యతిరేకత రాగానే, ఆ అవకాశాన్ని అందిపుచ్చుకొని పాదయాత్ర చేసి కాంగ్రెస్ పార్టీని విజయపథాన నడిపినందుకు ముఖ్యమంత్రి కాగలిగారు. వైఎస్. పోరాటం, ఆయన సహనం, తెగింపు వంటి లక్షణాలు ప్రతి రాజకీయ నాయకునికి స్ఫూర్తిగా నిలుస్తుంది.రాజకీయంగా ఉన్నత శిఖరాలను అందుకోవాలని అనుకునే వారంతా వైఎస్ ను ఆదర్శంగా తీసుకోవలసిందే.

ప్రపంచంలో భారత్‌ను అగ్ర భాగంలో పెడతానని ప్రధాని మోదీ అంటే, 'తెలంగాణ రాష్ట్రాలతో పోటీ కాదు ప్రపంచంతోనే పోటీ' అని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. లక్ష్యాలు మంచివే. టార్గెట్ ఉంటేనే ఎవరైనా దూసుకు వెళతారు. రేవంత్ రెడ్డి తెలంగాణను 'నవ శకాని'కి దగ్గర చేయాలని చూస్తున్నారు. మంత్రి కాకుండానే ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డికి ఎన్నో ఆశలు ఉన్నవి. ఆయనకంటూ ఒక విజన్ ఉన్నది. పరిస్థితులు ఆయనకు అంతా సానుకూలంగా ఉన్నవి. ఆయనకు వయసు కూడా కలిసి వచ్చే అంశం. రేవంత్ రెడ్డి తనదైన మార్క్‌ను చూపించాలని తపన పడుతున్నారు. ఆ దిశగా అడుగులు వేయాలని అనుకుంటున్నారు.

ముందుగా బిఆర్‌ఎస్‌ను, ఆ పార్టీ అధ్యక్షుడు కెసిఆర్‌ను తరచూ ఆత్మరక్షణలో పడవేయడంలో రేవంత్ సక్సెస్ అవుతున్నారు.

రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో త్యాగాలు చేశామని బిఆర్‌ఎస్ నాయకులు చేసే ప్రకటనలకు రేవంత్ గట్టిగా కౌంటర్ ఇస్తున్నారు.

"త్యాగాలు బూటకం. కొందరికి వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి?మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి మహనీయు ల త్యాగాలను మాత్రమే మనం గుర్తుపెట్టుకోవాలి తప్ప ఉద్యమం పేరిట దోపిడీలు చేసే వారిని కాదు" అని ముఖ్యమంత్రి కెసిఆర్ ఒక సమావేశంలో అన్నారు.

నిజానికి 2014వరకు బిఆర్‌ఎస్ నాయకులకు,ఆ తర్వాత ఎమ్మెల్యేలు, మంత్రులకు ఇంత 'సంపద' ఎట్లా వచ్చిపడిందో గ్రహించడం కష్టం కాదు. హైదరాబాద్‌ను, దాని చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో వేలాది ఎకరాల భూములను 'పంటికి' అందకుండా మింగిన మహానుభావులంతా బిఆర్‌ఎస్ నాయకుల్లో లేదా వారి బినామీలో అని ప్రజల్లో బహిరంగంగానే చర్చ జరుగుతోంది. కెసిఆర్‌ను బుర్జ్ ఖలీఫా స్థాయి టవరింగ్ పర్సనాలిటీ అని కొందరు, ఆయన దేవుడని కొలిచేవాండ్లు కొందరు బిఆర్‌ఎస్‌లో ఉన్నారు. వాళ్ళ భక్తి వాండ్లది. 2024 నుంచి దాదాపు పదేండ్ల పాటు భజన మండళ్లను,భక్తి బృందాలను ఒక ప్రణాళికా బద్ధంగానే తయారు చేసి,పోషిస్తూ,ప్రోత్సహిస్తూ వచ్చిన ఘనత కేసీఆర్ పార్టీదే !

కెసిఆర్ మళ్ళీ సిఎం కావాలని, మళ్ళీ 'గడీల' పాలన రావాలని, మళ్ళీ దుర్భేధ్య 'ప్రగతిభవన్' తెరచుకోవాలని, ఆ ప్రగతి భవన్ చుట్టూ తాటిచెట్టు కన్నా ఎత్తైన రాతి గోడలు, పైన విద్యుత్ కంచెలు ఉండాలని పూర్వాశ్రమంలో 'వామపక్ష తీవ్రవాద' గ్రూపుల్లో పని చేసిన వ్యక్తులు కూడా కోరుతున్నారంటే ఏ మేరకు కెసిఆర్ హయాంలో వారికి లబ్ధి చేకూరిందో ఊహించవచ్చు. ఎవరిని ఎట్లా లొంగదీసుకోవాలో, ఎవ్వరిని ఎట్లా భయపెట్టాలో, ఎవరిని ఎట్లా బుజ్జగించాలో, ఎవరిని ఎట్లా ఆకర్షించాలో, ఎవరిని ఎట్లా బానిసలుగా మార్చుకోవాలో, ఎవరిని ఎట్లా తానొక దైవాంశ సంభూతుడినని నమ్మించాలో, తాను సిఎంగా లేకపోతే రాష్ట్రం సర్వనాశనమయిపోతుందని భ్రమల్లో ముంచాలో కెసిఆర్ కు తెలిసినంతగా మరెవరికీ తెలియదు. ఆయనను బలంగా ఢీకొంటున్న కారణంగానే తెలంగాణ రాజకీయం రేవంత్ రెడ్డి, కెసిఆర్ మధ్య కేంద్రీకృతమైంది.

# ప్రపంచ ఆకలి కేకలను ఆపలేమా!

ప్రపంచ మానవాళి పలు సమస్యల సంక్షోభాల్లో కూరుకుపోతున్నది. పేదరికం కోరలు చాస్తున్నది. అసమానతలు రాజ్యమేలుతున్నాయి. వివక్షలు ఒళ్లు విరుస్తున్నాయి. అనారోగ్యాలు ఆగం చేస్తున్నాయి. ఆకలి కేకలు ప్రాణా లు తీస్తున్నాయి. యుద్ధాలు మారణహోమాలు సృష్టిస్తున్నాయి. కన్నీటి వరదలు పారుతున్నాయి. అంతర్గత సంక్షోభాలు అంతుచూస్తున్నాయి. సామాజిక న్యాయం సత్తుబడుతున్నది. ఆహార అభద్రత నరకం చూపిస్తున్నది. సమస్యలు ప్రపంచ మానవాళిని తరుముతున్నాయి. కుల మత విభేదాల కుళ్లు కంపుకొడుతున్నది. మానవత్వం మంటగలుస్తున్నది.

ప్రపంచవ్యాప్త 8.2 బిలియన్ల ప్రజలు పలు సమస్యలతో సతమతం అవుతున్న వేళ మానవీయ కోణాన్ని తట్టి లేపుతూ, అభాగ్యుల శ్రేయస్సుకు సంఘీభావం తెలుపవలసిన సందర్భం వచ్చిందని గుర్తు చేయడానికి ప్రతి ఏట 20డిసెంబర్ రోజున ప్రపంచ దేశాలు అంతర్జాతీయ మానవ సంఘీభావ దినం (ఇంటర్నేషనల్ హ్యూమన్ సాలిడారిటీ డే) పాటించుట 2005నుంచి ఆనవాయితీగా మారింది.

ప్రపంచమే ఓ అద్భుత వైవిధ్యతకు నెలవు. సంస్కృతి, వారసత్వాలకు అదో ఆదరువు. ప్రపంచ దేశాలు, ప్రాంతాలు విలక్షణ జీవన విధానాలతో కొనసాగుతున్నాయి. మానవ సమాజం మానవీయతను ప్రదర్శిస్తూ పేదల పాలిట దైవాలుగా నిలిచి, ఆకలిని అంతం చేయడానికి తమ సహాయ సంఘీభావాలను తెలియజేయాల్సిన సమయం ఆసన్నమైనదని ఐరాస భావిస్తున్నది.




అంతర్జాతీయ మానవ సంఘీభావ దినం వేదికగా భిన్నత్వ ప్రపంచాన్ని ఏకత్వ భావనతో చూడడం, ప్రభుత్వాలు మానవ సమస్యల పరిష్కారాలకు తగు చర్యలు తీసుకోవడం, మానవ ఏకీకరణ ప్రాధాన్యాలను అవగాహన పర్చడం, ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు సంఘీభావ ప్రదర్శనలు చేయడం, పేదరిక నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయడం, సామాజిక న్యాయాలను కల్పించడం లాంటి అంశాలను చర్చించడం జరుగుతుంది. పరమత సహనం, పరహిత సద్గుణాలు నేటి తక్షణ అవసరం అని ప్రచారం చేయాల్సిన శుభ సందర్భం. దయ, కరుణ భావాలను పెంచి పోషించడం, విశ్వ మానవ ఐక్యతకు సంఘీభావాన్ని ప్రకటించడం కొనసాగాలి.

విభేదాలు తాత్కాలికమైనవని, చర్చలతో సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయని, ప్రపంచ శాంతి శాశ్వతమని, ప్రజా శ్రేయస్సే మన నినాదం కావాలని కోరుకుంటేనే రేపటి తరం సుఖశాంతులతో మనగలుగుతుందని తెలుసుకొని మానవత్వ పంట పండించడానికి సహాయ, సలహా, సంఘీభావాలను తెలియజేద్దాం. ప్రపంచ మానవ ఏకీకరణకు సంఘీభావ విత్తులు నాటుదాం.

(20 డిసెంబర్ అంతర్జాతీయ మానవ సంఘీభావ దినం)

డా. బిఎంరెడ్డి, 9949700037

### లేఖలు

## సామాన్యులకు అందేనా గంటల్లో జైలు బెయిలు?

హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సంధ్య థియేటర్‌లో ప్రదర్శించిన పుష్ప2 సినిమా బెనిఫిట్ షో చిత్ర ప్రదర్శనకు నటుడు అల్లు అర్జున్‌తో సహా సినిమా తారాగణం వస్తున్నారని తెలిసి అభిమానులు భారీ ఎత్తున తరలి వచ్చారు. తన కారులో అభిమానులకు అభివాదం చేస్తూ థియేటర్ ను చేరుకున్న అల్లు అర్జున్‌ను చూసేందుకు అభిమానులు ఒక్కసారిగా రావడంతో జరిగిన తొక్కిసలాటలో రేవతి (35) అనే మహిళా చనిపోగా.. ఆవిడ కుమారుడు శ్రీ తేజ్(9) పరిస్థితి విషమంగా ఉంది. అయితే ఈ ఘటనకు బాధ్యుణ్ణి చేస్తూ A11గా ఉన్న అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయగా, ఆయన అరెస్ట్..రిమాండ్.. చంచల్ గూడ జైలు... ఆ పై బెయిల్... అన్నీ సినిమా రేంజ్‌ని తలపించిన విషయం తెలిసిందే. బెయిల్ మంజూరై మరునాడు ఉదయం చంచల్ గూడా జైలు నుండి అల్లు అర్జున్ విడుదలయ్యాక ఈ సంఘటనపై రోజుకో వార్త హల్చల్ చేస్తుంది. తమకు సమాచారం ఇవ్వలేదని తెలిపిన పోలీసులకు కౌంటర్‌గా సంధ్య థియేటర్ యాజమాన్యం ముందస్తు భద్రత కోసం పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించిన లెటర్ విడుదల చేయగా, తదితర పరిస్థితుల నేపథ్యంలో అల్లు అర్జున్‌ను చిత్ర ప్రదర్శనకు రావద్దని కోరిన మరో లెటర్‌ను పోలీసులు విడుదల చేశారు. తాజాగా థియేటర్‌ను ఎందుకు సీజ్ చేయకూడదో తెలపాలని థియేటర్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు.అయితే ఇక్కడ తప్పొప్పుల సంగతి అటుంచితే అందరినీ ఆలోచింప చేస్తుందేంటంటే... ఒక సెలబ్రిటీ కోసం అన్ని తామై ఎంతో హడావుడిగా పని చేసిన వ్యవస్థలు. శని,ఆదివారాలు కోర్టుకు సెలవని శుక్రవారానికే అన్ని పనులు పూర్తి చేయగా బెయిల్ మంజూరైంది. కానీ సామాన్యుల విషయానికి వస్తేనే పరిస్థితి పూర్తి తేడాగా ఉంది. బెయిల్‌కు అర్హత ఉండి కూడా కోర్టులు వాయిదాలు వేయడం వల్ల వేలాదిమంది రిమాండ్ ఖైదీలుగా జైళ్లలో ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. 'మన వ్యవస్థ మారేదెన్నడు?'ఇది ప్రతి సామాన్యుడి మదిలో మెదిలే ప్రశ్న.

**చట్టమా? నీకు శతకోటి 'దండా'లు..**

ధనం, పరపతి, హోదా, కులం, మతం, ప్రాంతం, ఉన్నత స్థానం, అధికారం ఇవన్నీ చట్టానికి దగ్గర చుట్టాలు. ఇవేవీ లేని వాళ్ళు మట్టిలో కొట్టుకుపోవలసిందే అనే భావనలోకి సామాన్యుడు వచ్చేసాడు. ఆ భావనను బట్టే మన వ్యవస్థల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు

దేశంలోని కోర్టుల్లో 4.5 కోట్ల కేసులు పెండింగులో ఉన్నాయి. అయినా సరే, అల్లు అర్జున్ విషయంలో కోర్టులు వేగవంతంగా యమ స్పీడుగా పనిచేశాయి. ఒక కోర్టు 15రోజుల రిమాండ్ వేస్తే, ఆ వెంటనే మరో కోర్టు బెయిల్ ఇచ్చేసింది. కోర్టే కాదు, పోలీసు వ్యవస్థ కూడా వేగవంతంగా జెట్ స్పీడులో పనిచేసింది. అల్లు అర్జున్‌కోసం వందలాది పోలీసులు, వందలాది ప్రభుత్వ సిబ్బంది, రాష్ట్రంలోనే రెండు పెద్దకోర్టులు ఆ రోజు మొత్తం పని చేశాయి. అల్లు అర్జున్‌కి ఇచ్చిన ఈ సమయంలో సగం సమయం ఇచ్చినా దేశంలోని కోర్టుల్లో అన్ని కోట్ల కేసులు పెండింగులో ఉండేవి కావు అన్నది ప్రతి సామాన్యుడి ఆవేదన! ఇప్పటికైనా దేశంలో మరిన్ని ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి...ప్రభుత్వం, పోలీసులు, న్యాయ వ్యవస్థలు సమన్వయంతో పనిచేస్తూ వేగంగా జడ్జిమెంట్ వచ్చేలా పని చేయాలని ఆశిద్దాం.

దిడ్డి శ్రీకాంత్

## మెట్రో పరేడ్ గ్రౌండ్ స్టేషన్‌లో లిఫ్ట్ ఎస్కలేటర్ ఏర్పాటు చేయాలి

హైదరాబాద్ మెట్రో రైలు నగర ప్రజలకు ఒక వర ప్రదాయిని. బ్లూ లైన్ పరేడ్ గ్రౌండ్ స్టేషన్‌లో లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేయకపోవడం వలన వయోధికులు, పిల్లలు, స్త్రీలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రక్కనే అనుబంధంగా ఉన్న గ్రీన్‌లైన్ జెబిఎస్ పరేడ్ గ్రౌండ్ స్టేషన్‌లో విస్తృతంగా ఉన్న లిఫ్టులు, ఎస్కలేటర్లు ఉపయోగించుకొని ఈ స్టేషన్‌లో రైలు సౌకర్యం పొందవలసి ఉంటున్నది. ప్రస్తుతం పరేడ్ గ్రౌండ్ స్టేషన్లో కేవలం రెండు ప్రదేశాలలో గల మెట్ల మార్గాల ద్వారా రాకపోకలు జరుగుతున్నవి. పరేడ్ గ్రౌండ్ పార్కింగ్ స్థలంలో వాహనాలు నిలుపుకొని రోడ్డు దాటి జెబిఎస్ పరేడ్ గ్రౌండ్ స్టేషన్ ద్వారా తిరిగి పరేడ్ గ్రౌండ్ స్టేషన్‌లోకి రావాల్సి ఉండటం వలన అధిక శ్రమ సమయం వృధా అవుతున్నది.

విపరీతమైన రద్దీతో రోడ్డు దాటడం చాలా కష్టంగా ఉంటున్నది. పరేడ్ గ్రౌండ్ పార్కింగ్ స్థలంలోకి రాకపోకలు సాగించుటకు మెట్ల దారి ఏర్పాటు చేశారు. కానీ రేలింగ్ పటిష్టంగా ఏర్పాటు చేయకపోవడం వలన క్రింద పడిపోతామన్న భయం కలుగుతున్నది. పరిశుభ్రంగా కూడా ఉండడం లేదు.

ప్రయాణికుల కష్టనష్టాలను దృష్టి లో ఉంచుకొని ప్రారంభంలో లేని సికిందరాబాద్ ఈస్ట్ స్టేషన్ నుండి రైత్ ఫిల్ లోకల్ బస్ స్టేషన్‌కు ప్రత్యేక స్కైవే మరియు పారడైజ్ స్టేషన్‌లో ప్రవేశించుటకు రోడ్డు కు అవతలివైపు లిఫ్టు ఎస్కలేటర్ ఏర్పాటు చేశారు.

ఇదే విధంగా పరేడ్ గ్రౌండ్ స్టేషన్‌లో పార్కింగ్ స్థలం వైపు లిఫ్టు ఎస్కులేటర్ ఏర్పాటు చేయాల ని మెట్రో అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ సౌకర్యం రెండు స్టేషన్లకు రాకపోకలు కొనసాగించుటకు ఉపయోగకరంగా ఉంటుంది.

దండంరాజు రాంచందర్ రావు

# ప్రభుత్వ అధీనంలో నడుస్తున్న ఆర్టీసికి లాభాలు వస్తాయా?



ఎస్.బాబు, అధ్యక్షులు
టిజిఎస్ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్

ప్రభుత్వ అధీనంలో నడుస్తు న్న ప్రజా రవాణా సంస్థలైన ఆర్టీసిలు ఎక్కడా లాభాల్లో లేవు. ఎందుకంటే ప్రభుత్వాలు ఆ సంస్థలను ఏర్పాటు చేసింది లాభాపేక్షతో కాదు, కేవలం సేవాభావంతో ప్రజలకు సౌకర్యాలు అందించటానికి మాత్రమే. ఆర్టీసి యాక్ట్ 1950 ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వాటా ధనం 1:2 రేషియోలో ఉంటుంది. ఆ ప్రకారంగా తెలంగాణ ఆర్టీసిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వాటా ధనం 201.27 కోట్లు ఉంది. గత 3 దశాబ్దాలుగా రెండు ప్రభుత్వాలు వారి వాటా ధనాన్ని ఆర్టీసికి ఇవ్వడం లేదు. ఆర్టీసిలను కష్టకాలంలో ఆదుకోవలసిన ప్రభుత్వమే బాధ్యతా రాహిత్యాన్ని ప్రదర్శిస్తోంది.

తెలంగాణ ఆర్టీసిలో 2014 నుండి నేటివరకు ఏ విధమైన రిక్రూట్మెంట్ జరగలేదు. తెలంగాణ రాష్ట్రమేర్పడ్డప్పుడు 57,234మంది ఉద్యోగులు ఉంటే నేడు 40,841కి చేరింది. ఈ 10 సంవత్సరాల కాలంలో సుమారు 17వేల మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. రాష్ట్ర విభజన తరువాత ప్రతిరోజు 34లక్షల కిలోమీటర్లు ఆర్టీసి బస్సులు తిరుగుతుండేవి. 17వేల మంది రిటైర్ అయిన తరువాత కూడా దాదాపు అవే కిలోమీటర్లు బస్సులు తిరుగుతున్నాయంటే పనిభారాలు ఎంత పెరిగాయో ఊహించుకోవచ్చు. రిటైరైన ఉద్యోగుల పని భారమంతా సర్వీసులో ఉన్న ఉద్యోగులపై పడి వారి నడ్డి విరుగుతోంది.

ఆర్టీసి రెవెన్యూ 10కోట్ల రూపాయల నుండి 20 కోట్ల రూపాయలకు పెరిగింది. అయినా యాజమాన్యం మాత్రం నష్టాల మంత్రమే జపిస్తోంది. రాష్ట్రం విడిపోయినప్పుడు ఆర్టీసికి 9,019బస్సులు ఉండేవి. ఇప్పుడు 6,424కి తగ్గిపోయా యి. అద్దె బస్సులు 1,314 నుండి 2,725 వరకు చేరాయి. ఆర్టీసి బస్సులు తగ్గడం వల్ల ప్రైవేటీకరణ వైపు వెళుతున్నట్లు స్పష్టమవుతోంది. రోజువారీ ఆదాయం 480కోట్ల రూపాయలని, రోజుకు అయ్యే ఖర్చు 531 కోట్ల రూపాయలని, దానివల్ల నెలకి వచ్చే నష్టం 46కోట్ల రూపాయలని యాజమాన్యం లెక్కలు వేస్తోంది. అంటే సంవత్సరానికి 552 కోట్ల రూపాయలు సంస్థకి నష్టం. 17వేల మంది ఉద్యోగులు తగ్గినా నష్టాలు ఎందుకు వస్తున్నాయి అనేది భేతాళ ప్రశ్న.

2019 సంవత్సరంలో కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ట్రేడ్ యూనియన్ల వల్ల నష్టం వస్తోందని, వాటిపై ఉక్కుపాదం మోపారు. ప్రస్తుతం ట్రేడ్ యూనియన్లు ఉనికిలో లేవని యాజమాన్యం చెప్తోంది. మరి 552 కోట్ల రూపాయల నష్టం ఎక్కడ నుంచి వస్తోందో ఆ సంస్థలో పని చేస్తున్న ఆర్థిక నిపుణులు మరియు సలహాదారులు ఎందుకు సరి చేయలేకపోతున్నారు? యూనియన్లు లేకపోయినా నష్టాలు వస్తూనే ఉన్నాయి. మరి యూనియన్లు ఉండటం వలన యాజమాన్యానికి జరిగే నష్టమేమిటో? గతంలో 8 గంటల డ్యూటీలు ఉండేవి. ఇప్పుడు ఆ డ్యూటీ విధానం లేదు. డ్యూటీ అవర్స్ ని 12 నుండి 16 గంటలకు పెంచటం అమానుషం. రెండు రోజులు చేసే పనిని ఒకే రోజు చేయించడం తో కార్మికులు వత్తిడి తట్టుకోలేక గుండెపోటుకి గురై స్టీరింగ్ మీదనే చనిపోతున్నారు. మరికొందరు ఆత్మ హత్యలు చేసుకుంటున్నారు.

ఆక్యుపెన్సీ రేషియో 96శాతానికి పెరిగింది. అంటే బస్సులు ప్రయాణీకులతో కళకళ లాడుతున్నాయన్నమాట. ఒక బస్సుకి నాడు 8,313రూపాయలు ఎర్నింగ్స్ వస్తే, నేడు ఒక బస్సుకి 22,160రూపాయలు రెవెన్యూ వస్తోంది. అంటే రెవెన్యూ కూడా పెరిగింది. అయినా ఆర్టీసి నష్టాల్లోనే ఉంటుంది. ఆక్సిడెంట్ రేట్ 2014లో 0.08 ఉంటే 2024 లో 0.06గా నమోదైంది. అంటే ఆర్టీసి బస్సులలో ప్రమాదా లు బాగా తగ్గిపోయాయని గణాంకాలు చెప్తున్నాయి. ఇది కూడా డ్రైవర్ యొక్క నైపుణ్యమే. గతంలో బస్ స్టాఫ్ రేషియో 6.00గా ఉండేది. నేడు అది 5.34గా కుదించబడింది. అంటే ఉద్యోగుల సంఖ్య కూడా బాగా తగ్గిపోయిందనే అర్థం.

కారుణ్య నియామకాలలో ఇచ్చే ఉద్యోగాలు రెగ్యులర్ టైమ్ స్కేల్ లో కాకుండా కన్సాలిడేటెడ్ పే విధానంలో రిక్రూట్మెంట్ జరుగుతోంది. ఇది గతంలో యూనియన్లు, యాజమాన్యం మధ్య జరిగిన 12(3) ఒప్పందాన్ని అతిక్రమించడ మే. ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి కాలరీస్‌లో కారుణ్య నియామకాలు రెగ్యులర్ టైమ్ స్కేల్‌లో జరుగుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వోద్యోగులకు కూడా ఈ నియామకాలు రెగ్యులర్ టైమ్ స్కేల్ లోనే జరుగుతున్నాయి. కాని ఆర్టీసిలో మాత్రం యాజమాన్యం గత ఒప్పందాలను తుంగ లో తొక్కి కార్మికుల శ్రమశక్తిని దోచుకుంటోంది. ఈ విధానంలో జరిపే నియామకాల వల్ల సంస్థకు లాభం చేకూరుతుంది. మరి నష్టాలెందుకు వస్తున్నాయ్?

కర్ణాటక ప్రభుత్వం ఆర్టీసి బస్సులకు పన్నుల మినహాయింపు ఇచ్చింది. 3000 బస్సులను కొని సంస్థకు ఇవ్వడానికి బడ్జెట్‌లో పెట్టింది ఆ ప్రభుత్వం. 1000 మంది మహిళా డ్రైవర్లను నియమించుకోవడానికి ఆ ప్రభుత్వం కర్ణాటక ఆర్టీసికి అప్రూవల్ కూడా ఇచ్చింది. డీజిల్ పై పెరుగుతున్న భారాన్ని కూడా ఆ ప్రభుత్వమే భరిస్తోంది. అక్కడా కాంగ్రెస్ ప్రభుత్వమే, ఇక్కడా కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంది. మన ప్రభుత్వం మాత్రం పన్ను మినహాయింపులు కూడా ఇవ్వడం లేదు. ఉన్న ఖాళీల మేరకు రిక్రూట్మెంట్ కు కూడా అనుమతి లేదు. కాబట్టి పర్సనల్ కాస్ట్ తగ్గుతుంది. అయినా మేనేజిమెంట్ నష్టాలే అంటోంది.

గత 10 ఏళ్ళుగా ఆర్టీసిలో రిక్రూట్మెంట్ లేదు. 17 వేల మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. అంటే ఆర్టీసిలో ఏకాన మీ ఏమాత్రం దెబ్బతినలేదు. 2017 వేతన సవరణ 7 సంవత్సరాల పాటు అమలు జరపలేదు. పర్సనల్ కాస్ట్ కూడా తగ్గించబడింది. కె.ఎం.పి.ఎల్, టైర్ లైఫ్ మరియు కార్మికుల సంక్షేమం గురించి ఆర్టీసి అవార్డులు తీసుకుంటోంది. ఈ రెండు పారా మీటర్లలో కూడా ఖర్చు గణనీయంగా తగ్గించ టం జరిగింది. పనిభారాలు పెంచి శ్రమ దోపిడీ చేస్తోంది యాజమాన్యం. సంక్షేమ పథకాలైన పిఎఫ్, సిసిఎస్, ఎస్.ఆర్.బి.ఎస్, ఎస్.బి.టి లాంటి సంస్థలకు గత పదేళ్ళుగా నిధులు ఇవ్వడం లేదు. గత 10 సంవత్సరాలుగా ఆర్టీసి ఉద్యోగులకు ఎరన్డ్ లీవులకు డబ్బు చెల్లించటం లేదు. దీనివల్ల దాదాపు 100కోట్ల రూపాయలు సంస్థ ఖర్చు చేయకుం డా ఆపగలిగింది. అయినా ఆర్టీసికి నష్టాలే అంటున్నారు.

ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు లాభాలు సంపాదిస్తున్నాయా? ప్రభుత్వ ఆసుపత్రులు లాభాల్లో ఉంటున్నాయా? ఎయిర్ ఇండియా లాభాల్లో ఉందా? రైతుబంధు, రైతు రుణమాఫీలు, దళితబంధు లాంటి పథకాలను ప్రభుత్వం లాభాపేక్ష లేకుండా ప్రజలకు అందిస్తోంది కదా. వీటన్నింటిలో లాభాలు ఆశించని ప్రభుత్వం ఒక ఆర్టీసికి మాత్రమే లాభా లు రావటం లేదనటం ఎంతవరకు సమంజసం? అనేది ప్రభుత్వం ఒకసారి ఆలోచించాలి.

# తగ్గుతున్న ధరలు... ఆందోళనలో రైతులు

ధాన్యం విక్రయానికి తప్పని కష్టాలు
పడిపోతున్న మిర్చి ధర
దెబ్బతిన్న పత్తి రైతు
సంక్షోభం దిశగా వ్యవసాయం





**ప్రజాపక్షం/ఖమ్మం :** రైతు పరిస్థితి నానాటికీ తీసికట్టు నానంబొట్టు అన్న చందంగా మారింది. పెరిగిన పెట్టుబడులు తగ్గిన దిగుబడుల నేపథ్యంలో వ్యవసాయ రంగం కుదేలవుతుంది. ఏడాది లాభాలు రెండేళ్ల నష్టాన్ని పూడ్చుతున్నాయన్న చందంగా తయారైంది రైతు పరిస్థితి. ఈ ఏడాది కొన్ని పంటలకు వాతావరణం అనుకూలించగా మరికొన్ని పంటలకు ప్రతిబంధకంగా మారింది. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు దిగజారుతున్న వేళ రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఏడాది ప్రభుత్వం ప్రకటించిన బోనస్ మద్దతు ధర కూడా పర్వాలేదని భావిస్తున్న తరుణంలో ధాన్యం విక్రయం రైతుకు కొత్త కష్టాలు తెచ్చిపెడుతుంది. రకరకాల కొర్రీలతో ధాన్యం కొనుగోలు సజావుగా సాగడం లేదు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఆకాశం మేఘావృతమై ఉండడం తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మరింత ఇబ్బందికరంగా మారింది. సాంబమసూరి అయిన కొన్నిచోట్ల పేచీలు పెడుతూ ధాన్యాన్ని కొనుగోలు చేయడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది పత్తి రైతు పరిస్థితి దయనీయంగా మారింది. జూన్ మాసం నుండి అధిక వర్షాలు పత్తి రైతులను నష్టపరిచాయి.

పత్తి ఎదుగుదల లేకపోవడం, ఎదిగినా అంతగా కాపు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎకరాకు మూడు నాలుగు క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. దీనికి తోడు ధర కూడా రాష్ట్ర ప్రభుత్వం రూ.7,521 నిర్ణయించిన మార్కెట్‌లో మాత్రం ఈ ఏడాది ఐదువేల రూపాయలకు మించి కొనుగోలు చేయలేదు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రంగంలోకి దిగినప్పటికీ రైతులకు సానుకూలత లభించలేదు. ఇప్పటికీ పత్తి విక్రయాలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిసిఐ రైతుల కంటే మధ్య దళారుల నుంచి ఎక్కువగా కొనుగోలు చేస్తుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. మిర్చి రైతుకు కూడా ఈ ఏడాది నష్టాలు తప్పేటట్లు కనిపించడం లేదు. గతేడాది క్వింటా రూ.20వేల వరకు పలికిన మిర్చి ఇప్పుడు రూ.12వేల నుంచి రూ.13 వేల మధ్య నడుస్తుంది. శీతల గిడ్డంగుల్లో ఇప్పటికే లక్షల క్వింటాళ్ల మిర్చి నిల్వ ఉంది. ఈ ఏడాది పెట్టుబడులు కూడా గణనీయంగా పెరిగాయని రైతులు వాపోతున్నారు. తెగుళ్ల కారణంగా క్రిమిసంహారక మందుల వాడకం పెరిగిందని, పెట్టుబడులు పెరిగిన నేపథ్యంలో ధర అధికంగా పలకాల్సిన నేపథ్యంలో సగానికి పడిపోవడంతో మిర్చి రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తుంది. గత పదేళ్ల వ్యవసాయ రంగాన్ని పరిశీలిస్తే రెండేళ్ల నష్టం ఏడాది లాభం అన్న సామెతగా సాగుతుంది. ఒక ఏడాది కాస్త ఫర్వాలేదనుకుంటే మరో ఏడాది తీవ్రమైన నష్టం వస్తున్నది. కొంత ప్రకృతి కారణమైతే పాలకులకు ధరలపై నియంత్రణ లేకపోవడం, పెట్టుబడి ధర మద్దతు ధర నిర్ణయించకపోవడం ఈ పరిస్థితికి కారణమవుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే వ్యవసాయం నష్టాల కార్ఖానాగా మారిపోతుంది. ప్రభుత్వం వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## అభివృద్ధికి సిపిఐ వ్యతిరేకం కాదు

బాధితులకు పరిహారం చెల్లించాలి
సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అభివృద్ధికి సిపిఐ ఎప్పుడూ వ్యతిరేకం కాదని రోడ్డు విస్తరణతో ఇండ్లు కోల్పోతున్న బాధితులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. గురువారం ఖమ్మం నగరంలోని కొత్తగూడెంలో రోడ్డు విస్తరణలో ఇండ్లు, షాపులు కోల్పోతున్న బాధితులను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ ఆధ్వర్యంలో సిపిఐ బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ ఖమ్మం స్తంభాని నగర్ నుండి చింతకాని మండలం కోదుమూరుకు వెళ్లే అల్లిపురం, కొత్తగూడెం రహదారి విస్తరణతో అనేక ఏళ్లుగా ఇండ్ల నిర్మాణం చేసుకుని నివాసం ఉంటున్న పేద, మధ్యతరగతి ప్రజలు ఇండ్లు, షాపులు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధికి కమ్యూనిస్టు పార్టీ అడ్డుకాదని, కానీ అనేక ఏళ్లుగా నివాసం ఉంటున్న పేద ప్రజలకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. ఇండ్లు కోల్పోతున్న వారికి ఇందిరమ్మ ఇండ్లను ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌లో విలీనమైన కొత్తగూడెంలో రహదారుల వెడల్పుతో సుమారు 40 ఇండ్ల వరకు రోడ్డు విస్తరణలో పోతున్నాయని వారికి ఎటువంటి ఆధారం లేదని ప్రభుత్వంతో పాటు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని, పరిహారాన్ని అందించడంతో పాటు ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె.జానిమియా, నాయకులు ప్రతానపు రామనాథం, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, గడ్డం నాగేశ్వరరావు, మాలకొండయ్య, రావుల సంజీవరావు, షేక్ పకీర్, బుడిగె వెంకన్న, కర్రి హుస్సేన్ పాల్గొన్నారు.



## కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మ దగ్ధం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా. బిఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యాలను ఖండిస్తూ ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ, జిల్లా ఎస్‌సి సెల్ ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఎఐసిసి, టిపిసిసి, టిపిసిసి ఎస్‌సి సెల్ పిలుపు మేరకు గురువారం జిల్లా కాంగ్రెస్ కమిటీ, ఎస్‌సి సెల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి హోంశాఖ మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మతో పాత బస్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బొడ్డు బొందయ్య లు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్‌పై రాజ్యసభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే కేంద్ర మంత్రి వర్గం నుంచి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలకు హోంశాఖ మంత్రి అమిత్‌షా తక్షణమే క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుచ్చకాయల వీరభద్రం, వడ్డెబోయిన నర్సింహారావు, దొబ్బల సౌజన్య, ముజాహిద్ హుస్సేన్, సయ్యద్ గౌస్, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వరరావు, లకావత్ సైదులు, నాయకులు పాల్గొన్నారు.



## పరిహార అడవుల పెంపకంపై దృష్టిసారించాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పరిహార అటవీ పెంపకంపై అధికారులు దృష్టిసారించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అటవీ రెవెన్యూ అధికారులతో పరిహార అటవీ పెంపకం, అడవుల సంరక్షణపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అటవీయేతర అవసరాల కోసం మళ్లించిన అటవీ భూమికి పరిహారంగా అడవుల పెంపకం చేయాలన్నారు. జిల్లాలో సుమారు 1500 హెక్టార్ల అటవీ భూమి డైవర్షన్‌కు గురైందని కలెక్టర్ తెలిపారు. అటవీ భూమిని అసైన్డ్ పట్టాలు పంపిణీ చేసిన వివరాలు, అటవీ రెవెన్యూ శాఖల అధికారులు సరిచూసుకోవాలన్నారు. రెవెన్యూ అధికారులు అటవీ భూములు పోను గుట్టలుగా అందుబాటులో ఉన్న భూమిని గుర్తించాలన్నారు. అటవీ రెవెన్యూ అధికారులు సమన్వయంతో భూ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. అడవుల సంరక్షణకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పోడు భూములలో పంట కోతల తర్వాత వరి కొయ్యలు, పంట అవశేషాలు తగలబెట్టడం వల్ల అడవులకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలో ఎంపిడివో, తహసీల్దార్, ఎంపివో, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, అటవీ అధికారులు సమావేశమై పంట కోతల తర్వాత తగలబెట్టకుండా ఉండేలా రైతులకు అవగాహన కల్పించే కార్యాచరణ చేయాలన్నారు. ఈ సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఎఫ్ఆర్‌వోలు, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

## డంపర్ బోల్తా పడి ఇపి ఆపరేటర్ మృతి



**ప్రజాపక్షం/మణుగూరు :** మణుగూరు సింగరేణి ఒసి 2 లో ఒబి గుట్టపై డంపర్‌తో మట్టి డంప్ చేస్తున్న క్రమంలో డంపర్ బోల్తా పడి ఈపి ఆపరేటర్ మోల్ చందు (60) మృతి చెందాడు. మోల్ చందు కొత్తగూడెం నుండి మణుగూరుకు అప్ అండ్ డౌన్ చేస్తున్నాడు. అంతేకాక కొత్తగూడెం జెకె నుండి డిప్యూటేషన్ మీద ఇక్కడ ఉద్యోగం చేస్తున్నాడు. మృతుడికి ఇద్దరు కూతుర్లు, ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఎఐటియుసి బ్రాంచ్ నాయకులు రాంగోపాల్, టిబిజికెఎస్ నాయకులు వెంకట్ తదితరులు చందు పార్థీవదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి, సంతాపం ప్రకటించారు.

## విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని చాటాలి

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/పాల్వంచ :** విద్యార్థులు ఒకరినొకరు గౌరవించుకుంటూ క్రమశిక్షణతో కూడిన క్రీడా స్ఫూర్తిని చాటాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ పాల్వంచలో రాష్ట్ర స్థాయి క్రీడ పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి తెలంగాణ రాష్ట్రానికి గొప్ప పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడంలో సంక్షేమ గురుకులాల్లో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపక సిబ్బంది చేస్తున్న కృషి ఇతరులకు ఆదర్శనీయమన్నారు. విద్యార్థులు చదువులోపాటు క్రీడల్లో ప్రతిభ చూపడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత చురుకుదనం కలుగుందని అన్నారు.

**చదువుతో పాటు క్రీడలకు సమప్రాధాన్యత ఇస్తున్నాం**

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో చదువుతో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యతను ఇస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జాయింట్ సెక్రెటరీ బి.సక్కు నాయక్ అన్నారు. స్టేట్ స్పోర్ట్స్ మీట్ 2024ను చక్కటి వాతావరణంలో నిర్వహిస్తున్న సంబంధిత అధికారులందరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి అంబేద్కర్, జ్యోతిబాపూలే తదితర మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ తహసీల్దార్ జి.వివేక్, ఎంపిడిఒ బి నారాయణ, మల్టీ జోనల్ ఆఫీసర్ కాంపాటి అలివేలు, భద్రాద్రి జోన్ జోనల్ అధికారి కొప్పుల స్వరూప రాణి, 3వ జోన్ జోనల్ ఆఫీసర్ కె.ప్రత్యూష, స్థానిక పాల్వంచ గురుకుల ప్రిన్సిపల్ పివిఎన్ పాపారావు, సీనియర్ ప్రిన్సిపల్స్ డాక్టర్ కన్నె కంటి వెంకటేశ్వర్లు, ఖమ్మం డిసిఒ రాజ్యాల, సీనియర్ ప్రిన్సిపల్స్ ఎస్పీ రాజు, నాగేశ్వరరావు, ఎం.స్వరూప, తుమ్మల విజయదుర్గ, చావ జ్యోతి, శ్రీలత, లిల్లీ, మైథిలీ, సిహెచ్ రాధాకృష్ణమూర్తి, గంటేల సునీల, స్టేట్ స్పోర్ట్స్ మీట్ ఓవరాల్ ఇన్‌చార్జ్ సట్ల శంకర్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్స్ కె.వాసు, జి.శ్రీనివాస్, మీడియా ఇన్‌చార్జ్ ఐపాల సైదులు, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, గుగ్గిళ్ళ శ్రీనివాస్, రంగారావు, కర్నాటి వెంకటేశ్వరరావు, పుల్లారెడ్డి, శ్రీలం కృష్ణారెడ్డి, మల్లేష్, శరత్, రమేష సూపరింటిండెంట్ బి రామ్ దాస్, రిణాధారి, పి.సరోజ, వైస్ ప్రిన్సిపాల్ యన్.అన్వేష్, యం.నాగేశ్వరరావు, కుసుమ రామకృష్ణ, పాషా, మారోజు రమేష్, బి.లక్ష్మ, రాజేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్స్ రావుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## వీడియో జర్నలిస్టుకు ఐజెయు సాయం

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వీడియో జర్నలిస్టుకు టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖమ్మం జిల్లా వీడియో జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జాకీర్ హుస్సేన్ గాయపడ్డారు. కాలుకు తీవ్ర గాయమైంది. ఆయనను పరామర్శించిన యూనియన్ నేతలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఐజెయు రాష్ట్ర కార్యదర్శి కె. రాంనారాయణ, జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, నాయకులు మాటేటి వేణుగోపాల్, శివ, కనకం సైదులు, ఎం.భూపాల్, జనార్ధనాచారి, నామ పురుషోత్తం, చెరుకుపల్లి శ్రీనివాస్, ఆలస్యం అప్పారావు, సంపత్, వినయ్, ఫయాజ్, హర్షద్, విజయ్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

## గురుకులానికి పొంగులేటి డిజిటల్ పరికరాల వితరణ

**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పొంగులేటి చారిటబుల్ ట్రస్టు తరుపున ఖమ్మం రాపర్తి నగర్‌లోని మైనార్టీ జూనియర్ గురుకుల కళాశాలలో విద్యా బోధనకు సంబంధించిన డిజిటల్ పరికరాలను అందించారు. మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి డిజిటల్ పరికరాలను గురువారం అందజేశారు. దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆధునిక సౌకర్యాలతో విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెరుగుతాయన్నారు. సాంకేతిక విద్య ద్వారా గుణాత్మకత పెరుగుతుందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విద్యారంగానికి ప్రాధాన్యతనిస్తున్నారని ప్రభుత్వ విద్య అభివృద్ధి కొరకు ఆయన ప్రత్యేక దృష్టిసారించారని దయాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అఖిల, మార్కెట్ మాజీ ఛైర్మన్ రాజశేఖర్, కార్పొరేటర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



## అశ్వాపురం విద్యార్థికి బయాలజీ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ బహుమతి

**ప్రజాపక్షం/అశ్వాపురం :** ఈనెల 18న కొత్తగూడెంలో జరిగిన జిల్లా స్థాయి బయాలజీ టాలెంట్ టెస్ట్‌లో ఇంగ్లీష్ మీడియం నందు 50 మార్కులకు గాను 49 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానం పొందిన విశాల్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యోగితవేణి అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా బయాలజీ ఉపాధ్యాయులు జ్యోతి, హనుమంతరావు, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి సిఎం కప్ కబడ్డీ టోర్నమెంట్‌లో జూలూరుపాడు మండలానికి ద్వితీయ స్థానం




**ప్రజాపక్షం/జూలూరుపాడు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయి సిఎం కప్ కబడ్డీ టోర్నమెంటులో జూలూరుపాడు మండలం ద్వితీయ స్థానం సాధించింది. మండలం నుండి కొడెం సాయి, బి.బాలు ప్రతిభా పాటవాలు కనబరిచి రాష్ట్రస్థాయి సిఎం కప్పులో స్థానం సంపాదించారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 27 నుండి జనవరి రెండో తారీకు వరకు హైదరాబాద్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీలకు జూలూరుపాడు మండలం నుండి ఇద్దరు యువకులు క్రీడా నైపుణ్యం కనపరిచి రాష్ట్రస్థాయిలో జరిగే కబడ్డీ టోర్నమెంటుకు ఎంపిక ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఈ ఇద్దరు విద్యార్థులను ఎమ్మార్వో, ఎంపిడిఒ, ఎంపిఒ, ఎంఇఒ తదితరులు అభినందించారు.

## జిల్లా సిపిఐ(ఎం) కార్యదర్శిగా నున్నా ఎన్నిక

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు జిల్లా కార్యదర్శిగా నున్నా నాగేశ్వరరావు తిరిగి ఎన్నికయ్యారు. సత్తుపల్లిలో బుధ, గురువారాల్లో జరిగిన 22వ మహాసభలో 42 మందితో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా నున్నా నాగేశ్వరరావు మూడవ సారి ఎన్నిక కాగా కార్యదర్శి వర్గ సభ్యులుగా యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, భూక్యా వీరభద్రం, వై. విక్రం, బొంతు రాంబాబు, బండి పద్మ, యర్రా శ్రీనివాసరావు, మాదినేని రమేష్‌లు ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా మెరుగు సత్యనారాయణ, బండారు రమేష్, పారుపల్లి ఝాన్సీ, పి. రమ్య, నందిపాటి మనోహర్ సహా 31 మందిని జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనిస్టుల అవసరం పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు సాగిస్తామన్నారు. ఒక పక్క మతోన్మాదం, మరోపక్క కార్పొరేటీకరణ దేశానికి ఇబ్బందికరంగా మారాయని ఆయన తెలిపారు. సిపిఎంను ప్రజా ఉద్యమాల్లో ముందు వరుసలో నిలిపేందుకు కృషి చేస్తామన్నారు.

## రాళ్లు పీకేసిన ఘటనలో మూడు నెలల జైలు శిక్ష

**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** సరిహద్దు రాళ్లు పీకివేసిన ఘటనలో మూడు నెలల జైలు శిక్ష, రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ ఖమ్మం రెండవ అదనపు ప్రథమ శ్రేణి న్యాయస్థానం న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ గురువారం తీర్పునిచ్చారు. ఖమ్మం రూరల్ మండలం గుదిమళ్ల గ్రామానికి చెందిన దార శేషయ్య, దార నాగభూషణం, దార ఎల్లయ్య, బి.శ్రీను, చెరుకుపల్లి వెంకటేశ్వర్లు, చెరుకూరి లక్ష్మయ్యలకు ఈ శిక్ష విధించారు. గంజి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుదిమళ్ల గ్రామంలో సర్వే నెం.159, 161లో 26 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని మిషన్ భగీరథ వారు ఆక్రమించుకుంటారని హైకోర్టును ఆశ్రయించగా 31 ఆగస్టు 2016 నాడు రెవెన్యూ అధికారులు హద్దులు నిర్ణయించారు. అట్టి హద్దులను సెప్టెంబర్ ఆరు 2016న పైన పేర్కొన్న నిందితులు ట్రాక్టర్‌తో హద్దులను తొలగించారని గంజి వెంకటేశ్వర్లు ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు రుజువు కావడంతో న్యాయమూర్తి పైన పేర్కొన్న విధంగా తీర్పునిచ్చారు. ఈ కేసులో మొదటి నిందితుడు దార శేషయ్య కోర్టుకు హాజరు కాకపోవడంతో నాన్‌బెయిలబుల్ వారెంట్ ఇచ్చారు.

## ఆకర్షణీయంగా కళాక్షేత్రం ఆధునీకరణ

'భక్తరామదాసు' ఆధునీకరణకు డిపిఆర్ తయారు చేయండి
ప్రైవేటు ఫంక్షన్ హాళ్లకు దీటుగా తీర్చిదిద్దాలి
కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికగా ఉన్న భక్తరామదాసు కళాక్షేత్రాన్ని ఆధునీకరణ చేసేందుకు డిపిఆర్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఖమ్మం నగరంలోని శ్రీభక్తరామ దాసు కళాక్షేత్రాన్ని సందర్శించి కళాక్షేత్రంలో చేపట్టిన ప్రూఫ్ లీకేజీ మరమ్మతు పనులు, ఎంట్రీ కలర్ వాష్ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కళలకు, కళాకారులకు పుట్టినిల్లయిన ఖమ్మంజిల్లాలో ఉన్న శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రాన్ని ఆధునీకరించి ప్రైవేటు ఫంక్షన్ హాళ్లకు దీటుగా తయారు చేయాలన్నారు. కళాక్షేత్రంలో ఇంటీరియల్ మరింత ఆకర్షణగా తయారు చేయడం, సౌండ్, ఆడియో వ్యవస్థను మెరుగుపర్చడం, డయాస్ ఏర్పాటు, పూర్తి స్థాయిలో లైటింగ్ ఏర్పాటు, గోడలకు ఆకర్షణీయమైన వాల్ పెయింటింగ్స్, సిటింగ్ అరైంజ్‌మెంట్స్, బయట పరిసరాల్లో గ్రీనరీకి చర్యలు వంటి వివిధ అంశాలకు సంబంధించి హైదరాబాద్ నుంచి ఆర్కిటెక్చర్‌ను పిలిపించి డిజైన్ మోడల్ రూపొందించి డిపిఆర్ తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఇఒ దీక్షారైనా, డిప్యూటీ ఇంజనీర్ మహేష్ బాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## జమిలి ఎన్నికల విధానాన్ని వ్యతిరేకించాలి

ఎన్‌డి రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** జమిలి ఎన్నికల విధానాన్ని వ్యతిరేకించాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం కోలా లక్ష్మీనారాయణ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వక్తలు జమిలి ఎన్నికల విధానాల వల్ల ప్రజలకు, ప్రజాస్వామిక వాదులకు ప్రశ్నించే గొంతులకు అన్యాయం జరుగుతుందన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో భాగంగానే జమిలి ఎన్నికల ప్రతిపాదనను బిజెపి తెరపైకి తెచ్చిందన్నారు. మనువాద సిద్ధాంతాన్ని ప్రత్యక్షంగా ప్రవేశపెట్టడానికి బిజెపి చేస్తున్న ప్రయత్నాలలో జమిలి ఎన్నికలు ఓ భాగమని వక్తలు ఆరోపించారు. జమిలి ఎన్నికలు దేశ ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని అశాస్త్రీయ భావజాలంతో బిజెపి వ్యవహరిస్తుందన్నారు. ప్రజల ఆహారం, వేష, భాష, ఆహార్యం, ఆలోచనపై బిజెపి దాడి చేస్తుందన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు, స్పర్శ అధ్యయన వేదిక అధ్యక్షులు కాకి భాస్కర్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, వివిధ పక్షాల ప్రతినిధులు రాజేంద్రప్రసాద్, జర్నలిస్టు చిర్రా రవి, వై.జానకి, మోహన్‌రావు, మస్తాన్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు పేదలకు చేరువచేయాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు పేదలకు చేరువచేయాలనే సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. పట్టణంలోని గణేష్ టెంపుల్ ఏరియాలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిత్య ప్రైవేటు ఆస్పత్రిని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ అన్ని సౌకర్యాలు ఉన్న ఆస్పత్రులు అందుబాటులో లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఖమ్మం, హైదరాబాద్ నగరాలకు వెళ్లి ఆర్థికంగా ప్రజలు ఇబ్బందులు పడుతన్నారన్నారు. ఇలాంటి పరిస్థితులను అధిగమించేందుకు ప్రస్తుతం ఉన్న ఆస్పత్రులు తమ సేవలు మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏజెన్సీ గ్రామాలకు కేంద్రంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఆదిత్య ఆస్పత్రిని నెలకొల్పడం, పేదలకు వైద్య సేవలు చేసేందుకు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, కౌన్సిలర్ రావి మమత, కౌన్సిలర్లు, నాయకులు, వైద్యులు ప్రవీణ్, కృష్ణ ప్రసాద్, నాగరాజు, కోనేరు చిన్ని, విజయ్, సత్యనారాయణ చారి, పిడుగు శ్రీను, రవీంధర్, మసూద్, రజాక్, కాసుల వెంకట్,రావి రాంబాబు పాల్గొన్నారు.

## ప్రతీ గ్రామ శాఖలో సిపిఐ అరుణ పతాకాన్ని ఎగరవేయాలి

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** డిసెంబర్ 26న 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా ప్రతి గ్రామ శాఖలో భారత కమ్యూనిస్టు పార్టీ అరుణ పతాకాన్ని ఎగురవేయాలని పినపాక నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సారపాక సిపిఐ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని, 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతుందని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావు, అలవాల సీతారాంరెడ్డి, సాంబయ్యగూడెం మాజీ ఎంపిటిసి, సిపిఐ సీనియర్ నాయకులు కామిశెట్టి రామారావు, సిద్ధారపు సుబ్బారెడ్డి, ఎఐటియుసి ఐటిసి పిఎస్‌పిడి అధ్యక్షులు ఎండి సాజిద్, అఖిల భారత యువజన సమైక్య జిల్లా నాయకులు షేక్ జహూర్ పాల్గొన్నారు.

## ఎఐటియుసి ఆధ్వర్యంలో గని మేనేజర్‌కు సన్మానం



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి: కెటికె 6 ఇంక్లైన్ గని మేనేజర్ రామ్ భరోస్ మహాతో డిప్యూటీ జిఎంగా ప్రమోషన్‌పై వెళుతున్న సందర్భంగా ఎఐటియుసి బ్రాంచ్ సెక్రెటరీ మోట పలుకుల రమేష్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అలాగే ఎఐటియుసి గుర్తింపు పత్రం పొందిన తర్వాత పిట్ కమిటీ సోదరులను పిట్ కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గని మేనేజర్ కు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ సప్ప కృష్ణమూర్తి, వర్క్ మెన్ ఇన్‌స్పెక్టర్ రాజన్న, అడిషనల్ ఫిట్ సెక్రెటరీ గోవర్ధన్, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీలు రాంబాబు, గణేష్, షిఫ్ట్ ఇన్చార్జులు సిద్దయ్య, హనుమంతు, రాంబాబు, కనకయ్య, అసిస్టెంట్ షిఫ్ట్ ఇన్చార్జులు మధుకర్,శ్రీనివాస్, ఈరు, సేఫ్టీ కమిటీ సభ్యులు నవీన్, చంద్రయ్య, శ్రీనివాస్, మైన్స్ కమిటీ సభ్యులు శ్రీనివాస్, ధర్మ రాజు, సురేష్, అశోక్, సీనియర్ నాయకులు జగన్, ప్రభాకర్, శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఢిల్లీలో బాల ఒగ్గుడోలు ప్రదర్శన



ప్రజాపక్షం/లింగాలఘణపురం: భారత ప్రభుత్వం సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సంగీత నాటక అకాడమీ ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న, వీర్ బాల దివాస్ (బాలల దినోత్సవం సందర్భంగా) ఈ కార్యక్రమాన్ని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున, ఒగ్గుడోలు విన్యాసం కళా ప్రదర్శన కు ఆత్మీయ ఆహ్వానం పంపిందని, ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ జాతీయ పురస్కార అవార్డు గ్రహీత డాక్టర్, చౌదర్ పల్లి రవి కుమార్ తెలిపారు. డిసెంబర్ 26వ తేదీన న్యూఢిల్లీలోని భారత మంటపంలో ఉత్సవం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేశ ప్రధాని దామెర దాస్ నరేంద్ర మోడీ హాజరవుతున్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి, 1015 సంవత్సరాల వయసుగల, బాల ఒగ్గులు ప్రదర్శనలు చేయడం విశేషం అన్నారు. గత పది రోజులుగా, బాల ఒగ్గులు, ఉస్తాద్ రవి ఆధ్వర్యంలో, ప్రత్యేక శిక్షణలు ఇస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు, డాక్టర్ మామిడాల, హరికృష్ణ కి, బాల ఒగ్గు కుటుంబాలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుంకరి భరత్, గాజర్ల బుగ్గయ్య, మరికుక్కల అశోక్, డి.కొండ రాజశేఖర్, మేకల సంపత్ పాల్గొన్నారు.

## ఎంపిడిఒల సంఘం జిల్లా అధ్యక్షుడుగా ఆంజనేయులు



ప్రజాపక్షం/హసన్ పర్తి :తెలంగాణ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల కేంద్ర సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షులుగా పెద్ది ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా జూలూరు ప్రవీణ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. హ నుమకొండ జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఎం.విద్యాలత ఆధ్వర్యంలో జిల్లా పరిధిలోని 11 గురు యంపిడిఓలు కలిసి ఏకగ్రీవంగా ఎంపిడిఓ పరకాల పెద్ది ఆంజనేయులును అధ్యక్షులుగా, హసన్‌పర్తి ఎంపిడిఒ జూలూరు ప్రవీణ్ కుమార్‌ను ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడుగా ఎం. శ్రీనివాస్ రెడ్డిని, కోశాధికారిగా నందం విజయకుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రామడుగు లక్ష్మీ ప్రసన్న, కార్యవర్గ సభ్యులుగా గుండె బాబు, కమటం అనిల్ కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోగా ఎన్నికల అధికారి ఎం. విద్యాలత ఇట్టి కార్యవర్గం 2024–25 నుండి 25–26 మూడు సంవత్సరాల కోసం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ఎంపిడిఒల పాత్ర కీలకం అని అందరూ కష్టపడి పని చేసి జిల్లాను ఉన్నత స్థాయిలో నిపాలని కోరారు. నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన పెది ఆంజనేయులు మాట్లాడుతూ ఎన్నికల సహృధ్భావ వా తావరణంలో సజావుగా నిర్వహించినందుకు ఎన్నికల అధికారి,ఎంపిడిఒలకు కృతజ్ఞతలు తెలుపుతూ అందరం కష్టపడి పని చేసి జిల్లా కలెక్టర్ కు మంచి పేరు రావడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సహాయ ఎన్నికల అధికారిగా హ నుమకొండ జిల్లా ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.రవి వ్యవహరించగా ఈ కార్యక్రమంలో శాయంపేట ఎంపిడిఒ ఫనిచంద్ర, నడికుడ ఎంపిడిఒ శ్రీనివాస్, భీందేవరపల్లి ఎంపిడిఒ వీరేశం, జిల్లా పరిషత్ హన్మకొండ కార్యాలయ పర్యవేక్షకులు బి. రాంబాబు, జి.సునిల్, జి.రామ్మోహన్, వి.సురేష్ పాల్గొన్నారు.

## పామాయిల్ పంట దగ్ధం

ప్రజాపక్షం/జఫర్‌గఢ్: పామాయిల్ పంట దగ్దమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన గాదె వెంకటరత్నం అనే రైతు తనకున్న నాలుగెకరాల వ్యవసాయ భూమిలో పామ్ ఆయిల్ పంట వేసుకుని గత నాలుగు సంవత్సరాలుగా సాగు చేస్తున్నాడు. గత రెండు నెలల క్రితం అది గెలలు వేసి, పంట దిగుబడి వచ్చే సమయం మొదలుకాగా ఈ లోగా బుధవారం సాయంత్రం సమయంలో పంట మొత్తం అగ్ని ప్రమాదానికి గురై 3ఎకరాల పంట కాలిపోయింది. దీంతో పాటు మొత్తం పైప్‌లైన్, డ్రిప్పు కాలిపోవడం జరిగింది. ఇది ప్రమాదవశాత్తు జరిగిందా, లేక ఎవరైనా దుండగులు కాల్చే ప్రయత్నం చేశారా అనేది తెలియాల్సి ఉంది. సదరు రైతు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. చే తికొచ్చిన పంట కాలిపోవడంతో సుమారు రూ.10లక్షల నుండి12లక్షల నష్టం జరిగిందనితననుప్రభుత్వంఆదుకోవాలనిరైతువెంకటరత్నం కోరారు.

## ఆజాంజాహి కార్మిక భవనం స్థలంలో నిర్మాణాలు చేయొద్దు

ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : ఆజాం జాహి మిల్లు కార్మిక భవనం వివాదంలో కీలక మలుపు తిరిగింది. వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఉదయం కార్మిక భవన స్థలాన్ని వరంగల్ తహసీల్దారు పరిశీలించి కీలక ఆదేశాలు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని, ఎవరైనా నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదుచేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కస్తూర్బా గాంధీ పాఠశాలలో బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాపక్షం/వాజేడు:ములుగు జిల్లా వాజేడు మండలంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్నటువంటి పిజిసిఆర్టి సివిక్స్, పిజిసిఆర్టి ఇంగ్లీష్, పిజిసిఆర్టి నర్సింగ్ రెండు పోస్టులకు ఈ విద్యా సంవత్సరానికి గాను తాత్కాలిక పద్ధతిలో పనిచేయుటకు స్థానికులై ఉండి అర్హత కలిగిన మహిళలు అభ్యర్థులు వారి యొక్క ధ్రువీకరణ పత్రాలతో 20/12/2024, నుండి 21/12/2024 రోజున కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, వాజేడు స్పెషల్ ఆఫీసర్ కు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా తెలిపారు. పూర్తి వివరాల కొరకు కెజిబివి వాజేడు స్పెషల్ ఆఫీసర్ సుజాతను, ఫోన్ నెంబర్ 9010117750 ద్వారా సంప్రదించాలని తెలిపారు.

# క్రీడా ప్రతిభ వెలికి తీసేందుకే సీఎం కప్

### జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్






ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: గ్రామీణ ప్రాంతాల్లో మరుగున పడిన క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకే ముఖ్యమంత్రి కప్ క్రీడలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో నిర్వహిస్తున్న నేపథ్యంలో సిఎం కప్ జిల్లా స్థాయి క్రీడలు జరుపుకుంటున్నట్లు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ స్పష్టం చేశారు. గురువారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్‌టిఆర్ స్టేడియంలో జిల్లా స్థాయి సిఎం కప్ క్రీడలు అదనపు కలెక్టర్లు వెనిన్ వత్సల్ టోప్పో, కె.వీరబ్రహ్మాచారితో కలిసి కలెక్టర్ అధికారికంగా ప్రారంభించారు. క్రీడాకారుల నుంచి క్రీడా వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ, పట్టణ క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా తీర్చదిద్దాలనే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. గ్రామం నుంచి ప్రపంచానికి క్రీడా విజేతలుగా నిలబెట్టేందుకు జరుగుతున్న ఈ మహాయజ్ఞంలో క్రీడాకారులు తమ ప్రతిభను చూపించి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని ఆయన సూచించారు. ప్రతీ క్రీడాకారుడు క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొగల సామర్థ్యం, క్రీడా పర్యావరణ వ్యవస్థ కోసం ముందడుగు వేయాలని తెలంగాణ రాష్ట్రం నుంచి మహబూబాబాద్ జిల్లా నుంచి ఒలంపిక్ కీర్తి చాటేలా ఎదిగేందుకు క్రీడాకారులు కృషి చేయాలని ఆయన అన్నారు. రాష్ట ప్రభుత్వం తెలంగాణను నెంబర్ వన్ క్రీడా రాష్ట్రంగా మలిచేందుకు చేస్తున్న కృషిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాల్సిందిగా జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. క్రీడాకారులు గ్రామీణ స్థాయి నుంచి ప్రతి దశలోనూ ప్రతిభకు పట్టం కట్టేలా ప్రభుత్వం క్రీడలు నిర్వహిస్తోందన్నారు. క్రీడలు మనలోని సంకల్పశక్తి, ఒడిదుగుకులను అధికమించే సామర్ధ్యాన్ని పెంచి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. మండలస్థాయిలో గెలిచి జిల్లా స్థాయికి ఎంతో కష్టపడి వచ్చిన క్రీడాకారులు అదే స్ఫూర్తితో జిల్లాస్థాయిలో ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయిలో పాల్గొని మహబూబాబాద జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రతిభను మరింత ఎత్తుకు ఎదిగేలా వేదిక కావాలని, ఆ తర్వాత జాతీయ, అంతర్జాతీయ స్తాయికి చేరుకోవాలని అన్నారు. 18మండలాల నుంచి ఈ జిల్లా స్థాయి క్రీడల్లో క్రీడాకారులు పాల్గొన్నారు. సుమారు 900మంది క్రీడాకారులు, 165 మంది అధికారులు ఈ క్రీడల్లో విధులు నిర్వహించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ సిఎం కప్ జిల్లా క్రీడోత్సవాలు ఉతాహవంతమైన వాతావరణం నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు, క్రీడాకారులు సూచించారు. అనంతరం కలెక్టర్ ఖబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఆర్‌డిఓ కృష్ణవేణి, జిల్లా విద్యా శాఖాధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, డివైఎస్ఓ ఒ.జ్యోతి, మహబూబాబాద్ తహసీల్దారు భగవాన్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్‌లు పద్మావతి, పుష్పలీల, కొమ్ము రాజేందర్, బాస్కెట్ బాల్ కోచ్ వెలిశాల కుమారస్వామి, కాశీనాథ్, అవారి శ్రీను,గోపుశ్రీను,శంకర్‌నాయక్‌తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షా క్షమాపణ చెప్పాలి



ప్రజాపక్షం/జనగామ ప్రతిని: నిండు పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానించే విధంగా మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమీత్‌షా బేషరతుగా క్షమాపన చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జనగామలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ డాక్టర్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ రాజమౌళి, టిపిసిసి సభ్యులు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానించిన అమీత్‌షాను మోడీ సమర్థించడం సరియైంది కాదన్నారు. అంబేద్కర్‌ను అవమాణిస్తే దేశ ప్రజలను అవమానించినట్లేనని, అంబేద్కర్‌కు బదులు దేవుడిని స్మరించమని ఉచిత సలహాలు ఇవ్వడం సరియైంది కాదన్నారు. దేశానికి అత్యున్నత న్యాయస్థానాన్ని అందించిన అంబేద్కర్‌న అవమాణించడం కుట్రపూరితేమని, మొదటి నుండి బిజెపి రాజ్యాంగాన్ని మార్చి దాని స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని తేవడానికి యత్నిస్తుందన్నారు. అంబేద్కర్‌ను అవమాణించన అమీత్‌షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జనగామ పట్టణ అధ్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి, మద్దెపాక సిద్దులు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు గణిపాక మహేందర్, మేడ శ్రీనివాస్, డిసిసి వైస్ ప్రెసిడెంట్ గంగం నరసింహరెడ్డి, సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, రాజబోయన లక్ష్మి నారాయణ, బడికె కృష్ణస్వామి, వంగాల మల్లారెడ్డి, దూడెల సిద్దులు గౌడ్, బొట్ల నర్సింగరావు, జాఫర్ షరీఫ్, ఇస్మాయిల్, జక్కుల అనిత, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అమీత్‌షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా అమీత్‌షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బొట్ల శేఖర్ మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమాన పరిచిన అమీత్‌షాను మంత్రి వర్గం నుండి తొలగించడంతో పాటు పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేవారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు తూడి దేవదానం, నాయకులు మబ్బు ఉప్పలయ్య, పల్లెర్ల లలిత, గద్దం యాదగిరి, మారపాక రమేష్, ఎండి హతియాసుల్తానా, బొట్ల శ్రావన్‌కుమార్, పందిళ్ల కళ్యాణి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దాసగాన సుమ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ అభివృద్ధి కోసం సమష్టి కృషి



ప్రజాపక్షం/ కమలాపూర్: కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి అందరి సమిష్టి కృషి ఎంతో అవసరమని మార్కెట్ కమిటీ చైర్మన్ తవుటం ఝాన్సీ రాణి రవీందర్ విజ్ఞప్తి చేశారు. కమలాపూర్ వ్యవసాయ మార్కెట్‌కు మొదటి సారి ఏర్పడిన నూతన పాలకవర్గ మొదటి సమావేశం గురువారం మార్కెట్ కమిటీ చైర్మన్ తవుటం ఝాన్సీ రాణి అధ్యక్షతన మార్కెట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య, ఎంపిడిఒ గుండె బాబు, సింగిల్ విండో చైర్మన్ పేరాల సంపత్ రావు, మార్కెట్ కార్యదర్శి రాజు, సూపర్‌వైజర్ యాకయ్య, డైరెక్టర్లు ఉరుసు తిరుపతి, సముద్రాల కృష్ణ, కెత్తే విజేయేందర్, చకిలం దయాకర్, మిల్కూరి శ్రీనివాస్, ఆకినపల్లి భిక్షపతి, కిన్నెర కృష్ణమూర్తి, జనగాని శివకృష్ణ, యాకుబ్, నెగ్గుల లింగయ్య పాల్గొన్నారు. సమావేశంలో నూతన పాలకవర్గం ఏర్పాటులో సహకరించి పాలక వర్గ నియామకం చేయించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కి ధన్యవాదాలు తెలుపుతూ పలు తీర్మానాలు చేశారు. తదనంతరం మార్కెట్ కమిటీ అధికారులు కార్యవర్గాన్ని శాలువాలతో సత్కరించారు.

## నిర్దేశిత సమయంలోగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలి



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ రోహిత్‌సింగ్ అధికారులకు సూచించారు. గురువారం బచ్చన్నపేట మండంలోని తమ్మడపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారిక సొంత ఇంటి కలను నిజం చేయనుందన్నారు. అందుకే సర్వే చేయడం జరుగుతుందని, సర్వే పాదర్శకంగా జరగాలన్నారు. అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ సర్వే చేయాల్సిన ఇండ్లకు వెళ్లి ఇంటి స్థలం ఉందా, నివేషన స్థలానికి సంబంధించ ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సర్వేలో తహశీల్దార్ ప్రకాష్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## డిఎంహెచ్ఒ కార్యాలయం ఎదుట నిరసన

### వంటావార్పు చేసి కార్యాలయం ముందే ఎఎన్ఎంల నిద్ర



ప్రజాపక్షం/హనుమకొండ : వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న రెండవ ఎఎన్ఎంలు, ఇసిఎఎన్ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్స్ ఎఎన్ఎంలు, వైద్య విధాన పరిషత్ ఎఎన్ఎంలు, హెచ్ఆర్‌డి ఎఎన్ఎంలు ఇతర అన్ని రకాల ఎ. ఎన్. ఎంలను రాత పరీక్ష లేకుండ యధావిధిగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం వరంగల్‌లోని డిఎంహెచ్ఒ కార్యాలయాల ముందు 48 గంటల నిరసన కార్యక్రమంలో భాగంగా వంట వార్పు చేసి కార్యాలయం ముందు నిద్రపోవడం జరుగుతుంది. అందులో భాగంగా హనుమకొండ, వరంగల్ జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినట్లు వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర నాయకులు, తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాద నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ పిలుపు మేరకు వరంగల్ లోని డిఎంహెచ్ఓ కార్యాలయం ముందు జరిగిన 48 గంటల నిరసన కార్యక్రమంలో పాల్గొన్న యాద నాయక్, జె సుధాకర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఎ.ఎన్.ఎంలు 24 సంవత్సరాల నుండి రెగ్యులర్ కాకపోవడం అత్యంత దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. గత 24 సంవత్సరాలుగా సమస్యల పరిష్కారానికి వివిధ రూపాల్లో ఆందోళన పోరాటాలు, నిరవధిక సమ్మెలు చేసిన ప్రభుత్వం నేటికీ రెగ్యులర్ చేయకపోవడం ఎంతవరకు సమంజసం అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో సమ్మె సందర్భంగా ఏఎన్ఎంల న్యాయమైన సమస్యల పరిష్కారానికి రాష్ట్రప్రభుత్వం 2023 సెప్టెంబర్ 2న ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసిందని, ఈ కమిటీ ఏఎన్ఎంలతో చర్చించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి ఇవ్వాలని ఉన్న ఆ కమిటీ రిపోర్ట్ లేకుండ రాత పరీక్ష తేదీ ప్రకటించడం వెనుకాల ఉన్న అంతర్యామేమిటని అన్నారు. రాత పరీక్షను వాయిదా వేయాలని, రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న 6,500 మంది ఏఎన్ఎంలు డిమాండ్ చేస్తున్నారని, అందులో భాగంగానే రాష్ట్రంలోని 33 జిల్లాల ముందు 48 గంటల నిరసన కార్యక్రమాలు జయప్రదంగా జరుగుతున్నట్లు యాద నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ నాయకులు జే సుధాకర్, శ్రీనివాస్, సుజాత, సరోజ, చంద్రకళ, ప్రభావతి, సాంబలక్ష్మి ,మంజుల, పుష్పలత, విజయ, కవిత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పాత సామాన్ కొనుగోలు పేరుతో దొంగతనాలు





ప్రజాపక్షం/కమలాపూర్: ఇనుప సామాన్... రాసిన పుస్తకాలు... ప్లాస్టిక్ సామాన్... వంటివి వస్తువులను కొనుగోలు చేస్తామని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు, మరికొందరు గ్రామాలలోని పరిసర ప్రాంతాలలో ఇనుస సామాన్లు ఏరుకుంటూ దొంగతనాలకు పాల్పడుతున్నారు తస్మాత్ జాగ్రత్త....!!! అదే తరహాలో కరాబైన వస్తువులను ఏరుకుంటూ ఇద్దరు మహిళలు మండలంలోని ఉప్పల్ గ్రామానికి చెందిన పోతరాజు కుమారస్వామి అనే వ్యక్తి హైదరాబాద్ లో పనిచేస్తూ జీవనం కొసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇంటికి తాళం వేసి ఉండగా గమనించిన ఇద్దరు మహిళలు ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో చొరబడి రాగి, ఇత్తడి సామాన్లను అపహరించారు. గమనించిన గ్రామస్థులు ఆ ఇద్దరు మహిళలను ఆపి ప్రశ్నించగా తాము దొంగతనం చేయలేదని చెప్పడంతో స్థానికులు కమలాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోని ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారు దొంగలించిన సామాన్లు ఇంటి యజమానికి సంబంధించిన వ్యక్తులకు పోలీసులు అప్పగించారు. ఇప్పటికైనా ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళితే సమీప కుటుంబాలకు గానీ, పోలీసులకు గానీ సమాచారం ఇవ్వాలి. జాగ్రత్తగా ఉండకపోతే ఇంట్లో వస్తువులే కాదు బంగారం, పైసలు కూడా ఎత్తుకెళ్ళడానికి వెనకాడరని ప్రజలు గమనించాలి. గతంలో పోలీసులు ప్రజలు అప్రమత్తంగా ఉంటూ గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని తెలుపడం జరిగింది. ఏది ఏమైనా ప్రజలు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఎస్‌విఎస్‌లో మహిళా క్రికెట్ టోర్నమెంటు ప్రారంభం



ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ : గ్రేటర్ వరంగల్ 55వ డివిజన్ భీమారంలోని ఎస్‌వీఎస్ కళాశాలలో అండర్. 18 ఇంటర్ కాలేజ్ ఏట్ మహిళా క్రికెట్ టోర్నమెంటును ఎస్‌విఎస్ విద్యా సంస్థల వైస్ చైర్మ న్ డాక్టర్ ఎర్రబెల్లి సువర్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎర్రబెల్లి సువర్ణ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రీడల్లో పాల్గొనడానికి ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందని చదువులతోపాటు క్రీడల్లో రాణిస్తే మన స్సు ప్రశాంతతను కలిగిస్తాయని ఇలాంటి క్రీడలను మా విద్యా సంస్థల్లో నిర్వహించడం చాలా గర్వకంగా ఉందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. పురుషులతో సమానంగా మహిళలు ముందంజలో ఉండాలన్నారు. మహిళలు అంతరిక్షం నుంచి అన్ని రంగాల్లో దూసుకపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వైఖరి రాజ్యాంగ విరుద్ధం

### బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి

ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి: అంబేద్కర్ గురించి చులకనగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వైఖరి రాజ్యాంగ విరుద్ధమని బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18న రాజ్యసభలో రాజ్యాంగం గురించి జరిగిన చర్చలో పాల్గొన్న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాజ్యాంగం రచించిన అంబేద్కర్ గురించి చులకనగా హేళనగా మాట్లాడటాన్ని బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా సమితి తీవ్రంగా ఖండించిందన్నారు. రాజ్యాంగం ద్వారా చదువుకొని జ్ఞానం పెంచుకొని రాజకీయ రంగంలో అడుగుపెట్టి కేంద్ర ప్రభుత్వంలో హోం శాఖ మంత్రిగా ఎదిగిన అమిత్ షా, తన మనువాద రాజ్యాంగాన్ని అమలు పరచటానికి తహతహలాడుతున్నట్టు అమిత్ షా వాఖ్యల ఆధారంగా అర్థమవుతుందన్నారు. గుడిని భగవంతుడిని బహుజనులకు అప్పగించి, పార్లమెంటు రాజ్యసభ అసెంబ్లీ లాంటి చట్టసభలను ఈ అగ్రకులాలు కబ్జా చేయాలని చూస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా అన్ని తరగతుల వారు చట్టసభల్లో సకల రంగాల్లో తమ తమ వాటాలకై నినదించడాన్ని మనువాద సిద్ధాంత పరులైన బిజెపికి నచ్చటం లేదన్నారు. అందుకే మరొక్కసారి భగవంతుని గురించి ప్రత్యక్షంగా, రాజ్యాంగబద్ధమైన రాజ్యసభలోనే అమిత్ షా మాట్లాడడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే అవుతుందన్నారు. అందుకే బిసిలు, దళితులు ఐక్యమై ఈ మనువాదుల కుట్రలనుండి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

## చల్లగరిగలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

### ఎమ్మెల్యే జిఎస్ఆర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



ప్రజాపక్షం/చిట్యాల: బడి బాల్యం నుండే వివక్షకు గురై అవమానాలను ఎదుర్కొని ఆదర్శవంతుడైన అంబేద్కర్ భారత రాజ్యాంగ రాసిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని ప్రతి ఒక్కరు అంబేద్కర్ ఆశయ సాధనలో ముందుకు సాగాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కొనియాడారు. మండలంలోని చల్లగరిగ గ్రామంలోని బుధవారం ముఖ్య కూ డలిలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసి ఆవిష్కరణ కో సం అంబేద్కర్ కమిటీ సభ్యులు మండలం జిల్లా రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్తులతో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాజీ ఐపిఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ప్రొఫసర్ కంచు ఐలయ్యాల కు పూలతో మంగళ హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహవిష్కరణ ఘనం గా చేశారు. అనంతరం చల్లగరిగ హైస్కూల్ ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య భారతదేశ వ్యవస్థ లో అత్యంత కీలకమైన భారత రాజ్యాంగాన్ని రూపొందించి ప్రత్యేక స్థానాన్ని పొందుపరిచి కులాలకు అతీతంగా ఓటు హ క్కును ప్రవేశపెట్టి ఎస్సి, ఎస్టి బడుగు బలహీన వర్గాల కుల అవస్థలను నిర్మూలించే విధంగా కృషి చేశారన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడు తూ ఒక వెనుకబడిన జాతిలో పుట్టి కుల వివక్షకు గురై భారత రాజ్యాంగాన్ని రసించి దేశానికి ఆదర్శంగా నిలిచి ఒక న్యాయవాదిగా ఆర్థిక శాస్త్రవేత్తగా రాజకీయ నేతగా సంఘసంస్కర్తగా విభిన్న పాత్రలు పోషించిన గొప్ప మహానుభావుడైన అంబేద్కర్ అని తెలిపారు. ప్రొఫసర్ కంచు ఐలయ్య మాట్లాడుతూ అంబేద్కర్ కు విగ్రహాలే కాదు ఇకనుండి అంబేద్కర్ గుడులు నిర్మించాలని సూచిస్తూ విద్యార్థులకు గొప్ప మహనీయుని ఆశయ సాధనలో విద్యార్థి లోకం ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సినీ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్, పసునూరి రవీందర్, కొల్లూరి భరత్, నల్లిగంటి శరత్, రాజు నాయక్ ఫ్రాన్సిస్ డిఎస్పి, బోడ డిన్న, అన్నం సునీల్, భీమ్‌డ్రం కళాకారులు రాజేందర్ రామంచ బృందం,అంబేద్కర్ సంఘ నాయకులు దూడపాక నరేష్, నోముల నాగరాజు, చిట్యాల విద్యుత్ శాఖ ఎడిఇ సందీప్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గుమ్మడి శ్రీదేవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, కార్యదర్శి గద్దం కొమురయ్య, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డికిష్టయ్య, చిలుకల రాయకుమురు, టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్ గౌడ్, చిట్యాల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుమార్, నల్ల రాజిరెడ్డి, మెరుగు సంపత్, అంబేద్కర్ వాదులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు

**ప్రజా పక్షం/ నల్లగొండ టౌన్:** కాంగ్రెస్ పార్టీలో నాయకునిగా ఎదిగేందుకు యువజన కాంగ్రెస్ పునాది లాంటిదని నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు.నల్లగొండ నియోజక వర్గంలో యూత్ కాంగ్రెస్ నుంచి ఎన్నికైన నూతన కమిటీకి గురువారం పట్టణంలోని ఓ హోటల్లో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి యువజన కాంగ్రెస్ వెన్నుముక్కలాటిదని అన్నారు. మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, గడ్డం అనూప్ రెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపట్టే కార్యక్రమాలలో యువజన కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా భాగస్వాములై విజయవంతం చేయాలని అన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన యువజన కాంగ్రెస్ నల్లగొండ నియోజకవర్గ అధ్యక్షుడు మామిడి కార్తీక్, పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, జహంగీర్ బాబా,మండల అధ్యక్షుడు కెవిఆర్ సతీష్, బద్దం సుధీర్, కె.వి.ఆర్ పవన్ కుమార్ లను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కత్తుల కోటి, జూలకంటి సైదిరెడ్డి, కూసుకుంట్ల రాజిరెడ్డి,పాదం అనిల్, కంచర్ల ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రవాణరంగ కార్మికులకు సంక్షేమ బోర్డు




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** అసంఘటితరంగంలో పనిచేస్తున్న లార, ఆటో, ట్రాక్టర్స్, కారు కార్మికులందరికి సామాజిక సంక్షేమ బోర్డు ఏర్పాటుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని తెలంగాణ పబ్లిక్,ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్ పెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్, సిఐటియు అనుబంధ సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జిల్లా కమిటి సమావేశంలో ఆయన మాట్లాడారు. వస్తువులను ఒక చోట నుండి మరొచోటకు వదిలేయడంలో, ప్రజలను వారి గమ్యస్థానాలకు తీసుకపోవడంలో రావాణ రంగం కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. ట్రాన్స్‌పోర్టు కార్మికులు ప్రభుత్వాల నుండి ఎలాంటి ప్రయోజనం పొందడంలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారని, నిత్యావసర సరుకుల ధరలు పెరగడం వల్ల కుటుంబాలను పోషించుకో లేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సట్టు యాదగిరి, నాయకులు సాయికుమార్, బచ్చలకూర స్వరాజ్యం, వట్టె యర్రయ్య, నీలా రామ్మూర్తి, జూలకంటి కిషోర్‌కుమార్, వజ్జె సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

## శివప్రసాద్‌కు 'చేంజ్ మేకర్స్ అవార్డు'



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** స్వచ్ఛభారత్, మిషన్‌లో భాగంగా స్వచ్ఛత కార్యక్రమాలు, స్వచ్ఛ సర్వేక్షన్‌లో మెరుగైన ప్రదర్శన, ప్లాస్టిక్ వ్యర్థాలతో టైల్స్, బ్రిక్స్, మ్యాట్లు, ఇతర వస్తువుల తయారు చేయడం కేంద్ర ప్రభుత్వం అదేశాలకు అనుగుణంగా స్వచ్ఛ కార్యక్రమాలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ఉత్తమ ప్రతిభను క నబర్చిన మున్సిపాలిటిలకు సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్, మోహా సంయుక్తంగా డిల్లీలో 19న నిర్వహించిన సిల్వర్ హాక్ హాల్‌లో ఏర్పాటు చేసిన చేంజ్ మేకర్స్ కార్యక్రమంలో సిఎస్ఇ డైరెక్టర్ డాకర్ట్ సునిత సరైన్ చేతుల మీదుగా సూర్యాపేట పురపాలక సంఘం ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ చిప్పలపల్లి శివప్రసాద్ చేంజ్ మేకర్ అవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా చేంజ్ మేకర్ అవార్డు సూర్యాపేటకు రావడం పట్ల మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు.

## బిసిలు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** బిసిలు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక బిసిలకు నామినేటెడ్ పోస్టులలో తీవ్ర అన్యాయం జరుగుతుందని బిసి సంఘం నేత లింగయ్యయాదవ్ అన్నారు. గురువారం బిసి యువజన సంఘం అధ్యక్షునిగా మల్లేష్ యాదవ్‌ను నియమిస్తూ నియామకపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న బిసిలకు మంత్రి పదవులు, ఎమ్మెల్సీలు, కార్పోరేషన్లు, మార్కెట్ కమిటి చైర్మన్లు పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో గాంధీభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోలోజు మహేష్‌చారి, విద్యార్థి సంఘం కన్వీనర్ భయ్య రాజేష్, పరాల సాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాపక్షం/కోదాడ:** నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జాక్టో, ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని సిసిరెడ్డి పాఠశాలలో జరుగుతున్న జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌ను సందర్శించి ఉపాధ్యాయులతో కలిసి మాట్లాడారు. ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్నందుకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. గతంలో ఎన్నో ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించానని, ఇక ముందు వివిధ సమస్యలపై పోరాడతానని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెండింగ్ బిల్లుల మంజూరు, మెరుగైన పిఆర్సీ, పెండింగ్‌లో ఉన్న డిఎలు మంజూరు చేయించడం,ప్రతి సంవత్సరం బదిలీలు, ప్రమోషన్లు జరిపించడం, సిపిఎస్ రద్దు కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జాక్టో నాయకులు ఓరుగంటి నాగేశ్వరరావు, బంధం వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్, కె. శ్రీనివాసనాయుడు, రూప్లానాయక్, బిఆర్‌సిరెడ్డి, భూపతి, శ్రీనివాస్, నాగయ్య, కిరీటం, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# వేగంగా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు పరిశీలన

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/ (నల్లగొండ) టౌన్:** ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 18004251442 కు ఫోన్ చేసి తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆమె అన్నారు. గురువారం ఆమె నల్లగొండ జిల్లా, పెద్దవూర మండలం బట్టు గూడెం, పెద్దఊర మండల కేంద్రాలలో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని తనిఖీ చేశారు.ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి ప్రజలు, సర్వే బృందాలకు సర్వే సందర్భంగా ఏవైనా సందేహాలు తలెత్తినా లేదా సాఫ్ట్ వేర్ సమస్యలు ఉత్పన్నమైనట్లయితే తక్షణమే టోల్ ఫ్రీ నెంబర్ కు తెలియజేయాలని, అలాగేఈ జిల్లా మేనేజర్ కు తెలియజేసి వాటిని అధిగమించాలని చెప్పారు. చిన్న చిన్న సమస్యలను స్థానిక ఎంపిడిఓ, మండల ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. దరఖాస్తుదారు లేని సమయంలో పాక్షికంగా అప్‌లోడ్ చేయాలని, దరఖాస్తుదారుకు సమాచారం అందించి వారు అందుబాటులో ఉన్నప్పుడు ఫోటోతో సహా పూర్తి డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలని సర్వే బృందాలకు సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సర్వే సందర్భంగా దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసిన దరఖాస్తుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి అప్‌లోడ్ చేసిన వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించారు. గృహ నిర్మాణ శాఖ పీడి రాజకుమార్, పెద్దవూర ఎంపిడిఓ ఉన్నారు.

### నల్లగొండ ఐటి టవర్ ఉద్యోగులకు శిక్షణ

నల్లగొండ ఐటి టవర్ ద్వారా ఉద్యోగులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పై శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా అన్నారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి హైదరాబాద్ రహదారిలో ఉన్న ఐటి టవర్ ను సందర్శించారు.నల్లగొండ ఐటి టవర్ చాలా బాగుందని, ఇక్కడ ప్రభుత్వ ఉద్యోగులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందుకుగాను ఉద్యోగులను గుర్తించడం తోపాటు, 20 బ్యాచ్ లు గా విభజించి శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ కు సూచించారు. అంతేకాక ఐటి టవర్ లో 500 మంది సాఫ్ట్ వేర్ ఉద్యోగులతో జపాన్‌కు చెందిన ఒక కంపెని తన కార్యకలాపాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఐ టి టవర్ లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరికరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ ద్వారా నివేదికలను త్వరితగతిన రూపొందించడమే కాకుండా, కంప్యూటర్ సాఫ్ట్వేర్ పనులు సులభతరం అవుతాయని ఆయన చెప్పారు.జిల్లా పరిశ్రమల మేనేజర్ కోటేశ్వరరావు, ఐటి టవర్ మేనేజర్ నాగరాజు, ఆర్డిఓ అశోక్ రెడ్డి ,స్థానిక తహసిల్దార్ శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ కార్యాలయ ఏఓ మోతిలాల్ తదితరులు ఉన్నారు.

# సర్వేల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

### విద్యార్థి సంఘాల ఆందోళన



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** సర్వేల్ గురుకుల పాఠశాలలో బుధవారం జరిగిన సంఘటనపై విద్యార్థి సంఘాలు గురుకుల పాఠశాల ముందు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. రాగి జావా వడ్డిస్తుండగా విద్యార్థి శివరాత్రి సామేల్ పై పడడంతో తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ సంఘటనకు బాధ్యులైన ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, బిఆర్ఎస్‌వి, బీజేవైఎం సంఘాల నాయకులు పాఠశాల ముందు ఆందోళనకు దిగారు. పాఠశాల ముందు ఉద్రిక్త వాతావరణం నెలకొంది విద్యార్థి సంఘాల నాయకులతో ఆర్డీవో శేఖర్ రెడ్డి మాట్లాడి ఈ సమస్యపై కలెక్టర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్‌ను విచారణ అధికారిగా నియమించారని తెలపగా ఉద్రిక్తత వాతావరణం సద్దుమణిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ తెలంగాణ యూనివర్సిటీల నాయకుడు రెహమాన్ మాట్లాడుతూ సంక్షేమ గురుకుల పాఠశాలలు సమస్యల సంక్షోభంలో కూరుకుపోయాయని, రాగి జావా పడి గాయాల పాలైన విద్యార్థి సామేల్ కు మెరుగైన వైద్యం అందించి. ఘటనకు కారకులైన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కలెక్టర్ డీఈవో వచ్చేంతవరకు ఆందోళన విరమించేది లేదనితెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కె.శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఎం నాయకులు శ్రీనివాసచారి, సిపిఎం మండల కార్యదర్శి దొడ యాదిరెడ్డి, బీజేపీ నాయకులు దోనూరు వీరారెడ్డి బిజెపి మండల అధ్యక్షులు సుర్వీరాజు, బి ఆర్ ఎస్ నాయకులు నరి నరసింహ, నలపరాజు రమేష్ పాల్గొన్నారు.

**గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెండ్..**

సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేష్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఉదయం రాగి జావా కాళ్ల మీద పడి శివరాత్రి సామేల్ అనే 8వ తరగతి విద్యార్థి తీవ్ర గాయాల పాలై హైదరాబాదులో నీ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో గురువారం విద్యార్థి సంఘాలు గురుకుల పాఠశాల ముందు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. అంతేకాకుండా పిల్లల తల్లిదండ్రులు కూడా ప్రిన్సిపాల్ వెంకటేశం వ్యవహార శైలిపై పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. బుధవారం జరిగిన ప్రమాదంలో ప్రిన్సిపల్ పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణమని జిల్లా కలెక్టర్ ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# వైజ్ఞానిక ప్రదర్శనలు పరిశోధనలకు నాంది పలకాలి

### సూర్యాపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ పి.రాంబాబు



**ప్రజాపక్షం/కోదాడ:** వైజ్ఞానిక ప్రదర్శనలు పరిశోధన రంగాలకు నాంది పలకాలని సూర్యాపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని సిసిరెడ్డి పాఠశాలలో సూర్యాపేట జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 52వ జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజానికి మనుగడ సైన్స్ అండ్ టెక్నాలజీ అని, సైన్స్ లేకపోతే మానవ జీవితమేలేదని, విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభిరుచిని పెంచుకుని లక్ష్యాలను సాధించాలన్నారు. విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిత్యత్ ఆధారపడి ఉంటుందన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలు కావాలని కలలు కంటున్నారని వారి కలలను సాకారం చేయాలన్నారు. ప్రతిష్టాత్మకంగా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌ను ఆయన అభినందించారు. జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులను విజ్ఞానశాస్త్రం పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఈ వైజ్ఞానిక ప్రదర్శన దోహదపడుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 23 మండలాల నుండి 84 ఇన్స్పైర్ అవార్డుల ప్రయోగాలు, 312 ప్రదర్శనలు, పలు పాఠశాలల నుండి ప్రదర్శనలు వచ్చాయని తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటుకు సహకరించిన ప్రజాప్రతినిధులకు,ఉపాధ్యాయ సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు విద్యార్థులు నిర్వహించిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. వైజ్ఞానిక ప్రదర్శన శుక్రవారం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్డీవో సూర్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి ఎల్.దేవరాజు, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, ఎంపీడీవో రామచందర్‌రావు, ఎంఇవోలు సలీంషరిఫ్, చాత్రునాయక్, కౌన్సిలర్ గంధం యాదగిరి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## అపురూప శిల్పాలను అందంగా పరిరక్షిస్తున్నాం

### పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి

**ప్రజాపక్షం/నందికొండ:** హిల్ కాలనీలో బస్టాండ్ కి వెళ్లే దారిలో గల శ్రీదేవి భూదేవి సమేత ఏలేశ్వర మాధవ స్వామి ఆలయ ప్రాంగణంలో కాకతీయుల కాలపు శిల్పకళాఖండాలు నిర్లక్ష్యంగా పడి ఉన్నాయని, వాటిని భద్రపరిచి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా, సీఈవో, డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. ఏలేశ్వర స్వామి ఆలయం వెనక 700 సంవత్సరాల నాటి భిన్నమైన నంది, ఆలయ ద్వారశాఖలు, విడిభాగాలు, ఇంకా రెండు సహస్ర లింగాలున్నాయని, వాటిని ప్రాంగణంలోనే పీఠాలపై నిలబెట్టి, చారిత్రక వివరాలతో పేరు పలకలను ఏర్పాటు చేస్తే, భక్తులు, పర్యాటకులు వాటి వివరాలు తెలుసుకునే వీలు కలుగుతుందన్నారు 195460 మధ్యకాలంలో నాగార్జునసాగర్ జలాశయ నీటి ముంపు ప్రాంతమైన ఏలేశ్వరం నుంచి వీటిని తరలించి ఇక్కడికి చేర్చారని, గత 65 ఏళ్లుగా ఇవి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నాయని, చారిత్రక ప్రాధాన్యత గల ఈ 13వ శతాబ్ది కళాఖండాలను భద్రపరిచి, భావితరాలకు అందించాలని ఆలయ అధికారులకు, నందికొండ హిల్ కాలనీ వాసులకు శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

## వాడవాడలా ఎర్ర జెండాలు ఎగరాలి



**ప్రజాపక్షం/దేవరకొండ:** 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా వాడవాడల ఎర్ర జెండాలను ఎగరవేయాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రమావత్ అంజయ్యానాయక్ పిలుపునిచ్చారు. బుధవారం దేవరకొండ మండలంలోని రేగళ్ల తండా గ్రామ శాఖ సమావేశం రామావత్ మోతిలాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అంజయ్యానాయక్ మాట్లాడుతూ దేశంలో 100 సంవత్సరాల ఉద్యమ పార్టీగా సిపిఐ ఖ్యాతి పొందందని, స్వాతంత్ర్యం కొరకు జరిగిన పోరాటంలో ఆనాడే అనేక మంది ఉరికంబాలు ఎక్కి ప్రాణ త్యాగాలు చేసిన వీర చరిత్ర కలిగిన సిపిఐ దేశ స్వాతంత్ర్యం కొరకు ఫ్యూడల్ సంస్థానాల విముక్తి కొరకు తాడిత, పీడిత జనావళి కొరకు వేలాది మంది ప్రాణాలను కొల్పోయిన ఏకైన పార్టీ సిపిఐ అని అన్నారు. ఉజ్వల చరిత్ర కలిగిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ 100 వసంతాల ఉత్సవాల ప్రారంభం సందర్భంగా నల్గొండ పట్టణంలో డిసెంబర్ 30న మధ్యాహ్నం 2 గంటలకు ప్రదర్శన, 3 గంటలకు ఎన్జీ కాలేజి గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభను దేవరకొండ నియోజకవర్గం నుండి ప్రజలు అధిక సంఖ్యలో సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, గ్రామశాఖ సభ్యులు రమావత్ వెంకట్రామ్, పాండు, వినోద్, జగన్, తిరుపతి, బుజ్జి, సోనీ, రత్న పాల్గొన్నారు.

### సిపిఐ భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సిపిఐ ఆవిర్భవించి డిసెంబర్ 26నాటికి వంద సంవత్సరంలోకి అడుగుపెడుతున్నందున ఈనెల 30న నల్లగొండలోని ఎన్‌జీ కళాశాలలో నిర్వహించే సీపీఐ పార్టీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో బహిరంగ సభ కరపత్రాన్ని ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. వంద వసంతాల సీపీఐ పార్టీ ఉత్సవాల సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ దామరచర్ల మండల కార్యదర్శి ఎండి.సయ్యద్, ధీరావత్ లింగానాయక్, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు ఎస్‌కె.సేమియం, ఎర్రబోతు పద్మ, గుమ్మకొండ అంజమ్మ, ఎండి.రహీం తదితరులు పాల్గొన్నారు.

### పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉండేది ఎర్రజెండా

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :**మున్సిపల్ కేంద్రంలో సిపిఐ పార్టీ 100 వసంతాల బహిరంగ సభ కరపత్రాన్ని సిపిఐ మాజీ ఎమ్మెల్యే ఉజ్జినీ యాదగిరిరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ 100 వసంతాల వారోత్సవాలను గ్రామ గ్రామాన పండుగ వాతావరణంలో నిర్వహించాలని పార్టీ శ్రేణులను కోరారు. పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉండేది ఎర్రజెండేనని అన్నారు. ఈ నెల 30న నల్లగొండ ఎన్జీ కాలేజీ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి, పట్టణ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, ఉడుత రామలింగం, పిల్లి శంకర్, కొండూరు విప్లవ్, రోండి నరసింహ, బద్దుల సుధాకర్, రెహమాన్ పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న యువకుడు అరెస్ట్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రాజశేఖర్ రాజు తెలిపారు. గురువారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్ల అనంతగిరి మండలం అమీనాబాద్ గ్రామానికి చెందిన సిరికొండ భానుప్రకాశ్ అనే యువకుడు గత కొంతకాలంగా మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటూ గంజాయి వ్యాపారం సాగిస్తున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల సమయంలో పట్టణంలోని బోటింగ్‌పార్క్ శివాలయం వద్ద గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకొంటుండగా ఒక వ్యక్తి సంచితో పారిపోతుండడంతో అతన్ని పట్టుకోని విచారించారు. భానుప్రకాశ్ చెడు వ్యసనాలకు బానిసై కోదాడకు చెందిన అఖిల్, డేంజర్ రాఘవలతో కలిసి ఒడిషా, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని కుర్మనూరు గ్రామంలో ఒక వ్యక్తి వద్ద 1.5కేజీల గంజాయిని కొనుగోలు చేసి దాన్ని 50 గ్రాములు, 100గ్రాముల ప్యాకెట్లుగా మార్చి హైద్రాబాద్‌లోని ధూల్‌పేట, పటాన్‌చెరు, గీతం కళాశాల, ఇబ్రహీం పట్నం సిద్ధార్థ కళాశాల వద్ద, మిర్యాలగూడ పట్టణంలో విక్రయించి లాభాలు ఆర్జించేవాడని తెలిపారు. కాగా నవంబర్‌లో కుర్మనూరుకు వెళ్లి ఒక వ్యక్తి వద్ద 2.5కిలోల గంజాయిని రూ.12500కొనుగోలు చేసి దానిలో 1.2కేజీలను తన ఇంట్లో భద్రపరుచుకున్నాడని అన్నారు. మిగిలిన గంజాయిని మిర్యాలగూడ పట్టణంలో విక్రయించేందుకు ప్రయత్నించగా పోలీసులు పట్టుకున్నారని అన్నారు. నిందితుడి నుంచి 1.3కేజీల ఎండు గంజాయి, మొబైల్, రూ.2400 నగదు స్వాధీనం చేసుకోని అతన్ని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. సమావేశంలో సీఐలు నాగార్జున, కరుణాకర్, ఎస్ఐ సుధీర్‌కుమార్, సిబ్బంది వెంకటేశ్వర్లు, తమీజొద్దిన్, వీరబాబు పాల్గొన్నారు.

# పేటలో కార్లు, బైకుల దొంగల అరెస్టు

### లిఫ్టు అడిగి మద్యం తాపించి దొంగతనాలకు పాల్పడిన వైనం
### ముగ్గురు దొంగల నుండి 16 బైకులు, రెండు కార్లు స్వాధీనం
### జిల్లా ఎస్పి సన్‌ప్రీత్‌సింగ్ వెల్లడి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** దారికాచి లిఫ్ట్ అడిగి , లిఫ్ట్ ఇచ్చిన వ్యక్తికి మద్యం తాపించి కొన్ని పార్కు చేసి పని చూసుకుని వచ్చేలోపు మరికొన్ని వాహనాలను దొంగిలించిన ముగ్గురు దొంగలను అదుపులోకి తీసుకుని వారి నుండి 16 బైకులు, రెండు కార్లు స్వాదీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. గురువారం పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సికింద్రాబాద్ ఇందిరమ్మ నగర్‌కు చెందిన కొరపాటి నర్సింగరావు, ఆంధ్రప్రదేశ్ మన్యం జిల్లా పార్వతిపురం మండలం బందలుప్పి గ్రామానికి చెందిన బాత ప్రసాద్ లు ఇద్దరు కలిసి కార్లను అద్దెకు తీసుకుని మర్గమద్యలో డ్రైవర్‌తో కలిసి మద్యం తాగి డ్రైవర్ మత్తులోకి వెళ్లగానే కార్లు దొంగతనం చేయడంతో పాటు, దారికాచి లిఫ్ట్ అడిగి అదును చూసి వాహనాలను ఎత్తుకెళ్లడం చేస్తుంటారని, ఇలా రెండు కార్లు, నాలుగు బైకులు దొంగతనం చేసినట్లు తెలిపారు. అక్టోబర్ 27న సూర్యాపేట పట్టణం బాలాజీనగర్‌కు చెందిన మద్రు వెంకటేశ్వరరావు విజయవాడ చదువుతున్న తన కుమార్తె వద్దకు తన ఎట్టిగా కారులో వెళ్తుండగా ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు లిఫ్ట్ అడగ్గా లిఫ్ట్ ఇచ్చిన వారితో మాటలు కలుపుకుని విజయవాడకు చేరుకున్నారు. తన కుమార్తెకు తినేందుకు కొనడానికి కార్డు స్టారింగ్‌లో పార్క్ చేసి వెళ్లి తిరిగి వచ్చేటప్పటికీ కారు కనిపించలేదని, లిఫ్టు ఇచ్చిన వారికి ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ రావడంతో సూర్యాపేట రెండవ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు. దీంతో విచారణ సాగిస్తున్న పోలీసులు ఈ నెల 18న అనుమానస్పదంగా తిరుగుతున్న నర్సింగరావును అదుపులోకి తీసుకుని విచారించగా వాహనాలను దొంగతనాలను పాల్పడినట్లు తెలిపారు. అతన్ని నుండి రెండు కార్లు, నాలుగు బైకులను స్వాదీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు తెలిపారు. నిందితుడు ప్రసాద్‌పై గతంలో విశాఖపట్నంలో రెండు కేసులున్నట్లు తెలిపారు. అదే విధంగా హుజూర్‌నగర్‌కు చెందిన గుంగ శ్రీకాంత్ కళాశాలలు, ఆసుపత్రుల వద్ద పార్కు చేసిన వాహనాలను నకిలీ తాళాలతో తీసి దొంగతనాలను పాల్పడుతుండగా ఈనెల 16న సూర్యాపేట పట్టణ రెండవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు విచారణ చేస్తున్న పోలీసులకు ఈనెల 18న కొత్త బస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పద స్థితిలో తిరుగుతున్న శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా బైకు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. నిందితుడు నుండి 12 కేసుల్లో 12 బైకులు స్వాదీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసుల పర్యవేక్షణలో పని చేసిన డిఎస్పీ రవి, పట్టణ ఇన్స్‌పెక్టర్ వీర రాఘవులు, ఎస్ఐ అంజనేయులు, ఏడుకొండలు, కుశలవ, సైదులు, టెక్నికల్ సిబ్బంది కరుణాకర్, కృష్ణ, శివ, సుధాకర్, రవి, మధులను ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

# పకడ్బందీగా 'ఇందిరమ్మ' సర్వే

## పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా జిల్లాలో ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం పెద్దపల్లి పట్టణం అమర్ నగర్ చౌరస్తా వద్ద 35వ వార్డులో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే పై దరఖాస్తుదారులకు ముందస్తు సమాచారం అందించాలని, ప్రజలు సైతం అవసరమైన డాక్యుమెంట్లను సిద్ధం చేసుకోని సర్వే కోసం వచ్చే ఎన్యుమరేటర్‌లతో సహకరించాలని సూచించారు. ప్రతిరోజు నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ఎన్యుమరేటర్‌లు ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు సర్వే పూర్తి చేయాలని, ప్రతి దరఖాస్తు ద్వారానే ఇంటికి వెళ్లి ప్రస్తుత స్థితి గతి తెలిసేలా ఫోటో యాప్‌లో అప్లోడ్ చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు రావడానికి వీలులేదని ఎన్యుమరేటర్‌లను కలెక్టర్ ఆదేశించారు. తనిఖీలలో జిల్లా కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### ప్రాథమిక విద్యను పటిష్ఠం చేసేందుకు కృషిచేయాలి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్య బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం పెద్దపెల్లి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన రివ్యూ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక విద్యను పటిష్ఠం చేసేందుకు ఉపాధ్యాయు కృషిచేయాలన్నారు. పాఠశాలలను సందర్శించినప్పుడు బోధన ప్రక్రియలో లోటుపాట్లు గమనించడం జరిగిందన్నారు. బోధన విధానంలో లోపాలను సవరించుకొని విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచినట్లయితే జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు ప్రోత్సాహక సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, జిల్లా సమగ్ర శిక్ష సమన్వయకర్త పిఎం షేక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు అన్ని సమయాల్లో అందుబాటులో పోలీస్ సిబ్బంది

## రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్




**ప్రజాపక్షం/గోదావరిఖని :** ప్రజలకు అన్ని సమయాల్లో అందుబాటులో ఉండి, విధులు సరిగ్గా నిర్వహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. గురువారం వార్షిక తనిఖీలో భాగంగా రామగుండం సర్కిల్ కార్యాలయం, ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్‌ను కమిషనర్ తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి డీసీపీ, ఏసీపీలతో కలిసి పోలీస్‌స్టేషన్ అవరణలో మొక్కలు నాటారు. రిసెప్షన్ సిబ్బంది పనితీరును, రికార్డులు పరిశీలించి, ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని అడిగారు. నేర విచారణ, సంఘటన నిరూపణలో తీసుకుంటున్న చర్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే అండర్ ఇన్విస్టిగేషన్‌లో ఉన్న సీడీ ఫైల్స్‌ను, పెండింగ్ ట్రయల్లో ఉన్న సీడీ ఫైళ్లను, గ్రేవ్ కేసులలో ఉన్న సీడీ ఫైళ్లను పరిశీలించారు. నిందితుల అరెస్టు, రౌడీ షీటర్ల వివరాలు, కోర్టులో ఉన్న కేసులు, వాటి దర్యాప్తు వివరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు ఎస్ఐలను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలన్నారు. ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకం కలిగించాలన్నారు. పెద్దపల్లి డిసిపి చేతన, గోదావరిఖని ఏసిపి ఎం.రమేష్, రామగుండం సిఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు సంధ్యారాణి, ఉదయ్‌కిరణ్‌లు ఉన్నారు.

# క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి

## అదనపు కలెక్టర్ వేణు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని, ప్రతిభను మెరుగుపరుచుతాయని పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణు అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సిఎం కప్ క్రీడాపోటీలు డివైఎస్ఓ సురేష్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ముస్త్యాల రవీందర్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్‌రావు హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్‌రావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ బిరుదు సమతాకృష్ణ, ఎమ్మార్వో మధుసూదన్‌రెడ్డి, ఎస్‌జిఎఫ్ జిల్లా కార్యదర్శి కొమ్మోజు శ్రీనివాస్, అధ్యక్ష కార్యదర్శులు వేల్పుల సురేందర్, దాసరి రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు రవి, ప్రణయ్, సంధ్య, లక్ష్మణ్, ఆసియా, క్రీడాకారులు గెల్లు మధుకర్, బైరగోని రవీందర్, ముస్తఫా, సంపత్, సత్యం ,ఇక్బాల్, శివ, ప్రవీణ్ పాల్గొన్నారు.



# సిఎం కప్ జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలలో సత్తాచాటిన క్రీడాకారులు



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** రాష్ట్రప్రభుత్వం క్రీడలను ప్రోత్సాహించేందుకు చేపట్టిన సీఎం కప్ 2024 క్రీడా పోటీల్లో భాగంగా జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన సిఎం కప్ బాక్సింగ్ పోటీలలో గొల్లపల్లి మండలానికి చెందిన ఆయా గ్రామాల క్రీడాకారులు గెలుపొంది పలు పథకాలతో సత్తా చాటారు. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గోవిందుల జస్వంత్ బంగారు పతకం, చేపూరి మోక్షిత బంగారు పథకం, గడప రిషిత్ వెండి పథకం సాధించారు. దమ్మన్నపేటకు చెందిన పాదం హర్షిత్ పటేల్ బంగారు పతకం, పాదం సాహిత్ పటేల్ బంగారు పథకం, రాజు కౌశిక్ కుమార్ వెండి పతకం, భూపతి భార్గవి బంగారు పతకం సాధించిన క్రీడాకారులు మండలాన్ని జిల్లా క్రీడా పథకాల వరుసలో అత్యుత్తమ స్థానానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులను డివైఎస్ఓ రవికుమార్, జగిత్యాల బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పాదం మహేందర్, గువ్వ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మహిపాల్, గోవిందుల జలపతి, సభ్యులు రాజు రాజేందర్ టిఆర్ఎస్వి కార్యదర్శి పాదం తిరుపతి ఆయా గ్రామాల పెద్దలు అభినందించారు.

# నాణ్యతతో మెనూ తప్పనిసరి

## జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** ప్రభుత్వ విద్యాలయాలు, అంగన్‌వాడీల్లో తప్పనిసరిగా నాణ్యతతో కూడిన మెనూను పాటించాలని ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష సూచించారు. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలంలోని అగ్రహారం, వెంకటాపూర్ గ్రామాలు, ముస్తాబాద్ మండలం ఆవునూర్‌లోని మండల పరిషత్, జిల్లా పరిషత్ విద్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆహార పదార్థాలు, నాణ్యతను పరిశీలించారు. స్టోర్ రూంలోని నిల్వ చేసిన పదార్థాలను తనిఖీ చేశారు. విద్యాలయాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను విద్యార్థులకు పెట్టాలని సూచించారు. ఆహార పదార్థాలు సిద్ధం చేస్తున్న పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. హెచ్ఎంలు అంగన్వాడీ కేంద్రాల బాధ్యులు పాల్గొన్నారు.

# మహిళల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

## కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతం ఇస్తుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్య మహిళ కార్యక్రమం కింద 54 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా అందిస్తున్నామని, మహిళలంతా వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ వైద్య పరీక్షలపై మహిళలకు, ఆశావర్కర్లు, ఎఎన్ఎంలు గ్రామగ్రామాన అవగాహన కల్పించాలన్నారు. గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కార్ఖానా గడ్డ సమీపంలో ఉన్న మెహతాజ్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలపై వైద్యాధికారి ఇమ్రాన్‌ను అడిగి తెలుసుకున్నారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారి వివరాలు, ఫలితాలు విధిగా నమోదు చేయాలని సూచించారు. గర్భిణులకు ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేయాలన్నారు. రోజువారీగా చేస్తున్న వైద్య పరీక్షలు, క్యాన్సర్ అవగాహన కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. ల్యాబొరేటరీ పరీక్షలు జాగ్రత్తగా చేయాలని, ఎక్కడ ఎలాంటి తప్పిదాలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. మహిళలు, రక్తహీనత లోపం బారిన పడకుండా పోషకాహారం తీసుకునేలా క్షేత్రస్థాయి సిబ్బందితో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని డిఎంహెచ్ఓ వెంకటరమణకు సూచించారు. ఆరోగ్య మహిళ కింద చేసే వైద్య పరీక్షల వివరాల బోర్డును ప్రతి ఆసుపత్రిలో ఏర్పాటు చేయించాలన్నారు. వైద్య సిబ్బంది సేవాభావంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు. ప్రతి మంగళవారం మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళలు ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యంగా ఉండవద్దని, ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఎంసిహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ సనా, సూపర్‌వైజర్ ఎంకె బేక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పెద్దాపూర్ గురుకులంలో భయంభయం

## ఒక విద్యార్థికి పాముకాటు, మరో విద్యార్థికి అస్వస్థత
## పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** జగిత్యాల జిల్లా, మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో మెట్ పల్లి పట్టణానికి చెందిన అఖిల్, గురుకుల పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయమే తనకు చేయి నొప్పి ఉందని ఉపాధ్యాయులకు చెప్పడంతో విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు, ప్రిన్సిపాల్, తల్లిదండ్రులు కలిసి కోరుట్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు, అయితే డాక్టర్లు పాముకాటుగా గుర్తించి చికిత్స అందిస్తున్నారని అఖిల్ తల్లిదండ్రులు రవి రుచిత తెలిపారు, అయితే ఆ ఘటనలు మరవక ముందే గురువారం అదే గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న మరో విద్యార్థి బోడ యశ్వంత్ అస్వస్థతకు గురికావడంతో పాఠశాల సిబ్బంది కోరుట్లలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. యశ్వంత్ ఆరోగ్యం నిలకడగా ఉండగా ఉందని డాక్టర్లు తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ కోరుట్ల ఆసుపత్రికి చేరుకొని విద్యార్థులు అఖిల్, యశ్వంత్‌లను పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుండి నేరుగా పెద్దాపూర్ గురుకుల పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. గురకుల పాఠశాల చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశీలించారు, ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొదలు, చెట్లు పెరగకుండా ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు, పాఠశాలలో హాస్టల్ గదులు, బెడ్స్ పరిశీలించారు. పాఠశాల ప్రాంగణం సురక్షిత ప్రాంతంగా ఉండేలా తీర్చిదిద్దాలని, ఎలాంటి విషసర్పాలు క్రిమి కీటకాలు రాకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తగా పర్యవేక్షిస్తుండాలని, విద్యార్థుల సురక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రథమ చికిత్స సంబందించిన వాటిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ప్రతి విద్యార్థి ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమాంలో మెట్ పల్లి ఆర్‌డిఒ శ్రీనివాస్, జిల్లా సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**పెద్దపూర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెండ్...** మెట్ పల్లి మండలం పెద్దపూర్ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలతను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సత్యప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులకు ప్రమాదం జరిగినా 108, జిల్లా ఉన్నత అధికారులకు సమాచారం ఇవ్వకపోవడం, పాఠశాల పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత ఉంచకపోవడంపై సస్పెండ్ చెసినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# 'గంగుల' క్షమాపణ చెప్పాలి

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దగ్ధం

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వెంటనే క్షమాపణ చెప్పాలని జిల్లా కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అసెంబ్లీ సాక్షిగా మంత్రి పొన్నంపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం పిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరాచౌక్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించి గంగుల దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎండి తాజ్, పులి ఆంజనేయులుగౌడ్, కొరివి అరుణ్ కుమార్, బానోతు శ్రావణ్ నాయక్, బోనాల శ్రీనివాస్, గడ్డం విలాస్ రెడ్డి, మునిగంటి అనిల్, కామెడ్డి రాంరెడ్డి, అబ్దుల్ రెహమాన్, మల్యాల సుజిత్ కుమార్, పడిశెట్టి భూమయ్య, అహమ్మద్ అలీ, మల్లిఖార్జున రాజేందర్, ఎలగందుల మల్లేశం, నేహాల్, సిరిపురం నాగప్రసాద్, ఎస్ఏ మోసిన్, కాశెట్టి శ్రీనివాస్, మహమ్మద్, అజీమ్, కోటగిరి పాల్గొన్నారు



# బాలికల గురుకుల కళాశాలకు గీజర్లు వితరణ



**ప్రజాపక్షం/చొప్పదండి :** చొప్పదండి పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల కళాశాలకు రెండు గీజర్లను మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ వితరణగా అందజేశారు. ఈ మేరకు పేరెంట్స్ కమిటీ సభ్యులుగా చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యంను కలిసి తమ పిల్లలు చలిలో స్నానాలు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారని, చలి విపరీతంగా ఉందని తెలుపగా ఆయన మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేష్‌ను విద్యార్థులకు గ్లీజర్లు అందజేయాలని ఆదేశించారు. వెంటనే ఆయన స్పందించి గురుకుల బాలికల విద్యార్థులకు రెండు గ్లీజర్లను అందజేశారు. గురువారం కళాశాల ప్రిన్సిపాల్ స్వాతికి రెండు గ్లీజర్లను అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు కొట్టె అశోక్, పెరుమాండ్ల మానస గంగయ్యగౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, నాయకులు బండారి రాజేష్ తదితరులున్నారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షకు ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి సంఘీభావం




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** సమగ్ర శిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు గత కొన్ని రోజులుగా తమ డిమాండ్లు పరిష్కరించాలని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు నరేందర్‌రెడ్డి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం న్యాయం చేస్తుందని, ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటుందన్నారు. ఉద్యోగులందరికీ న్యాయం జరిగే విధంగా వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు

## ఒపిల సంఖ్య పెంచడానికి సిబ్బంది కృషిచేయాలి
## అంధత్వ నివారణకు ప్రత్యేక క్యాంపులు
## సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి




**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి :** ప్రభుత్వ ఆసుపత్రిలో సాధరణ ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి సూచించారు. జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో గురువారం వైద్యాధికారులకు, ఆరోగ్య కార్యక్రమాలు, వివిధ సేవల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ జిల్లా వైద్యాధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిల్లో ఒపిల సంఖ్య పెంచాలని, వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాల్లో చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా పిల్లలకు, గర్భిణీలకు 100 శాతం టీకాలు అందే విధంగా చూడాలన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమం ద్వారా జిల్లాలో 85 శాతం ఒపి ఉందని, 70 శాతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు దృష్టి సారించి మరింత ఒపి పెంచాలన్నారు. ఈ సంజీవనిలో కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వెనుకబడి ఉన్నాయని, వాటిపై దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. మాతా శిశు సంక్షేమ కేంద్రాల్లో భాగంగా తల్లీబిడ్డలపై ప్రత్యేక శ్రద్ధ వహించి వైద్యసేవలు అందించాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు సంఖ్యను పెంచాలని, ఆరోగ్య మహిళ క్లినిక్ ద్వారా ప్రతి మంగళవారం చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కేంద్రానికి వచ్చిన మహిళల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో అంధత్వ నివారణకు చేపట్టే కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలోని 26 మండలాల్లో శంకర ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో క్యాంపులు నిర్వహించటం జరుగుతుందన్నారు. 3750క్యాట్రాక్ట్ సర్జరీలు అవసరం ఉన్నాయని, ప్రతి మండలంలో వీరందరికి సర్జరీలు అందించాలన్నారు. దీని కోసం క్యాంపుల నిర్వహణ తదితర ఏర్పాట్లు చేయనున్నట్లు, ప్రతి గురువారం మండలంలోని ఒక ప్రాంతంలో క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ పల్వన్ కుమార్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శ్రీనివాస్, ఆనంద్, అరుణ్‌కుమార్, శ్రీకళ, శ్రీకాంత్ యాదద్ పాల్గొన్నారు.

# అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** భారత రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్ అంబేద్కర్‌పై పార్లమెంటు సాక్షిగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలపై తక్షణమే ఆయనను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి నగర కాంగ్రెస్ ఆద్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంటులో అమిత్‌షా మాట్లాడుతూ అంబేద్కర్‌ను తలచే కంటే ఆ దేవుళ్లని తలిస్తే స్వర్గానికి పోతారంటూ వ్యాఖ్యానించి అంబేద్కర్‌ను అభిమానించే కోట్లాదిమంది దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల ప్రజల మనోభావాలను అవమానపరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతం కాదని, బిజెపి,ఆర్ఎస్ఎస్ మూల సిద్దాంతంలో భాగమేనన్నారు. అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేదాకా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, నియోజకవర్గ ఇంచార్జి పురమల్ల శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్, నాయకులు సమద్ నవాబ్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, అర్ష మల్లేశం, ఆకుల నర్సయ్య, గంట శ్రీనివాస్, కాశెట్టి శ్రీనివాస్, మెండి చంద్రశేఖర్, కుర్ర పోచయ్య, షబానా మహమ్మద్, ముల్కల కవిత, సలీం, జ్యోతి రెడ్డి, రజితా రెడ్డి, మెరాజ్, అస్తపురం తిరుమల, మహాలక్ష్మి, శెహెన్శ, అష్రాఫ్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌పై అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలి

## సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** అంబేద్కర్‌పై అవమానకరంగా మాట్లాడిన హోంమంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని సిపిఐ పక్షాన జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. గురువారం సిపిఐ కార్మిక భవనంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత షా పార్లమెంట్‌లో మాట్లాడుతూ పదే పదే అంబేద్కర్‌ను ఉచ్చరించడం ఎందుకని దేవుడిని ప్రార్థించిన స్వర్గానికి పోవచ్చని అవమానకరంగా మాట్లాడారని ఖండించారు. మనువాద పార్టీ అయిన బిజెపి పది సంవత్సరాలుగా అంబేద్కర్ ఆలోచనపై అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగంపై దాడిని కొనసాగిస్తూనే ఉందన్నారు. బిజెపి పాలకులు అంబేద్కర్ ఆలోచన అంటేనే భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. హిందూయిజాన్ని అడగడుగునా అంటగాగుతున్న బిజెపి విధానాలను ఎండకట్టాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రాసి రిజర్వేషన్లతో ఓటు హక్కును అనేక చట్టాలను రాయడంలో చివరికి ఆయన కుటుంబం సైతం త్యాగం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు సోమ నాగరాజు, అజ్జ వేణు, కిషోర్, తదితరులు ఉన్నారు.

### అమిత్‌షా వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి
### సిపిఐ జిల్లా కార్యదర్శి సదానందం

**పెద్దపల్లి ప్రతినిధి :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై కేంద్రహోంమంత్రి అమిత్ షా వేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని భేషరతుగా క్షమాపణ చెప్పాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమిత్ షా రాజ్యసభలో చేసిన వ్యాఖ్యల్ని ఉపసంహరించుకుని దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌కు, ఆయన సిద్ధాంతాలకు బిజెపి వ్యతిరేకమని మండిపడ్డారు. సంఘ్ పరివార్ అంబేద్కర్ ప్రధాన పాత్ర పోషించి రూపొందించిన భారత రాజ్యాంగం మీద ఇసుమంత గౌరవం కూడా లేదని అనేకసార్లు రుజువైందన్నారు. ఇప్పటికైనా అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



### కేంద్ర హోంశాఖ మంత్రిని తొలగించాలి
### కొయ్యడ సృజన్ కుమార్

**కరీంనగర్ ప్రతినిధి :** భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌పై పార్లమెంటు సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తక్షణమే క్షమాపణలు చెప్పాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై దాడి అంటే రాజ్యాంగంపై దాడిగానే దేశంలోని ప్రతి పౌరుడు భావించాలన్నారు. అతని వ్యాఖ్యలను సుమోటాగా తీసుకుని అమిత్‌షా పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని మంత్రి పదవి నుంచి తొలగించాలన్నారు. భారత పార్లమెంటు చరిత్రలోనే ఇది చీకటి రోజు అని, బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ నిర్మాతపై వ్యంగ్యంగా అనుచితంగా మాట్లాడడం హేయమైన చర్య అన్నారు. బిజెపి తన మనువాద ధోరణిని మరోసారి పార్లమెంటు సాక్షిగా చూపిందన్నారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను అమిత్‌షా వెనక్కి తీసుకుని దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో దేశ వ్యాప్తంగా ప్రజా సంఘాల ఆద్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## హైస్కూల్‌ను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్



ప్రజాపక్షం/నిజాంసాగర్: నిజాంసాగర్ మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి గురువారం తనిఖీ చేశారు. ఈ పాఠశాలలో గత 15 రోజులుగా మధ్యాహ్న భోజనం పంపిణీ నిలిచిపోవడాన్ని తెలుసుకున్న ఆమె మధ్యాహ్న భోజనం పంపిణీ నిలిచిపోవడానికి గల కారణాలను క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు. భోజనం తయారు చేసేందుకు నిర్వాహకులు ఎవరూ ముందుకు రావడం లేదని తెలుసుకుని, గతంలో నిర్వహించిన ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం పంపిణీని పునః ప్రారంభిస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, రుచికరంగా, వేడివేడిగా అందించాలని ఆమె నిర్వాహకులను ఆదేశించారు. అదేవిధంగా విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. ఆమె వెంట నిజాంసాగర్ తహసీల్దార్ బిక్షపతి, మండల ప్రజాపరిషత్ అధికారి గంగాధర్, ఎంఈఓ తిరుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాంచెందర్, ఉపాధ్యాయులు వెంకటేశం తదితరులున్నారు.

## కేంద్ర మంత్రి అమిత్‌షా బేషరుతుగా క్షమాపణ చెప్పాలి



ప్రజాపక్షం /సదాశివపేట: కేంద్ర మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై అవమానకర వాఖ్యలు చేయడంపై నిరసనగా సదాశివపేటలో గురువారం అమిషా దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి వినోద మాట్లాడుతూ అంబెద్కర్ వ్రాసిన రాజ్యాంగం వలన భారత దేశం గత 75 సంవత్సరాలుగా అన్ని రంగాల్లో ఎంతో ప్రగతి సాధించిందన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వలన దేశ ప్రజలందరికి సమాన హక్కులను కల్పించిందన్నారు. కుల,మతాలకతీతంగా అందరు కలసి మెలసి ఉండడానికి కారణం భారత రాజ్యాంగమని కొనియాడారు. భారత దేశ ప్రజలందరూ బాబా సాహెబ్ అంబెద్కర్ సిద్దాంతాలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం తాజుద్దీన్, షఫి అహ్మద్, శంకరమ్మ, ముస్తాఫా, జ్యోతి , వెంకట్ గౌడ్, పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి



ప్రజాపక్షం/శ్రీరాంపూర్: సింగరేణిలో శాశ్వత ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికులు సైతం సంస్థ అభివృద్ధి కోసం తమ రక్తాన్ని చెమటగా మార్చి పాటుపడుతున్నారని, వారికి సముచిత స్థానాన్ని కల్పించాలని (ఎస్ సిసిడబ్ల్యుఐఎఫ్‌టియు) సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి. బ్రహ్మానందం అన్నారు. గురువారం శ్రీరాంపూర్ లోని కృష్ణకాలని సివిల్ కార్యాలయం వద్ద సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ప్ల కార్డ్స్ తో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వైఫల్యం చెందిందని ఆరోపించారు. నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 19, 20, 21వ తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు ప్ల కార్డ్స్ తో నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను గత పది సంవత్సరాలుగా బిఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కిరణ్, ఈశ్వర్, రాజయ్య, తిరుపతి, శ్రీనివాస్, గౌరమ్మ, భుదమ్మ, హంస, మేరీ, రాజేశ్వరి, లక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న నిజాంసాగర్ పోలీసులు



ప్రజాపక్షం/నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చిన వ్యక్తి ప్రయత్నాన్ని నిజాంసాగర్ పోలీసులు అడ్డుకున్నారు. ఏఎస్సై రాజేశ్వర్ తెలిపిన కథనం ప్రకారం నిజాంపేట్‌కు చెందిన ఆంజనేయులు తన భార్య తనకు విడాకులు ఇచ్చిందని జీవితంపై విరక్తి చెంది నిజాంసాగర్ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నిస్తుండగా ప్రాజెక్టు సిబ్బంది శ్రీశైలం ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటీనా ప్రాజెక్టు వద్దకు చేరుకున్న ఏఎస్సై రాజేశ్వర్ ఆంజనేయులును కాపాడారు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసుల సేవలను అభినందించారు.

## డిపో ఆవరణలో మొక్కలు నాటిన ఆర్‌టిసి ఆర్ఎం జ్యోత్స్న

ప్రజాపక్షం/బాన్సువాడ : బాన్సువాడ ఆర్‌టిసి డిపోను గురువారం రీజినల్ మేనేజర్ జ్యోత్స్న సందర్శించి డిపోలోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డిపో నడుపుతున్న సర్వీస్ వివరాలను ఆమె డిపో మేనేజర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిపోఆవరణలో మొక్క నాటి నీరుపోశారు. కార్యక్రమంలో డిప్యూటి ఆర్ఎం సరస్వతి, డిపో మేనేజర్ సరితా దేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షల ఫీజు ఈనెల 30లోగా చెల్లించాలి

ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటిలో 2015, 2026 లేదా ఆ లోపు అడ్మిషన్ తీసుకున్న, పరీక్షలో ఫెయిల్ అయిన పూర్వ నాన్ సెమిస్టర్ (ఇయర్ వైజ్) విద్యార్థులు ఎలాంటి అపరాద రుసుం లేకుండా ఈనెల 30లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని కాగజ్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, కోర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025 జనవరి 4వ తేదీ వరకు రూ. 500 అపరాద రుసుంతో ఫీజు చెల్లించవ్చని తెలిపారు. అదే విధంగా సైన్స్ విద్యార్థులు ప్రాక్టికల్ ఫీజు అదనంగా చెల్లించాలని తెలిపారు. ఇతర వివరాల కోసం 9494314314, 9866398678 లేదా 7382929651 సెల్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

# పక్కాగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

### కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్: ఇందిరమ్మ ఇళ్ళ సర్వేను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని భాగ్యనగర్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. సర్వేయర్లు దరఖాస్తు దారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తున్న తీరును పరిశీలించారు. మొబైల్ యాప్‌లో నమోదు చేసిన వివరాలు దరఖాస్తుదారుల వాస్తవ వివరాలతో సరిపోయాయా లేదా అన్నది గమనించి, అధికారులకు పలు సూచనలు చేశారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, దరఖాస్తుదారుల స్థితిగతులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తూ, పూర్తి సమాచారాన్ని సేకరించి మొబైల్ యాప్ లో పొందుపరచాలని తెలిపారు. దరఖాస్తు దారులు ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి ఫోటోతో పాటు వారి ఫోటోను, స్వంత ఇల్లు అయితే నిర్ధారిత డాక్యుమెంట్లు కానీ, ఇంటి పన్ను చెల్లించిన రసీదు లను యాప్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. సొంత ఇల్లు నిర్మించుకునేందుకు దరఖాస్తుదారు చూపిన స్థలం, దాని డాక్యుమెంట్లను యాప్‌లో పొందుపర్చాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా ఈ నెలాఖరులోగా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, తహసిల్దార్ రాజు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్‌పి



ప్రజాపక్షం/శివ్వంపేట: గ్రామాలలో అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు గురువారం శివ్వంపేట పోలీస్ స్టేషన్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో, పోలీస్ స్టేషన్ లలో ఉన్న సీసీ కెమెరాల పనితీరును మరింత మెరుగు పరచాలని ఆయన సిబ్బందికి సూచించారు. శాంతి, భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన అన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిదిలోని కేసుల వివరాలను అడిగి తెలుసుకుని, పలు రికార్డులను ఆయన పరిశీలించి పలు సూచనలు అందజేశారు. ఈకార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి, సీఐ రంగ కృష్ణ, శివ్వంపేట ఎస్ఐ మధుకర్ రెడ్డి, తూప్రాన్ ఎస్ఐ సదానందం, హెడ్ కానిస్టేబుల్ సాయిలు, దేవదాసు, కానిస్టేబుల్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని పట్టణంలోని నాందేవ్‌వాడ బీసీ బాలుర సంక్షేమ వసతిగృహంలో రవాణాశాఖ, రక్షణశాఖ సంయుక్త సమన్వయంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, బీసీ సంక్షేమశాఖ అధికారి స్రవంతి, అసిస్టెంట్ మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు అసిస్టెంట్ బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నర్సయ్య, ఐడార్ జిల్లా మేనేజర్ వర్షా హాజరయ్యారు. వసతిగృహ బాలురకు రోడ్డు భద్రతపై అనేక సూచనలు, సలహాలు మౌఖికంగా వీడియోల రూపంలో అందజేశారు. కార్యక్రమంలో వసతిగృహ అధికారులు రాజు, బాలకృష్ణ పాల్గొన్నారు.

# జ్యోతిబాపూలే పాఠశాలను కలెక్టర్ తనిఖీ



ప్రజాపక్షం/నిజామాబాద్/మోర్తాడ్: నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో గల మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఏకీకృత ఆహార ప్రణాళికలను పర్యవేక్షించి, పరిసర ప్రాంతాలను పరిశీలించి అక్కడ విద్యార్థులతో ముచ్చటించారు. అలాగే వంట శాలలోని వంటలు పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులను త్రికోణమితి, భారత విభజన, తెలుగు సాహిత్యం, వంట విషయాలపై ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం కోసం భోజన ప్రణాళిక, ఆహార నాణ్యత, సరుకుల నిల్వలను పరిశీలించారు. అలాగే పాఠశాలలోని డ్రైనేజీ, వ్యవస్థ క్రీడా స్థలం, కూరగాయల తోటలను పరిశీలించారు. పాఠశాల పరిశుభ్రత, పచ్చదనం పరిరక్షణను ప్రశంసిస్తూ విద్యార్థులు చదువులో ముందుకు వెళ్లాలని ప్రేరణ కల్పించారు. ఈ కార్యక్రమంలో మోర్తాడ్ తహసీల్దార్ సత్యనారాయణ, ఎంఆర్ఐ రంజిత్, ఎంపీడీవో తిరుమల, ఎంపీఓ శ్రీధర్, నిజామాబాద్ జిల్లా సమాచార శాఖ అధికారి పద్మ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

**పక్కాగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే**

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. మోర్తాడ్ మండల కేంద్రంలో, వొడ్యాట్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను కలెక్టర్ గురువారం పరిశీలించారు. సర్వేయర్లు దరఖాస్తు దారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తున్న తీరును పరిశీలించారు. మొబైల్ యాప్‌లో నమోదు చేసిన వివరాలు దరఖాస్తుదారుల వాస్తవ వివరాలతో సరిపోయాయా లేదా అన్నది గమనించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీఓ రాజుగౌడ్, ఎంపీడీఓ తిరుమల, తహసీల్దార్ సత్యనారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ ఉన్నారు.

# నేటి నుండి పాఠశాలల సమయం మార్పు

### కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



ప్రజాపక్షం/ఆసిఫాబాద్: ప్రస్తుతం నెల కొన్న వాతావరణం, విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా ఉపాధ్యాయ సంఘాల నాయకులు అందించిన ప్రాతినిధ్యం ప్రకారం ఈ నెల 20 నుండి పాఠశాలల సమయంలో మార్పు చేసినట్లు జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4:15 గంటల వరకు కొనసాగుతున్న పాఠశాలల సమయం నూతన సమయం ప్రకారం ఉదయం 9:40 నిమిషాల నుండి సాయంత్రం 4:30 వరకు కొనసాగుతాయని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు, ప్రైవేట్ యాజమాన్యాలకు క్రింద నిర్వహిస్తున్న పాఠశాలలు నూతన సమయ పాలన పాటించాలని, మండల విద్యాధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పని చేసి నూతన సమయాన్ని అమలు చేయాలని తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఇదే సమయం కొనసాగుతుందన్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు ఇప్పించాలి



ప్రజాపక్షం/బోథ్: మండలంలోని వివిధ గ్రామ పంచాయితీ లలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు గత నాలుగు నెలల నుంచి వేతనాలు రావడం లేదని వారి వేతనాలు వెంటనే ఇప్పించాలని కోరుతూ గురువారం స్థానిక ఎంపిడిఓ రమేష్ కు వినతి పత్రం అందజేశారు. వేతనాలు రాకపోవడంతో ఆర్థిక భారం పడటంతో పాటు ఇల్లు గడవడం కష్టంగా మారిందని వాపోయారు. ఈ విషయంలో తగు చొరవ చూపించి వేతనాలు అందే విధంగా చూడాలని కోరారు. ఈ వినతి పత్రం సమర్పించిన వారిలో పారిశుద్ధ్య కార్మికుల సంఘం అధ్యక్షులు కలిగేటి గంగయ్య, కార్మిదర్శి సాగర్ తో పాటు ధన్నూర్ గ్రామ పంచాయితీ కార్మిక సంఘం అధ్యక్షులు జైపాల్ పలు గ్రామాల పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో రాణించాలి

### కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం/ నస్పూర్: సిఎం కప్ 2024 పోటీలలో భాగంగా కొనసాగుతున్న జిల్లా స్థాయి క్రీడా పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు పోటీలలో రాణించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో కొనసాగుతున్న జిల్లా స్థాయి క్రీడా పోటీలను జిల్లా యువజన క్రీడాభివృద్ధి అధికారి కీర్తి రాజ్ వీరు, షెడ్యూల్డ్ కులాల కార్పొరేషన్ ఈ.డి. దుర్గాప్రసాద్, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరితో కలిసి హాజరై క్రీడాకారులతో చదరంగం పోటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సి.ఎం. కప్ 2024 పోటీలను జిల్లాలో విజయవంతం చేసే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. క్రీడా పోటీల నిర్వహణ కొరకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందని, జిల్లా స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఈ నెల 27వ తేదీ నుండి జనవరి 2, 2025 వరకు రాష్ట్ర స్థాయిలో జరగనున్న పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని, జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. క్రీడలతో ఆరోగ్యంగా ఉండడంతో పాటు విద్య, ఉపాధి రంగాలలో రాణించేందుకు ఏకాగ్రత పెంపొందుతుందని, జీవితంలో ఎంచుకున్న ఉన్నత స్థానానికి ఎదిగేందుకు దోహదపడుతుందని అన్నారు. క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకుని క్రీడా స్పూర్తితో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, శిక్షకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పక్షాన బిజెపి పోరాటం..



ప్రజాపక్షం/బైంసా: కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది గడిచినప్పటికీ,రైతులకు పెట్టుబడి సహాయం కింద ఎకరానికి 15వేల రూపాయలు రైతు భరోసా ఇవ్వకపోవడం, రెండు లక్షల పైన ఉన్న వారికి రుణమాఫీ చేయకపోవడంతో బిజెపి ఎమ్మెల్యేలు రైతుల పక్షాన తమ పోరాటాన్ని ప్రారంభించారు. ఎడ్లబండ్లపై అసెంబ్లీకి వెళ్లి వారు రైతుల సమస్యలపై గళమెత్తారు.ఈ సందర్భంగా ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ రైతాంగ సంక్షేమమే ధ్యేయమంటూ గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ రైతులకు శాపంగా మారిందన్నారు. రైతు భరోసా ఇవ్వకపోవడంతో రైతులు వడ్డీ వ్యాపారుల బారిన పడి అప్పుల పాలవుతున్నారన్నారు. కాంగ్రెస్ సర్కార్‌కు రైతుల ఉసురు తగులు తుందన్నారు.వ్యవసాయ కార్మికులకు ప్రతి సంవత్సరం 12 వేల రూపాయలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు నేరవేర్చకుండా కల్లిబొల్లి మాటలతో కాలయాపన చేయడం కాంగ్రెస్‌కు అలవాటైందన్నారు. బిజెపి ఎమ్మెల్యేలు పాయల శంకర్, రాకేష్ రెడ్డి, పాల్వాయి హారీష్ బాబు ఉన్నారు.

# సఫాయి కార్మికుల సమస్యల పరిష్కారంపై అధికారుల దృష్టి



ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి: జిల్లాలోని సఫాయి కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలని జాతీయ కర్మచారి కమిషన్ చైర్మన్ ఎం వెంకటేష్ జి అన్నారు. సంగారెడ్డి సమావేశమందిరంలో గురువారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి జిల్లాలలోని సఫాయి కార్మికులతో సమావేశమయ్యారు. వివిధ కార్పోరేషన్ల ద్వారా సఫాయి కార్మికులకు ప్రభుత్వ పథకాలను అమలు చేసి వారి కుటుంబ సభ్యులకు స్వయం ఉపాది పథకాల ద్వారా ఋణాలు ఇప్పించి ఉపాది కల్పించాలని సపాయి కమిషన్ చైర్మన్ అధికారులకు సూచించారు. జిల్లాలోని మున్సిపల్ సఫాయి కార్మికులకు నెల రోజుల్లోగా ఐడెంట్ కార్డులు, ఈపీఎఫ్ ఖాతా నెంబర్లు అందించాలని సంబందింత అధికారులను అదేశించారు. సపాయి కార్మికుల సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. కార్మికుకు సెఫ్టీ కిట్స్, మాస్కులు సబ్బులు, అయిల్ షూ గ్లౌజులు , యూనిఫాం, తదితర సామాగ్రిని నిబందనలకు అనుగుణంగా అందించాలని అధికారులకు సూచించారు. సపాయి కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 01124648924కు పిర్యాదు చేసి తమ సమస్యల పిర్యాదులను నమోదు చేసుకొని పరిష్కరించుకోవచ్చని ఈసందర్బంగా సఫాయి కమిషన్ చైర్మన్ సూచించారు. సఫాయ కార్మికులు అపరిశుభ్ర వాతావరణంలో పని చేస్తున్నాందున సంవత్సరానికి రెండు సార్లు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య చికిత్సలు అందేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ అదికారులను కమిషన్ చైర్మన్ అదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అడిషనల్ ఎస్పీ సంజీవరావు, ట్రైనీ కలెక్టర్ మనోజ్, డిఆర్ఓ పద్మజరాణి, జగదీష్, పాల్గొన్నారు.

## బస్టాండ్ పరిరక్షణకు కృషి



ప్రజాపక్షం/బోథ్: అన్యాక్రాంతమవుతున్న బోథ్ బస్టాండ్ పరిసరాలను, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని వాటిని రక్షించదానికి చర్యలు చేపడుతున్నామని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. స్థానిక బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో బస్టాండ్ ప్రహరి గోడ లేకపోవడం, ప్రయానణికులకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని వాటిని జిల్లా ఇంచార్జి మంత్రి దృష్టికి, రవాణా శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్ళి సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని అన్నారు. అందులో భాగంగానే బస్టాండ్ డిజిటల్ మ్యాప్ ఆధారంగా ప్రహరి కోసం కొలతలు సేకరించారు.

# ప్రజల ప్రాణాలతో చెలగాటమా?

### జనావాస ప్రాంతంలో పత్తిమిల్లు నిర్వహణ
### రోగాల బారిన పడుతున్న సమీప వాసులు



ప్రజాపక్షం/చెన్నూరుటౌన్: జనావాస ప్రాంతంలో నిర్వహించే పత్తిమిల్లు నుండి వెలువడే ప్రమాదకరమైన ధూళితో రోగాల భారినపడుతూ, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్న తమను ఆదుకోవాలని ప్రజలు అర్థనాధాలు పెడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రజారోగ్యాల దృష్ట్యా జనవాస ప్రాంతాలకు దూరంగా మిల్లులు నిర్వహించాలనే ప్రభుత్వ నిభందనలు ఉన్నప్పటికీ, చెన్నూరు మండలం కిష్టంపేట గ్రామంలోని ఎల్లక్కపేటలో ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి పత్తిమిల్లు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడుతున్నట్లు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. తమ కాలనీ సమీపంలో నిర్వహిస్తున్న పత్తిమిల్లు నుండి వచ్చే ప్రమాదకరమైన ధూళి కారణంగా ఏళ్ల తరబడి తీవ్ర అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రతీ ఏటా పత్తిమిల్లు నిర్వహించే నాలుగు నెలల కాలంలో తమ పిల్లలను సైతం ఊరికి దూరంగా తమ బంధువుల ఇళ్లలో ఉంచాల్సిన దుస్థితి నెలకొంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తిమిల్లు కారణంగా తాము పడుతున్న అవస్థలను గ్రామ స్థాయి, మండల స్థాయి, జిల్లా స్థాయి అధికారులకు విన్నవించినప్పటికి వారు నిర్లక్ష్యధోరణి వహిస్తూ, తమ గోడు పట్టించుకోవడం లేదని, ప్రజల ప్రాణాలంటే కనీసం అధికారులకు లెక్కలేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పత్తిమిల్లు నిర్వహణను నిలిపి వేసి, జనావాస ప్రాంతానికి దూరంగా ఏర్పాటు చేసుకునేలా చేసి, మిల్లు నుండి వచ్చే ధూళి భారి నుండి తమను కాపాడాలని భాదితులు కోరుతున్నారు.

**రోగాలతో సతమతమవుతున్నాం.. ముల్కల్ల బాపురెడ్డి, ఎల్లక్కపేట వాసి**

మా ఇంటి సమీపంలో నిర్వహిస్తున్న ఆదిశంకరాచార్య పత్తిమిల్లు నుండి వెలువడే ప్రమాదకరమైన ధూళి ఇళ్ల ల్లోకి చేరుతున్న కారణంగా ప్రతీ ఏటా శ్వాసకోశ వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోగాల భారి నుండి తమ పిల్లలను కాపాడేందుకు ఊరికి దూరంగా బంధువుల ఇండ్లలోకి పంపిస్తున్నాం. పత్తి మిల్లు నిర్వాహకులపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

**పత్తిమిల్లు నిర్వహణ నిలిపివేయాలి.. రావుల రవిచందర్, ఎల్లక్కపేట గ్రామస్తుడు**

జనావాస ప్రాంతంలో నిర్వహించే పత్తిమిల్లు నుండి వెలువడే ప్రమాదకమైన ధూళి కారణంగా తాము అనారోగ్యాలకు గురవుతున్నా అధికారులు స్పందించడం లేదు. తమ ప్రాణాలంటే అధికారులకు లెక్కలేకుండా పోయింది. పత్తిమిల్లు నుండి వెలువడే ప్రమాదకరమైన ధూళి కారణంగా ప్రాణనష్టం జరగకముందే పత్తిమిల్లు నిర్వహణ నిలిపివేసి, జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేసుకొని, తమకు ఈ ఇబ్బందుల నుండి విముక్తి కల్పించాలి.

**పత్తిమిల్లు నిర్వాహకులను హెచ్చరించాం.. మధుకర్, కిష్టంపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి**

గ్రామస్తుల పిర్యాదు మేరకు పత్తిమిల్లు నిర్వాహకులకు సూచించడం జరిగింది. కానీ వారు గాలితో వెళ్లే ధూళిని మేమేలా ఆపగలం అని నిర్లక్ష్య సమాధానం ఇవ్వగా నేనేమీ చేయలేకపోయాను. విషయాన్ని ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళ్లి వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని కిష్టంపేట గ్రామ పంచాయితీ కార్యదర్శి మధుకర్ తెలిపారు.

## క్రీడ

# హైబ్రిడ్ మోడల్‌లోనే ఛాంపియన్స్ ట్రోఫీ

### అధికారికంగా ప్రకటించిన ఐసిసి

ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై కొనసాగుతోన్న సందిగ్ధతకు తెరపడింది. ఈ విషయంపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) తుది నిర్ణయం తీసుకుంది. హైబ్రిడ్ మోడల్‌లో ఛాంపియన్స్ ట్రోఫీని నిర్వహించేందుకు ఐసీసీ ఆమోదం తెలిపింది. 2024–27 మధ్య ఐసిసి మ్యాచ్‌లు హైబ్రిడ్ మోడల్‌లోనే జరగనున్నాయని వెల్లడించింది. ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లను భారత్ తటస్థ వేదికల్లో ఆడనుందని స్పష్టం చేసింది. 2024–27 సైకిల్‌లో భారత్ పాకిస్థాన్, తమ మ్యాచ్‌లను తటస్థ వేదికలపై ఆడేందుకు అంగీకరించడంతో ఈ నిర్ణయం తీసుకుంది. త్వరలోనే ఛాంపియన్స్ ట్రోఫీ పూర్తి షెడ్యూల్‌ను ప్రకటిస్తామని వెల్లడించింది. '2024 నుంచి 2027 వరకు ఇండియా, పాకిస్థాన్ హోస్ట్ చేసే ఐసిసి ఈవెంట్స్‌లో, ఈ రెండు జట్లు తటస్థ వేదికలపై ఆడేందుకు ఐసిసి ఆమోదం తెలిపింది. పాకిస్థాన్ చేసిన ప్రతిపాదనకు ఐసిసి అంగీకరించింది. త్వరలోనే ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్‌ను ప్రకటిస్తాం' అని ఐసిసి తన స్టేట్‌మెంట్‌లో తెలిపింది. దీంతో, ఛాంపియన్స్ ట్రోఫీతో పాటు వచ్చే ఏడాది భారత్‌లో జరగబోయే మహిళల ప్రపంచ కప్, 2026లో భారత్ శ్రీలంక సంయుక్తంగా నిర్వహించే టీ 20 ప్రపంచకప్ కూడా హైబ్రిడ్ మోడల్‌లోనే నిర్వహించనున్నారు. అయితే ఛాంపియన్స్ ట్రోఫీ 2025కు సంబంధించిన తటస్థ వేదిక ఏంటనేది ఐసిసి వెల్లడించలేదు. దుబాయ్ వేదికగానే భారత్ మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. అలానే హైబ్రిడ్ మోడల్‌కు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పిసిబి) అంగీకరించినందుకు మహిళల వన్డే ప్రపంచకప్ 2028 ఆతిథ్య



హక్కులను రివార్డ్‌గా ఇచ్చినట్లు ఐసిసి పేర్కొంది. 2029–2031 మధ్య జరిగే ఐసిసి మహిళల టోర్నీని ఆస్ట్రేలియా నిర్వహిస్తుందని పేర్కొంది. కాగా, 2017లో చివరిసారిగా ఛాంపియన్స్ ట్రోఫీ జరగగా, ఫైనల్లో టీమ్‌ఇండియాను ఓడించి పాకిస్థాన్ విజేతగా నిలిచింది. ప్రస్తుతం జరగబోయే టోర్నీలో భారత్, పాకిస్థాన్‌తో పాటు మొత్తం 8 జట్లు బరిలోకి దిగనున్నాయి.

### అసలేం జరిగిందంటే?

భారత్, పాకిస్థాన్ క్రికెట్ బోర్డుల మధ్య నెలకొన్న విభేదాల కారణంగా ఐసిసి, టోర్నీషెడ్యూల్ ప్రకటనను వాయిదా వేస్తూ వచ్చింది. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం తమ జట్టును పాకిస్థాన్‌కు పంపించమని, తమ మ్యాచ్‌లను తటస్థ వేదికగా నిర్వహించాలని బిసిసిఐ, ఐసిసిని కోరింది. తమ ఆటగాళ్ల భద్రతే తమకు ముఖ్యమని చెప్పింది. అయితే హైబ్రిడ్ మోడల్‌లో టోర్నీ నిర్వహించేందుకు మొదట్లో పిసిబి అంగీకరించలేదు. తమకు తీవ్ర నష్టం జరుగుతోందని వాదించింది. తమకు నష్ట పరిహారంతో పాటు భారత్ వేదికగా జరిగే టోర్నీలను కూడా హైబ్రిడ్ మోడల్‌లోనే నిర్వహించాలని డిమాండ చేసింది. ఫైనల్‌గా ఈ విషయంలో ఐసీసీ, మధ్యవర్తిత్వం చేసింది. అలా సుదీర్ఘ చర్చలు, సమావేశాల అనంతరం ఐసీసీ తాజాగా తుది నిర్ణయం తీసుకుంది.



# 'సంక్రాంతికి వస్తున్నాం' నుంచి మెస్మరైజింగ్ లవ్ నెంబర్ మీను రిలీజ్

విక్టరీ వెంకటేష్ హైలీ యాంటిసిపేటెడ్ హోల్సమ్ ఎంటర్టైనర్ 'సంక్రాంతికి వస్తున్నాం' ఎక్సటెన్సీవ్ ప్రమోషన్లతో ఇప్పటికే స్ట్రాంగ్ బజ్ క్రియేట్ చేసి ఆడియన్స్ దృష్టిని ఆకర్షించింది. ఇందులో వెంకటేష్ ఎక్స్ కాప్ పాత్రలో, ఐశ్వర్య రాజేష్ అతని భార్యగా, మీనాక్షి చౌదరి అతని ఎక్స్ లవర్ గా కనిపించనున్నారు. బ్లాక్ బస్టర్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. ఫస్ట్ సింగిల్ సింగిల్ గోదారి గట్టు, గ్లోబల్ టాప్ 20 వీడియోల లిస్టులోకి ఎంటరైయింది. సెకండ్ సింగిల్ 'మీను' ప్రోమో వెంకటేష్ పుట్టినరోజున విడుదలై ఫుల్ కోసం కోసం ఉత్సాహాన్ని రేకెత్తించింది, ఈ రోజు ఫుల్ సాంగ్ రిలీజ్ చేశారు. ఇన్స్టంట్‌గా కనెక్ట్ అయ్యే మరో మెస్మరైజింగ్ నెంబర్‌ని భీమ్స్ కంపోజ్ చేశారు. భార్య పాత్ర పోషించిన ఐశ్వర్య రాజేష్‌తో తన ప్రేమ కథను వెంకటేష్ వివరిస్తున్నట్లు ఈ పాట చిత్రీకరించారు. పోలీస్ అకాడమీలో ట్రైనర్గా పనిచేస్తున్నప్పుడు, అతను తన ట్రైనీ మీనాక్షితో ప్రేమలో పడతాడు. వారు వివిధ ప్రదేశాలను సందర్శిస్తారు, కలిసి కొన్ని మంచి క్షణాలను పంచుకుంటారు. వారి సాన్నిహిత్యం ఉన్నప్పటికీ, అతను ఆమెను ముద్దు పెట్టుకోకుండా తప్పించుకుంటాడు, తన మొదటి ముద్దు తన భార్యతో మాత్రమే అని రివిల్ చేస్తాడు.

## రీల్

# 'గేమ్ చేంజర్' నుంచి 'డోప్' సాంగ్ ప్రోమో



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్'. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన కియారా అద్వాణీ హీరోయిన్గా నటించారు. ఈ సినిమాను శ్రీమతి అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ అన్‌కాంప్రమైజడ్‌గా నిర్మించారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ మూవీ జనవరి 10న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ అవుతోంది. ఇప్పటికే రిలీజ్ చేసిన జరగండి, రా మచ్చా మచ్చా, నా నా హైరానా అనే పాటలు యూట్యూబ్‌లో ట్రెండింగా నిలిచిన సంగతి తెలిసిందే. ఇక రీసెంట్‌గా రిలీజ్ చేసిన గ్లింప్స్‌తో అంచనాలు ఆకాశన్నంటిన సంగతి తెలిసిందే. తాజాగా దిల్ రాజు పుట్టిన రోజు సందర్భంగా చిత్రం నుంచి నాలుగో పాటకు సంబంధించిన ప్రోమోను రిలీజ్ చేశారు.



హైదరాబాద్ గిరిప్రసాద్ భవన్‌లో 'ప్రజాపక్షం' దినపత్రిక 2025 క్యాలండర్‌ను గురువారం ఆవిష్కరించిన నవచేతన విజ్ఞాన సమితి అధ్యక్షులు పల్లా వెంకట్‌రెడ్డి, కార్యదర్శి బిఎస్‌ఆర్ మోహన్‌రెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్‌రావు, జనరల్ మేనేజర్ మధుకర్, ప్రజాపక్షం ఎడిటర్ ఎం. సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ బి. కిరణ్‌కుమార్, అసిస్టెంట్ ఎడిటర్ బి. లక్ష్మినారాయణ, న్యూస్ ఎడిటర్ పి. శ్రీనివాస్‌రెడ్డి, జనరల్ మేనేజర్ (యాడ్స్) వి. మదన్. ప్రెస్ ఇన్‌చార్జి జనార్ధన్‌రెడ్డి.

# 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' ట్రైలర్ రిలీజ్



వెన్నెల కిషోర్ టైటిల్ రోల్ పోషిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' రైటర్ మోహన్ రచన, దర్శకత్వం వహించారు. లాస్యారెడ్డి సమర్పణలో శ్రీ గణపతి సినిమాస్ బ్యానర్‌పై వెన్నపూస రమణారెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. టీజర్ విడుదలైన తర్వాత సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ అయ్యింది ఈ రోజు, థియేట్రికల్ ట్రైలరును విడుదల చేశారు. మేరీ అనే యువతి హత్య సంచలనంగా మారడంతో బీచ్‌లో జరిగే వరుస హత్యల చుట్టూ కథ తిరుగుతుంది. కేసును ఛేదించలేక, పోలీసులు క్రియేటివ్, కాలిక్యులేటివ్ ఎప్రోచ్‌తో పాపులరైన ఒక ప్రైవేట్ డిటెక్టవ్ నియమిస్తారు. డిటెక్టివ్ గ్రామంలోని ప్రేమజంటతో సహా అనుమానితులను ఏడుగురిని గుర్తిస్తాడు. రైటర్ మోహన్ కథను ఎంగేజింగ్, సస్పెన్సా ప్రజెంట్ చేశారు. వెన్నెల కిషోర్ శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ టైటిల్ క్యారెక్టర్ కు జీవం పోశాడు. అతని హ్యూమర్ బిహేవియర్ ఉన్నప్పటికీ, కేసును పరిష్కరించడంలో అతని పద్ధతి, తెలివితేటలు ఆకట్టుకునేలా ఉనాయి. రవితేజ మహద్యం, అనన్య నాగళ్ల ప్రేమ జంటగా నటించగా, సీయా గౌతమ్ పోలీస్ కానిస్టేబుల్‌గా ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది.

# రైతు వ్యతిరేక చట్టాలను కేంద్రం ఉపసంహరించాలి

### రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ బాలమల్లేష్‌కు, పోటు ప్రసాద్‌కు సంతాపం



ప్రజాపక్షం/శామీర్‌పేటః రద్దు చేసిన రైతు వ్యతిరేక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిస్సిగ్గుగా అమలుకు పూనుకుంటుందని వెంటనే ఆ చట్టాలను ఉపసంహరించుకోవాలని లేకుంటే తమ ఉద్యమాలను ఉధృ తం చేస్తామని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. గురువారం శామీర్‌పేట మండలం మినిస్టేడియంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి మూడవ మహసభలకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఇటీవల మృతి చెందిన బడుగు బలహీన వర్గాల అశాజ్యోతి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ బాలమల్లేష్ చిత్రపటానికి నివాళులర్పించి మౌనం పాటించారు. అలాగే ఖమ్మం జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోటు ప్రసాద్‌కు సంతాపం తెలిపారు. అనంతరం పశ్య పద్మ మాట్లాడుతూ రైతు వ్యతిరేక మూడు చట్టాలను వెనక్కి తీసుకున్న కేంద్ర ప్రభుత్వ పాలకులు తిరిగి దొంగచాటుగా నిసిగ్గుగా అమలు చేయడానికి పూనుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. రాష్ట్రంలోని రైతులకు అనేక మందికి రైతు బంధు, రైతు రుణమాఫీ కాలేదని దీంతో పాటు రైతు బీమా కూడ ఇవ్వలేదని వెంటనే రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశా రు. సన్నవడ్లతో పాటు దొడ్డు ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించాలన్నారు. కౌలు రైతులకు గుర్తి ంపు కార్డు ఇవ్వాలని, వారికి బ్యాంక్ రుణాలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్నభూభారతిలో పెండింగ్‌లో ఉన్న సాధా బైనామాలు క్రమబద్ధీకరించాలన్నారు. గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ మాట్లాడుతూ సర్వే నెంబర్ 87లో 52ఎకరాల 20 గుంటల భూమి కోల్పోయిన అంతాయిపల్లి రైతులకు డబుల్‌బెడ్‌రూమ్‌లు, ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాలకు 2 ఎకరాల భూమి కేటాయిస్తామని చెప్పి నేటికి గత ప్రభుత్వం న్యా యం చేయలేదన్నారు. 1284లో సాగు చేస్తున్న భూములకు సంబందించిన పట్టాదార్ పాసు పుస్తకాలను ఇవ్వాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ భూము లు, సీలింగ్ భూములు, చెరువు శిఖం భూములు, కబ్జాలు కాకుండా హద్దు రాళ్లు పాతి కాపాడాలన్నారు. శామీర్‌పేట పెద్దచెరువు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత తహశీల్దార్‌పై ఉందని చెప్పారు.

### జిల్లా రైతు సంఘం నూతన కమిటీ ఎన్నిక

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మూడవ మహసభల్లో జిల్లా రైతు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా సామల వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడు జంగయ్య, ఉపాధ్యక్షులుగా అంజనేయులు, డిజి సాయిలుగౌడ్, ఉప్పలయ్య, కార్యనిర్వాహక అధ్యక్షులుగా డిజి నరేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా నిమ్మల నర్సింహా, సహయ కార్యదర్శిగా మాచర్ల కనకయ్య, కోశాధికారిగా చంద్రయ్య, కార్యవర్గ సభ్యులుగాదర్శన్, రాజిరెడ్డి, కౌసల్య, కమలమ్మ, మహ్మద్, అనిత, వెంకటేష్, ఎల్లయ్యలను ఎన్నుకున్నారు.

# దేశవ్యాప్తంగా నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పి రాజీనామా చేయాలని మేము కోరుకుంటున్నామ' అని ఆయన అన్నారు. తాము మా డిమాండ్‌తో పాటు అదానీ అంశాన్ని కూడా లేవనెత్తుతూనే ఉంటామని స్పష్టం చేశారు. 'అమిత్ షా, క్షమాపణ చెప్పండి , రాజీనామా చేయండి' అని తరువాత రాహుల్‌గాంధీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అమెరికాలో అదానీపై కేసు నమోదు చేయబడిన అంశం కొద్ది రోజులు క్రితం ప్రస్తావనకు వచ్చిందని, దీనిపై బిజెపి సభలో ఎటువంటి చర్చకు అనుమతించలేదని ఆయన అన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ కృషిని తుడిచిపెట్టాలని బిజెపి,ఆర్‌ఎస్‌ఎస్ అనుకుంటున్నాయన్నారు. అందరిముందు అంబేద్కర్ పట్ల తమ ఆలోచనను చెప్పారని అన్నారు. తాము షా రాజీనామా కోరినప్పటికీ అది జరగలేదని, 'మళ్ళీ ఆయన సమస్యను మళ్లించడానికి ప్రయత్నించారని' అన్నారు. 'మేము అంబేద్కర్ విగ్రహం నుండి పార్లమెంటుకు శాంతియుతంగా వెళ్తున్నాము. బిజెపి ఎంపీలు పార్లమెంటు మెట్లపై నిలబడి ఉన్నారు. వారు మమ్మల్ని లోపలికి వెళ్లనివ్వలేదు. అమిత్ షా అంబేద్కర్ జీని అవమానించారు, దానికి ఆయన క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలి. బిజెపి ప్రధాన సమస్య అదానీ కేసు, దానిపై వారు ఎటువంటి చర్చను కోరుకోవడం లేదు. నరేంద్ర మోదీ భారతదేశాన్ని అదానీకి అమ్మేస్తున్నారు' అని రాహుల్‌గాంధీ విమర్శించారు. పార్లమెంటు వద్ద జరిగిన సంఘటనలను వివరిస్తూ, తాము పార్లమెంటు లోపలికి వెళ్లాలని అనుకున్నారని, కానీ బిజెపి నాయకులు వచ్చి మమ్మల్ని ఆపడానికి గేటు వద్ద కూర్చున్నారని ఆయన తెలిపారు. ఇండియా బ్లాక్‌కు చెందిన మహిళా ఎంపిలను కూడా లోపలికి రాకుండా అడ్డుకున్నారని ఆయన అన్నారు. 'మేము పార్లమెంటు మకర ద్వారం వైపు నడుస్తున్నప్పుడు కూడా, ఆ వ్యక్తులు మమ్మల్ని ఎగతాళి చేస్తున్నారు. దేశంలో బిజెపి సృష్టించిన వాతావరణాన్ని ఇకపై సహించము. ఈ కారణంగా నేడు దేశ వ్యాప్తంగా ఒక ఉద్యమం జరుగుతోంద'ని ఖర్గే చెప్పారు.

# బర్తరఫ్ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

బి.మహేష్ కుమార్‌గౌడ్ , మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ పార్టీ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు నిరసన వ్యక్తం చేశారు. అమిత్ షాను వెంటనే మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని, అమిత్‌షా డౌన్ డౌన్ అని మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంఎల్‌ఎలు నినాదాలు చేశారు. మరో వైపు మంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ట్యాంక్ బ్యాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎంపి వి.హనుమంతరావుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ అంబేద్కర్‌పై మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు భారత రాజ్యాంగానికి ఇది ఘోర అవమానమని, బిజెపి అహంకారానికి నిదర్శనమన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ తమకు దేవుడని, అమిత్‌షా వ్యాఖ్యలతో దళిత, గిరిజన, బిసి, మైనారిటీ, దేశ ప్రజల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుస్మృతిని అమలు చేసేందుకు సంఘ్ పరివార్ చేస్తున్న కుట్రలో భాగంగానే ఇదంతా జరుగుతుందని విమర్శించారు. మనుస్మృతిని బిజెపి విశ్వసిస్తున్నందునే అనుక్షణం రాజ్యాంగంపై దాడి చేస్తోందని, రాజ్యాంగ నిర్మాతను ప్రతి సారి హేళన చేస్తోందని, రాజ్యాంగంపై, జాతీయ జెండాపై బిజెపికి గౌరవం లేదని మరోసారి నిరూపితమైందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బడుగు బలహీన వర్గాల కోసం తపించే కాంగ్రెస్ లక్షలు, కోట్ల సార్లు అయినా డాక్టర్ అంబేద్కర్ పేరు తలుస్తూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీ, నెహ్రూలను విమర్శిస్తున్న బిజెపి నిత్యం అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని తప్పుపడుతున్నారని, ఇప్పుడు అంబేద్కర్‌ను కూడా తూలనాడుతున్నారని, అమిత్‌షాపై చర్యలు తీసుకునేంతవరకూ కాంగ్రెస్ పోరాడుతూనే ఉంటుందని ఆయన ప్రకటించారు.

# ఎంపిల జగడం

(మొదటి పేజీ తరువాయి)

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గురువారం ఉ దయం 11 గంటలకు ఉభయసభలూ సమావేశం కావడానికి కొద్ది నిమిషాలు ముందుగా ఈ సంఘటనలు చోటుచేసుకున్నాయి. అటు ''ఇండియా''కూటమి ఎంపీలు, ఇటు ఎన్‌డిఎ కూటమి ఎంపీలు సభా ప్రవేశద్వారం 'మకర్ ద్వార్' వద్ద పరస్పరం ఎదురుపడినప్పుడు ఈ అనుచిత ఘటనలు జరిగాయి. లోక్‌సభ కార్యకలాపాలలో పాల్గొనేందుకు వెళుతున్న రాహుల్‌గాంధీ నడిచి వెళ్ళడానికి వీలుగా దారి ఇచ్చేందుకు బిజెపి ఎంపీలు తిరస్కరించారని, వారు దారికి అడ్డగా నిలబడ్డారని కాంగ్రెస్ ఎంపీలు ఆరోపించారు. బిజెపి ఎంపీలు చేసిన ఆరోపణలను రాహుల్‌గాంధీ కూడా తిరస్కరించారు. ''నేను పార్లమెంటు లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నం చేశాను, బిజెపి ఎంపీలు నన్ను అడ్డుకున్నారు, నన్ను గెంటేశారు, బెదిరించారు'' అని రాహుల్‌గాంధీ చెప్పారు. ఐతే, రాహుల్‌గాంధీ తనపట్ల అనుచితంగా ప్రవర్తించారని నాగాలాండ్‌కు చెందిన బిజెపి మహి ళా ఎంపి ఫాంగ్నాన్ కోన్యాక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.అంతకుముందు అంబేద్కర్‌కు వ్యతిరేకంగా అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పార్లమెంటు ప్రాంగణంలో ప్రతిపక్ష ఎంపీలు నిరసన ప్రదర్శన జరిపారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, కె.కనిమొళి సహా ఇతర డిఎంకె, ఆర్‌జెడి, సమాజ్‌వాదీపార్టీ, వామపక్షాలు, ఎన్‌సిపి (ఎస్‌పి) తదితరపార్టీల ఎంపీలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. పార్లమెంటరీ వ్యవహారాలమంత్రి కిరెణ్ రిజిజు రాహుల్‌గాంధీపై తీవ్ర విమర్శలకు దిగారు. ''పార్లమెంటు అంటే భుజ బల ప్రదర్శనశాల కాదు, ఇదేమీ మల్లయోధుల కుస్తీ వలయం కాదు,ఈ విషయంలో ఆయనపై తగిన చర్యలు తీసుకుంటాం'' అన్నారు. కాగా కాంగ్రెస్ ఎంపిలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలుసుకుని ఒక ఫిర్యాదు ఇచ్చారు. రాహుల్‌గాంధీ పార్లమెంటులోపలికి ప్రవేశిస్తుండగా బిజెపి ఎంపీలు ఆయనను అడ్డుకునే ప్రయత్నం చేశారనీ, పోకిరీతనంతో ప్రవర్తించారనీ ఓంబిర్లాకు ఫిర్యాదు చేశారు. రాహుల్‌గాంధీ ఒక ఎంపీని గట్టిగా గెంటేశారనీ, ఈ కారణంగా ఇద్దరు ఎంపీలు గాయపడ్డారని బిజెపి ఆరోపించింది. రాహుల్‌గాంధీ ఈ ఆరోపణలను తిరస్కరించారు. నిజానికి తననే ఒక అధికారపార్టీ ఎంపి గెంటేశారని చెప్పారు. కానీ రాహుల్‌గాంధీ గెంటేయడంవల్ల బిజెపి ఎంపీలు ముకేశ్ రాజ్‌పుత్, ప్రతాప్ చంద్ర సారంగిలకు గాయాలు తగిలాయని ఎన్‌డిఎ ఎంపీలు ఆరోపించారు. వారిద్దరినీ ఆర్‌ఎంఎల్ ఆసుపత్రిలో చేర్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వారిద్దరితో ఫోన్‌లో మాట్లాడి వారి క్షేమసమాచారాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అజయ్ శుక్లా మాట్లాడుతూ, వారిద్దరికీ తలకు గాయాలయ్యాయని చెప్పారు. ''మేం రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా పోలీసు కేసు పెట్టాం. ఆయన భౌతిక దాడికి పాల్పడ్డారు, దాడికి పురిగొల్పారు'' అని బిజెపి ఎంపి అనురాగ్ థాకూర్ పోలీస్ స్టేషన్‌లో మీడియా సిబ్బందికి చెప్పారు. అంబేద్కర్‌ను అవమానించారంటూ కాంగ్రెస్‌పార్టీ చేసిన ఆరోపణలకు వ్యతిరేకంగా పెద్దసంఖ్యలో అధికార బిజెపి ఎంపీలు నిరసన ప్రదర్శన చేస్తున్నారు. వారంతా చట్టసభ సభ్యులకు ప్రత్యేకంగా రిజర్వుచేసిన పార్లమెంటు ప్రవేశద్వారం ''మకర్ ద్వార్'' వద్ద మెట్లపై నిలబడి నిరసన తెలియజేస్తున్నారు. ఈ నిరసన ప్రదర్శనలో ఎన్‌డిఎ కూటమి ఎంపీలు పెద్దసంఖ్యలో ఉన్నారు. అదేసమయంలో కాంగ్రెస్‌పార్టీకి చెందిన ఎంపీలు, వారి మిత్రపార్టీలకు చెందిన ఎంపీలు కూడా నిరసన ప్రదర్శన చేస్తూ వచ్చారు. అంబేద్కర్‌కు వ్యతిరేకంగా అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వారు నినాదాలు చేస్తూ అక్కడికి చేరుకున్నారు. రాజ్యాంగ నిర్మాతను అమిత్ షా కించపరచారని వారు నినాదాలు చేశారు. ఆ సమయంలో రాహుల్‌గాంధీ పార్లమెంటు లోపల మెట్ల మధ్యలో నిలబడి ఉన్న బిజెపి ఎంపీలను గెంటేసందుకు ప్రయత్నం చేశారని, పక్కనుండి వెళ్ళేందుకు మరోదారి ఉన్నగానీ అటు వెళ్ళకుండా వారి మధ్యలోంచి వచ్చి గెంటేసేందుకు యత్నించారని బిజెపి ఎంపీలు ఆరోపించారు. ఒడిశా బాలాసోర్ నియోజకవర్గం నుండి గెలిచిన 69 సంవత్సరాలు వయసుగల బిజెపి ఎంపి, మాజీమంత్రి సారంగికి ఎడమవైపు కంటి రెప్పలపక్కన–చెవిముందు కణతిభాగంలో గాయమైందని, ఈ సీనియర్ నాయకుణ్ణి రాహుల్‌గాంధీ గెంటేశారని మరో బిజెపి ఎంపి నిషికాంత్ దూబే ఆరోపించారు. ''మీకు సిగ్గుగా లేదా రాహుల్? గూండాగిరీ ప్రవర్తనకు పాల్పడ్డారు. ఒక ముసలివాణ్ణి గెంటేశారు మీరు?'' అని తీవ్రస్థాయిలో రాహుల్‌గాంధీపై నిషికాంత్ దూబే విరుచుకుపడ్డారు. ఐతే రాహుల్‌గాంధీ కూడా ఆయన వ్యాఖ్యలపై ప్రతిస్పందించారు.''ఆయననన్నుగెంటేశారు'' అని దూబేపై రాహుల్‌గాంధీ విమర్శలు చేశారు. రాహుల్‌గాంధీ చాలా నిర్లక్ష్యంగా సారంగివైపు చూసుకుంటూ వెళ్ళిపోయారనీ, ఆ తర్వా త ఆయనను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించామని బిజెపి ఎంపీలు ఆరోపించారు. ''రాహుల్‌గాంధీ ఒక ఎంపినీ గెంటేశారు,ఆయనవచ్చినామీద పడ్డారు, నాకు గాయాలు తగిలాయి'' అని గాయపడిన సారంగి పాత్రికేయులకు చెప్పారు. ఆ తర్వాత మకర్ ద్వార్ వద్ద బిజెపి ఎంపీలు పెద్దపెట్టున కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ''నేను నాలుగుసార్లు ఎంపీగా గెలిచాను, ఈ విధమైన ఘటనలు చూడటం నాకు ఇదే మొదటిసారి, ఈ విధంగా కాంగ్రెస్, బిజెపి ఎంపీలు పరస్పరం విమర్శలు చేసుకోవడం, గెంటుకోవడం, ఒకరి ప్రదర్శనలలోకి మరొకరు దూసుకురావడం నేను ఎప్పుడూ చూడలేదు, మరి ఈనాడు బిజెపి నిరసన ప్రదర్శనకు కాంగ్రెస్‌పార్టీ ఎందుకు భంగం కలిగించింది?'' అని దూబే ప్రశ్నించారు. మరోవైపు ఉభయసభల్లో కూడా ఈ ఘటనలపై తీవ్ర వాగ్వాదం, పరస్పర విమర్శలు, నినాదాలు కొనసాగాయి.

### బిజెపి ఎంపీల దౌర్జన్యంపై విచారణ జరపాలి

రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేపట్ల బిజెపి ఎంపీలు దౌర్జన్యంగా ప్రవర్తించారని పార్లమెంటు వీధిలోని పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ ఎంపీలు ఫిర్యాదు చేశారు. ఎంపీల ప్రతినిధిబృందంలో దిగ్విజయ్‌సింగ్, ముకుల్ వాస్నిక్, రాజీవ్‌శుక్లా, ప్రమోద్ తివారీలు ఉన్నారు. నిరసన ప్రదర్శన చేస్తున్న బిజెపి ఎంపీలు తనను గెంటేశారని, దాంతో తనకు మోకాళ్ళపై గాయాలు తగిలాయని మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు అందిందనీ, దీనిని పరిశీలిస్తున్నామనీ సీనియర్ పోలీసు అధికారి ఒకరు చెప్పారు. 84 ఏళ్ళు వయసుగల దళిత నాయకుడు, తమపార్టీ అధ్యక్షుడు ఖర్గేను గెంటేశారని, ఆయనపట్ల అనుచితంగా ప్రవర్తించారనీ కాంగ్రెస్ ఎంపీల బృందం ఫిర్యాదు చేసింది. బిజెపి ఎంపీల చేతుల్లో కర్రలు ఉన్నాయనీ, ఖర్గేను బెదిరించారనీ, గెంటేశారని ఫిర్యాదు చేశారు. ఖర్గే కూడా ఓంబిర్లాకు ఒక లేఖ రాస్తూ, బిజెపి ఎంపీలు పార్లమెంటు ప్రాంగణంలో తనను గెంటేశారనీ, తాను పట్టుతప్పి పడిపోయాననీ ఫిర్యాదు చేశారు. అది కేవలం తనపై జరిగిన దాడి మాత్రమేకాదనీ, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిపై జరిగినదాడిఅనీఖర్గే ఆ లేఖలో పేర్కొన్నారు. బిజెపి ఎంపీలు తనను గెంటేసిన ఘటనపై విచారణకు ఉత్తర్వులు జారీ చేయాలని ఓంబిర్లాను ఖర్గే కోరారు.''ఇది పార్లమెంటులోకి వెళ్ళే ప్రవేశద్వారం,లోపలికి వెళ్ళేందుకు మాకు హక్కు ఉంది, బిజెపి సభ్యులు మమ్మల్నిలోపలికి వెళ్ళకుండా అడ్డుకున్నారు'' అని ఖర్గే ఆరోపించారు. రాహుల్‌గాంధీ కూడా ఇదేవిధమైన ఆరోపణలు చేశారు. బిజెపి ఎంపీలు రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు ఖర్గేపై దౌర్జన్యం చేశారని, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని గెంటేశారని పార్లమెంటుకు అప్రతిష్ట తీసుకువచ్చారనీ కాంగ్రెస్‌పార్టీ విమర్శించింది. సభాపతులకు లేఖలు రాసింది.

# హక్కుల ఉల్లంఘన నోటీసు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ఉల్లంఘించారు, రూల్ 188 నిబంధనల ప్రక్రియను ఉల్లంఘించారు'' అని పేర్కొన్నారు. 75 సంవత్సరాల రాజ్యాంగ సుదీర్ఘ ప్రస్థానంపై చర్చకు సమాధానం ఇస్తూ ఈనెల 17వ తేదీన రాజ్యసభలో అమిత్ షా అంబేద్కర్ ప్రతిష్టకు, గౌరవానికి భంగం కలిగించేలా అవమానకరమైన వ్యాఖ్యలు చేశారు. సభసాక్షిగా ఎలాంటి అనుచిత ప్రవర్తన చేసినా, అగౌరవకరమైన ఎలాంటి ప్రకటనలు చేసినా అది సభాహక్కుల ఉల్లంఘన కిందకే వస్తుంది'' అని ఖర్గే తన నోటీసులో పేర్కొన్నారు. ఆయన ఉపయోగించిన పదజాలం, ఎగతాళి, నిందాస్తుతి చాలా అవివేకంగా, అపకీర్తి కలిగించేవిగా ఉన్నాయని, అందువల్ల ఆయనకు వ్యతిరేకంగా హక్కుల ఉల్లంఘన చర్యలు తీసుకోవాలని కోరారు.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com